ANN తెలుగు

Follow: @ANNTELUGU

17-02-2026

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్  సంపుటి- 23  సంచిక- 50  పేజీలు-08  వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI  REGISTERED NUMBER: APTEL/2003/09316  WWW.EPAPER.MAHAADAILY.COM


టాప్ న్యూస్

**11 మున్సిపాలిటీల్లో**
### చైర్‌పర్సన్ల ఎన్నిక
- నేటికి ప్రకటించిన ఎస్ఈసీ
- కొందరికి అనూహ్యంగా వరించిన అదృష్టం

02

**ముఖ్యమంత్రి అవ్వాలని**
### ఉంది
- మాజీ మంత్రి మల్లారెడ్డి



02

**ఇక మేఘా గ్రూపు ఉద్యోగిగా**
### సీబీఐ మాజీ జేడీ
- రాజకీయాల్లో సక్సెస్ రాకపోవడంతో దారి మార్చిన లక్ష్మీనారాయణ



08



**ఏపీలో కలిసిన ఐదు గ్రామాలు**
## తెలంగాణలో విలీనం చేయాలి
**భద్రాద్రి కరకట్ట మరమ్మత్తులకు సహకరించాలి**
**చంద్రబాబును కోరిన మంత్రి తుమ్మల**

**అమరావతి, మహా :** రాష్ట్ర పునర్విభజన సమయంలో భద్రాచలం మండలానికి ఆనుకుని ఉన్న ఏపీలోని ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు నాయుడిని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కోరారు. యేటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామ పంచాయతీలు భౌగోళికంగా తెలంగాణ ప్రాంతాల మధ్యలో ఉండటంతో ప్రజలు పరిపాలనా పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సోమవారం ఏపీ రాజధాని అమరావతి వెళ్లి ఖమ్మం జిల్లాకు సంబంధించిన సాగునీటి వసతులు, భక్తులు, ప్రజల సౌకర్యానికి సంబంధించిన పలు కీలక విజ్ఞప్తులు చేశారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటనలో పేర్కొంటూ విలీన గ్రామాలు గోదావరి నది, అటవీ ప్రాంతాల మధ్య ఉండటంతో ఆంధ్రప్రదేశ్‌కు మిగతా 2లో



**సన్న వడ్లకు**
## బోనస్
**రూ.514.36 కోట్లు విడుదల చేసిన సర్కార్**
**రైతులకు గుడ్ న్యూస్**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు తీపి కబురు అందించింది. గత ఖరీఫ్ సీజన్ సంబంధించి పెండింగ్ వరి సన్న రకాల బోనస్ బకాయిలు ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలో సన్న రకాల వరి పంట సాగు చేసిన అన్నదాతలకు క్వింటాల్ ధరపై 500 రూపాయల బోనస్ కోసం 514.36 కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఈ మేరకు ఆర్థిక కేటాయింపులు చేసినట్లు పౌరసరఫరాల శాఖ అధికార వర్గాలు వెల్లడించాయి. మిగతా 2లో

**బంగారం తులం**
## రూ.90 వేలు
**దిగిరాక తప్పదంటున్న ఎనలిస్టులు**



**మహా:** బంగారం ధరలు సమీప భవిష్యత్తులో భారీగా పడిపోయే అవకాశం ఉందని, 2027 చివరి నాటికి 10 గ్రాముల బంగారం ధర రూ. లక్ష లోపునకు దిగిరావొచ్చని ప్రముఖ మిగతా 2లో



# పురపీఠాలపై కాంగ్రెస్ రెపరెపలు

## 105లో 85 గెలిచిన కాంగ్రెస్

**రేవంత్ మ్యాజిక్.. ప్రతిష్టాత్మకంగా పనిచేసిన మంత్రులు**
**17తో సరిపెట్టుకున్న బీఆర్ఎస్.. ఒక్క సీటుకే పరిమితమైన బీజేపీ**
**మరో 11 స్థానాలకు నేడు ఎన్నిక.. మెజారిటీ స్థానాలపై కన్నేసిన కాంగ్రెస్**
**నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో కాంగ్రెస్ అనూహ్య విజయాలు**
**బీఆర్ఎస్ సహకారంతో కరీంనగర్ గండం గట్టెక్కిన బీజేపీ**

**(మహా నెట్ వర్క్ )**

పురపీఠాలపై కాంగ్రెస్ జెండా రెపరెపలాడింది. 116 మున్సిపాలిటీల్లో 11చోట్ల ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్ ఎన్నికలు వాయిదా పడగా 85 చోట్ల పీఠాల్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకత, మంత్రులందరూ తమకు అప్పగించిన జిల్లాల్లో చేసిన శ్రమతో కాంగ్రెస్ అపూర్వవిజయాలు అందుకుంది. ఫలితాలు వచ్చిన రోజు.. 70లోపు మునిసిపాలిటీలు సాధించిన కాంగ్రెస్, ఛైర్మన్ల ఎన్నిక నాటికి 85 మునిసిపాలిటీలు తమ ఖాతాలో వేసుకుంది. మిగతా 11 స్థానాల్లో మెజారిటీ సాధించి సెంచరీ కొట్టాలన్న వ్యూహంతో ఉంది. పూర్తి ఆధిక్యం ఉన్న పట్టణాల్లో ఏకపక్షంగా మునిసిపల్ పీఠాలు చేజిక్కించుకోగా బలం లేనిచోట ఎంఐఎం, ఇండిపెండెంట్లు, ఎక్స్అఫిషియో అస్త్రంతో మున్సిపాలిటీలను తమ ఖాతాలో వేసుకుంది. బీఆర్ఎస్ 17 పురపాలికల్ని దక్కించుకోగా బీజేపీ నారాయణపేట మున్సిపాలిటీతో సరిపెట్టుకుంది. ఆదిలాబాద్ మునిసిపాలిటీపై బీజేపీ ఆశలు పెట్టుకోగా, కాంగ్రెస్ పార్టీ ఇతరుల మద్దతుతో ఆ ఆశలు గల్లంతుచేసింది. మిగతా 2లో

### 17 మున్సిపాలిటీలను దక్కించుకున్న బీఆర్ఎస్

బీఆర్ఎస్ 17 పుర పీఠాల్ని దక్కించుకుంది. గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, జిన్నారం, ఆలంపూర్, అయిజ, మూడు చింతలపల్లి, ఎల్లంపేట, దుబ్బాక, రాయికల్, ఆసిఫాబాద్, తిరుమలగిరి, గజ్వేల్, చేర్యాల, జమ్మికుంట, సిరిసిల్ల, తూఫ్రాన్ పురపాలికల్లో గులాబీ జెండా ఎగురవేసింది. బీజేపీ నారాయణపేట మున్సిపాలిటీని దక్కించుకోగా ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ వడ్డేపల్లి మున్సిపాలిటీని చేజిక్కుంచుకుంది.

### ఒక్క మునిసిపాలిటీతో సరి

బీజేపీ ఒకే ఒక్క మునిసిపాలిటీ నారాయణపేటను కైవసం చేసుకుంది. ఎంపీ డీకే అరుణ ఎక్స్ అఫీషియోగా నమోదుచేసుకుని దీనిని గెలిచింది. బీజేపీ ఎమ్మెల్యేలున్న చోట ఎక్కడా ఒక్క మునిసిపాలిటీ కూడా గెలవలేకపోయింది.

## సామాన్యులకు మేయర్ పట్టం

**కూరగాయలు అమ్ముకునే మహిళకు మేయర్ పదవినిచ్చిన కాంగ్రెస్**
**ఆటో డ్రైవర్ ను మేయర్ పీఠంపై కూర్చోబెట్టిన సీపీఐ**
**తెలంగాణలోని కొత్త మేయర్లు, డిప్యూటీ మేయర్లు వీరే**
**కాంగ్రెస్ -5, బీజేపీ-1, సీపీఐ-1**

02



## ఆదిలాబాద్ కాంగ్రెస్ దే

### పాయల్ శంకర్‌కు షాకిచ్చిన కంది

**బీజేపీకి 23.. కాంగ్రెస్ కూటమికి 27.. పట్టుబట్టి కాంగ్రెస్ కు ఛైర్ పర్సన్ వచ్చేలా కృషి**
**డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ తో కలిసి చక్రం తిప్పిన కంది శ్రీనివాసరెడ్డి**
**ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం**



**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ మునిసిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగిరింది. కాంగ్రెస్ పార్టీ ఇతరుల మద్దతుతో మునిసిపాలిటీని కైవసం చేసుకుంది. కాంగ్రెస్ అభ్యర్థి బండారి అనూష సతీష్ మునిసిపల్ ఛైర్ పర్సన్ కాగా, వైస్ ఛైర్మన్ గా ఎంఐఎం పార్టీకి చెందిన మహ్మద్ రోహిత్ ఎన్నికయ్యారు. ఆదిలాబాద్ మునిసిపల్ ఛైర్ పర్సన్ పదవి బీజేపీకి దక్కకుండా కాంగ్రెస్ కైవసం చేసుకోవడంలో కంది శ్రీనివాసరెడ్డి వ్యూహాత్మకంగా డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ తో కలిసి ఇతరుల మిగతా 2లో



**ప్రధానికి మాటిచ్చా...**
## గెలిపించి సాధించా...
**కరీంనగర్ మేయర్ పీఠం దక్కడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్**

**కరీంనగర్, మహా :** కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజల తీర్పును పక్కనబెట్టి కాంగ్రెస్ కుట్రలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక విషయంలో అధికారాన్ని దుర్వినియోగం చేసి బీజేపీకి మేయర్ పదవి రాకుండా అడ్డుకుందని మండిపడ్డారు. బీజేపీ బలపడుతున్నందుకే కాంగ్రెస్ భయపడుతోందని అన్నారు. ప్రజల్లో బీజేపీకి పెరుగుతున్న ఆదరణను కాంగ్రెస్ తట్టుకోలేకపోతోందని పేర్కొన్నారు. తాను ప్రధాని నరేంద్ర మోదీకి మాటిచ్చానని, కరీంనగర్‌లో బీజేపీని గెలిపించి తన హామీని నిలబెట్టుకున్నానని తెలిపారు. కరీంనగర్ ప్రజలు ఎప్పటికీ బీజేపీతోనే ఉంటారని, భవిష్యత్తులో కూడా పార్టీ విజయాలను కొనసాగిస్తుందని బండి సంజయ్ పేర్కొన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌ను బీజేపీ దక్కించుకుంది. 34 మంది కార్పొరేటర్ల మద్దతుతో ఆ పార్టీ నేత కొలగాని శ్రీనివాస్ మేయర్‌గా ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్‌గా కూడా అదే పార్టీకి చెందిన సునీల్‌రావు అనే వ్యక్తి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి అధికారికంగా ఈ విషయాన్ని వెల్లడించారు. మేయర్ పదవిని సాధించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కీలక పాత్ర పోషించారు.

## ఏపీలో టెక్ పాలన గ్రేట్

- ఆర్జీజీఎస్ సందర్శన అనంతరం బిల్ గేట్స్ వ్యాఖ్య
- డేటాలేక్, సంజీవని, అమరావతి ప్రాజెక్టుల గురించి గేట్స్ కు వివరించిన సీఎం
- ప్రజల జీవితాల్లో ఆర్టీజీఎస్ మార్పు తెస్తోందన్న సీఎం చంద్రబాబు

02






# పురపీఠాలపై కాంగ్రెస్ రెపరెపలు

(మొదటిపేజీ తరువాయి)

ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. భైంసాలో స్వతంత్రులు ఇతర పార్టీల మద్దతుతో గెలిచారు. రాజకీయ పార్టీల ఎత్తుకు పైఎత్తులతో అనేక మున్సిపాలిటీల్లో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి.

**మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హవా**

పురపాలక ఎన్నికల ఫలితాల్లో మెజార్టీ వార్డుల్ని కైవసం చేసుకుని సత్తా చాటిన కాంగ్రెస్ ఛైర్‌పర్సన్, డిప్యూటీ ఛైర్‌పర్సన్ ఎన్నికలోనూ హవా కొనసాగించింది. 116 మున్సిపాలిటీలకు గానూ 11 పురపాలికల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు వాయిదా పడగా మిగిలిన వాటిలో 85 పీఠాల్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఎంఐఎం, ఎక్స్‌అఫీషియో ఓటు సహా స్వతంత్రుల బలంతో పట్టణాలపై కాంగ్రెస్ జెండా ఎగురవేసింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో తిరుమలగిరి మినహా అన్ని పురపీఠాల్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 14 పురపాలికల్ని హస్తగతం చేసుకుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 10 మున్సిపాలిటీల్ని దక్కించుకుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడింటికి ఏడు మున్సిపాలిటీల్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 9 పురపాలికల్ని దక్కించుకుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9 మున్సిపాలిటీలు దక్కించుకుంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 10 పురపీఠాల్ని చేజిక్కించుకుంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఏడింటికి ఏడు పురపాలికల్ని కైవసం చేసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆరింటిలో పాగా వేసింది. ఉత్కంఠకు గురిచేసిన ఆదిలాబాద్ మునిసిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకుంది.

**11చోట్ల ఉద్రిక్తత.. వాయిదా**

నాటకీయ పరిణామాల మధ్య ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, కేతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, జనగామ, తొర్రూరు పురపాలికల్లో ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నిక వాయిదా పడింది. తొర్రూరు మున్సిపల్ కార్యాలయం వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల తోపులాట జరిగింది. దీంతో పోలీసులు ఇరువర్గాల నేతలను అడ్డుకున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి పీఏపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేయడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. జనగామలోనూ ఎంపీ చామల ఆందోళనతో ఎన్నిక వాయిదా వేశారు. పలు కారణాల వల్ల ఈరోజు 11 మున్సిపాలిటీల్లో మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల ఎన్నిక వాయిదా పడింది. ఇందులో ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, క్యాతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, జనగామ, తొర్రూరు పట్టణాలు ఉన్నాయి. పలుచోట్ల ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి.

# ఆదిలాబాద్ కాంగ్రెస్ దే

## పాయల్ శంకర్‌కు షాకిచ్చిన కంది

**బీజేపీకి 23.. కాంగ్రెస్ కూటమికి 27.. పట్టుబట్టి కాంగ్రెస్ కు ఛైర్ పర్సన్ వచ్చేలా కృషి**

**డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ తో కలిసి చక్రం తిప్పిన కంది శ్రీనివాసరెడ్డి**

**ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం**

(మొదటిపేజీ తరువాయి)

మద్దతు కూడగట్టి.. సక్సెస్ అయ్యారు. బీజేపీకి 23 ఓట్లు రాగా, కాంగ్రెస్ కూటమి 27 ఓట్లు సాధించింది. పురపీఠంపై ఆశపడి ప్రయత్నాలు చేసిన పాయల్ శంకర్ కు కాంగ్రెస్ నేత కంది శ్రీనివాసరెడ్డి షాకిచ్చారు. ఆదిలాబాద్ పై కాంగ్రెస్ జెండా ఎగరేయడానికి పడ్డ శ్రమ ఫలించింది. గత మునిసిపల్ ఎన్నికల్లో ఐదువార్డులకు పరిమితమైన కాంగ్రెస్ పార్టీ ఇపుడు కంది శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో బల్దియాపై కాంగ్రెస్ జెండా ఎగరేసే వరకు సాగింది. టికెట్ల విషయంలో ఆశించినవి జరగకున్నా చివరిదాకా పట్టుబట్టి బల్దియాపై కాంగ్రెస్ జెండా ఎగరేయడంలో కంది కీలకభూమిక పోషించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తో పాటు జిల్లా ఇన్ ఛార్జి మంత్రి జూపల్లి క్రిష్ణారావు, ప్రభుత్వ సలహాదారు, పార్టీ పార్లమెంట్ ఇన్ ఛార్జి సుదర్శన్ రెడ్డి , మునిసిపాలిటీ ఇన్ ఛార్జి అజ్మతుల్లా సూచనలకు అనుగుణంగా, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ తో ఎప్పటికపుడు సమన్వయం చేసుకుంటూ రాజకీయాన్ని రక్తి కట్టించారు. మాజీ మంత్రి జోగురామన్నతో మాట్లాడి మద్దతుకు ఒప్పించిన కంది శ్రీనివాసరెడ్డి చివరినిమిషం దాకా కాంగ్రెస్ పట్టును కొనసాగించి, ఏ దశలోనూ ఏ ఒక్కరు కూడా బీజేపీ వైపు ఆలోచించకుండా చేసి విజయాన్ని కాంగ్రెస్ వైపు లాగారు. కంది శ్రీనివాసరెడ్డి పట్టుదలతో బల్దియా కాంగ్రెస్ పరం కాగా, కాంగ్రెస్ శ్రేణుల్లో మళ్లీ ఉత్సాహం నెలకొంది. ఆదిలాబాద్, నిర్మల్ పీఠాలు కాంగ్రెస్ కైవసం చేసుకోవడంతో మళ్ళీ ఆదిలాబాద్ జిల్లా రాజకీయాలపై కాంగ్రెస్ కు పట్టుచిక్కినట్లయింది.

**కాంగ్రెస్ లో అధికారికంగా...**

కాంగ్రెస్ నుండి టికెట్ దక్కక స్వతంత్రంగా పోటీచేసిన బండారి అనూష ఛైర్ పర్సన్ గా ఎన్నుకోగానే, కాంగ్రెస్ నేతలతో కలిసి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి, స్థానిక నేతలతో కలిసి వెళ్ళగా, నూతన ఛైర్మన్ ను సుదర్శన్ రెడ్డి అభినందించారు. ఆదిలాబాద్ నేతలంతా కష్టపడి ఛైర్మన్ ను సాధించారని ప్రశంసించారు.

# ఏపీలో కలిసిన ఐదు గ్రామాలు తెలంగాణలో విలీనం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

చెందిన ఎంక్లేవ్‌లా మారిపోయాయని, జిల్లా కేంద్రాలకు చేరుకోవడానికి ప్రజలు దాదాపు 8 గంటలు ప్రయాణించాల్సి వస్తుందని పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, పన్నులు, పరిపాలనా అనుసంధానం లోపం, భద్రతా సమస్యలు వంటి అంశాలు స్థానిక గిరిజన ప్రజల జీవన విధానాన్ని ప్రభావితం చేస్తున్నాయని వివరించారు. భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవాలయం భూభాగాల్లో కొంత భాగం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉండటంతో దేవస్థానం పరిపాలనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. భక్తులకు మెరుగైన సేవలు అందించాలంటే ఈ గ్రామాల విలీనం అవసరమని అభిప్రాయపడ్డారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పరిపాలనా సౌలభ్యం కోసం విలీనం తప్పదన్నారు.

**పెదవాగు మరమ్మతులు చేపట్టాలి..**

ఖమ్మం జిల్లాలోని పెద్దవాగు సాగునీటి ప్రాజెక్టు శాశ్వత మరమ్మత్తులు అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరం ఉందని, ప్రాజెక్టు ద్వారా 16 వేల ఎకరాలకు సాగునీరు అందుతుండగా, అందులో సుమారు 13,640 ఎకరాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, 2,360 ఎకరాలు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయి అని తెలిపారు. ప్రాజెక్టు శాశ్వత పునరుద్ధరణకు సుమారు రూ.92.20 కోట్ల వ్యయం అంచనా వేయబడిందని, రెండు రాష్ట్రాలకు లబ్ధి చేకూరుతున్న నేపథ్యంలో ఖర్చును 85:15 నిష్పత్తిలో భరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ పరిధిలో గోదావరి వరద రక్షణ కరకట్టలోని 3వ స్లూయిస్ వద్ద గోడ దెబ్బతిన్నదని, భద్రాచలం పట్టణాన్ని వరదల నుంచి రక్షించేందుకు నిర్మించిన ఈ రక్షణ గోడలో జరిగిన ఈ నష్టం భవిష్యత్తులో భారీ ప్రమాదానికి దారి తీస్తుందన్నారు. కరకట్ట లోని ఆ భాగం విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వెళ్లడంతో నిర్వహణలో సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. ఇప్పటికే తెలంగాణ ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు ఏపీ ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన తగిన చర్యలు తీసుకోలేదన్నారు.

**తిరుమలలో తెలంగాణ భవన్**

రెండు రాష్ట్రాలు సమన్వయంతో శాశ్వత పునరుద్ధరణ చర్యలు ప్రారంభించాలని, ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఖమ్మం పట్టణంలో వెంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి అవసరమైన భూమి గుర్తించామని, టీటీడీ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. తిరుమలలో తెలంగాణ భక్తుల కోసం ప్రత్యేక యాత్రికుల భవనం నిర్మాణానికి సుమారు 5 ఎకరాల భూమి కేటాయించాలని ప్రతిపాదించారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో వసతి కొరతను తగ్గించి భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు ఉపయోగపడుతుందన్నారు. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, సమన్వయం పెంపొందిస్తే సాగునీరు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, భక్తుల మౌలిక వసతుల విస్తరణలో వేగవంతమైన పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సత్తుపల్లి కొవ్వూరు రైల్వే లైన్, పెనుబల్లి అమరావతి రైల్వే లైన్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ ప్రతిపాదనలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఏపీలో టెక్ పాలన గ్రేట్

## ఆర్టీజీఎస్ సందర్శన అనంతరం బిల్ గేట్స్ వ్యాఖ్య

**డేటాలేక్, సంజీవని, అమరావతి ప్రాజెక్టుల గురించి గేట్స్ కు వివరించిన సీఎం**

**ప్రజల జీవితాల్లో ఆర్టీజీఎస్ మార్పు తెస్తోందన్న సీఎం చంద్రబాబు**



### గేట్స్ కు యువ అధికారుల ప్రజెంటేషన్

**అంతకుముందు ఆర్టీజీఎస్ కేంద్రంలోకి వచ్చిన బిల్ గేట్స్‌కు వీడియో డిస్ ప్లే వాల్‌పై యువ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రజంటేషన్లు ఇచ్చారు. ఆర్టీజీఎస్ ప్రత్యేక అధికారులు ధాత్రిరెడ్డి, మలికా గార్గ్, ప్రఖర్ జైన్, సౌరబ్ గౌర్, సురేశ్ కుమార్‌లు ప్రజంటేషన్ల ద్వారా డేటా లేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, పీపుల్స్ పర్సెప్షన్, ఏజెంట్ స్పేస్ ఏఐ సెర్చ్ బార్, సంజీవని, అమరావతి ప్రాజెక్టుల గురించి వివరించారు. ఆర్టీజీఎస్ కేంద్రంలో జరిగిన ప్రజంటేషన్ల కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, సీఎస్ కె.విజయానంద్ సహా తదితర అధికారులు పాల్గొన్నారు**

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టెక్నాలజీతో అందిస్తున్న పాలన అద్భుతంగా ఉందని గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ వ్యాఖ్యానించారు. సోమవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఉన్న రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి సందర్శించిన బిల్ గేట్స్ అక్కడ డిస్ ప్లే వాల్స్‌పై ప్రదర్శించిన ప్రజంటేషన్లను తిలకించారు. ఆర్టీజీఎస్ నుంచి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని ఆసాంతం పరిశీలించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని వేగంగా అందిస్తున్న తీరు, ఫలితాలను గేట్స్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ముందుగా రాష్ట్రంలోని డేటా లేక్ వ్యవస్థ ద్వారా అన్ని ప్రభుత్వ విభాగాలనూ అనుసంధానించామని తద్వారా వేగంగా నిర్ణయాలు తీసుకోగలుగుతున్నామని తెలిపారు. డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డులు, అమరావతి రాజధాని అంశాలపై అధికారులు బిల్ గేట్స్‌కు డిస్ ప్లే వాల్స్ ద్వారా ప్రజెంటేషన్ ఇచ్చారు. అవేర్ 2.0 ద్వారా రియల్ టైమ్‌లో సమాచారాన్ని సేకరించి దానిని ప్రజలకు వేగంగా అందిస్తున్నట్టు తెలియచేశారు. 42 రకాల సమాచారాన్ని ప్రజలకు, రైతులకు అందించటం ద్వారా తక్షణం స్పందించేందుకు ఆస్కారం కలుగుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరసేవల్ని కూడా సులభతరం చేశామని... ప్రజల చేతుల్లోకి 921 సేవలను తీసుకెళ్లామని సీఎం వివరించారు. వీటిని ఆసక్తిగా పరిశీలించిన బిల్ గేట్స్ పౌరసేవలను సులభతరం చేయటం బాగుందని కితాబిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పాలసీల అమలుపై ప్రజాభిప్రాయాన్ని కూడా సేకరిస్తున్న తీరును తెలుసుకున్నారు. రాష్ట్రంలో జీఎస్డీపీ పెరుగుదలను కూడా కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల ద్వారా ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నామని బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి వివరించారు. ఏపీలోని ప్రాపర్టీ రికార్డుల భద్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని ముఖ్యమంత్రిని గేట్స్ అడిగారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి బ్లాక్ చైన్ టెక్నాలజీతో ల్యాండ్ రికార్డులను భద్రపరుస్తున్నామని వివరించారు. భూ రికార్డులపై క్యూఆర్ కోడ్ లాంటి భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేసి పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ప్రభుత్వ డాక్యుమెంట్లను ప్రజలకు అందుబాటులో ఉంచేలా ఏపీ ఏఐ సెర్చ్ బార్ ను అందుబాటులోకి తెచ్చామని అధికారులు గేట్స్‌కు ప్రజంటేషన్ ఇచ్చారు. దీనిని పరిశీలించిన బిల్ గేట్స్ పన్నుల వసూళ్ల ప్రక్రియ అద్భుతంగా ఉందని వ్యాఖ్యానించారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత దేశంలో పన్నుల వసూళ్ల ప్రక్రియ బాగా సులభతరమైందని, వసూళ్లు కూడా పెరిగాయని ముఖ్యమంత్రి వివరించారు.

**సంజీవని ప్రాజెక్టు వెరీ నైస్ : గేట్స్**

గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పం, చిత్తూరు జిల్లాలో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు అమలును గేట్స్ అత్యంత ఆసక్తిగా పరిశీలించారు. బ్లడ్ ప్రెషర్, డయాబెటీస్ లాంటి వైద్య పరీక్షల అనంతరం ఏం చర్యలు చేపడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటే వారికి ఎలాంటి సేవలు అందుతున్నాయని గేట్స్ ఆరా తీశారు. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డుల ప్రాజెక్టు చక్కగా ఉందని కితాబు ఇస్తూ... దట్స్ వెరీ నైస్ అంటూ గేట్స్ వ్యాఖ్యానించారు. ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను అనుసరించి వారి లైఫ్ స్టైల్ మార్పు, ఆహారం తీసుకునే అంశాల్లో సలహాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ఏఐ వినియోగం ద్వారా ప్రాథమికంగా వారి సందేహాలను తీర్చేలా వైద్య సేవలను అందించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. దీనిపై స్పందించిన బిల్ గేట్స్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించి వైద్య సేవలు అందించే విధానం చాలా బాగుందని ప్రశంసించారు. భారత్ బయోడిజైన్ ద్వారా భవిష్యత్తులో వైద్య సేవలు అందించే విధానాన్ని గేట్స్ అడిగి తెలుసుకున్నారు. అల్ట్రా సౌండ్ పరీక్షలు, స్కానింగ్ పరీక్షల కోసం గర్భిణులు ఎక్కువ వ్యయం చేయాల్సి వస్తోందని.. డయాగ్నోస్టిక్స్ సేవలు తక్కువ వ్యయానికే అందితే వారికి వెసులుబాటు ఉంటుందని గేట్స్ వ్యాఖ్యానించారు. అనంతరం ప్రజా రాజధాని అమరావతి నిర్మాణాలపై ఇచ్చిన ప్రజంటేషన్‌ను కూడా బిల్ గేట్స్ ఆసక్తిగా పరిశీలించారు. రాజధాని నిర్మాణంలో 30 శాతం మేర నీటి వనరులు, పచ్చదనం కోసం కేటాయించిన ప్రణాళిక బాగుందని అన్నారు. రాజధాని నిర్మాణం జరుగుతున్న తీరును గేట్స్‌కు సీఎం చంద్రబాబు వివరించారు. దీనిపై స్పందించిన బిల్ గేట్స్ గ్రేట్ వర్క్ అంటూ వ్యాఖ్యానించారు.

# సామాన్యులకు మేయర్ పట్టం

## కూరగాయలు అమ్ముకునే మహిళకు మేయర్ పదవినిచ్చిన కాంగ్రెస్

**ఆటో డ్రైవర్ ను మేయర్ పీఠంపై కూర్చోబెట్టిన సీపీఐ**

**తెలంగాణలోని కొత్త మేయర్లు, డిప్యూటీ మేయర్లు వీరే.. కాంగ్రెస్ 5, బీజేపీ1, సీపీఐ1**

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్లు, డిప్యూటీ మేయర్లు ఎన్నికయ్యారు. 7 కార్పొరేషన్లలో అధికార కాంగ్రెస్ 5, బీజేపీ 1, సీపీఐ 1 స్థానాల్లో ఎంపికయ్యారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల దారిలోనే నడిచింది. 7 కార్పొరేషన్లలో ఖాతా తెరవలేదు. కాగా ప్రధాన నగరాల కార్పోరేషన్ పదవులు సామాన్యులకు దక్కాయి. నిజామాబాద్ మేయర్ పదవిని కాంగ్రెస్ పార్టీ కూరగాయలు అమ్ముకునే పేద మహిళ ఉమారాణికి ఇవ్వగా, కొత్తగూడెం మేయర్ పదవిని సీపీఐ ఆటోడ్రైవర్ గణేష్‌కు ఇచ్చింది. ఆయా నగరాల్లో ప్రథమ పౌరుల ఎంపికలో పార్టీల ఎంపిక ధనబలంతో జరుగుతున్న ఎన్నికల్లోనూ ప్రజాస్వామ్య స్ఫూర్తికి అద్దం పడుతున్నాయి.

**కాంగ్రెస్ దక్కించుకున్న కార్పొరేషన్లు :**

నిజామాబాద్, మంచిర్యాల, మహబూబ్‌నగర్, రామగుండం, నల్గొండ, మంచిర్యాల, రామగుండం, మహబూబ్‌నగర్, నల్గొండ నగరపాలికల్లో స్పష్టమైన మెజారిటీ ఉండగా ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్ పీఠాన్ని దక్కించుకుంది.

**బీజేపీ గెలిచిన కార్పొరేషన్**

కరీంనగర్

**సీపీఐ నెగ్గిన కార్పొరేషన్**

కొత్తగూడెం



నిజామాబాద్‌లో ఎంఐఎంతో కలిసి అధికార కాంగ్రెస్ మేయర్ పీఠం కైవసం చేసుకుంది. నిజామాబాద్ మేయర్‌గా ఉమారాణి, డిప్యూటీ మేయర్‌గా సల్మా తహసీన్ ఎంపికయ్యారు. నల్గొండ మునిసిపల్ కార్పోరేషన్ కాంగ్రెస్ దక్కించుకుంది. తొలి మేయర్‌గా బుర్రి చైతన్య నియమితులయ్యారు. డిప్యూటీ మేయర్ పదవి మహ్మద్ అశ్రఫ్ అలీని వరించింది.

మంచిర్యాల కార్పొరేషన్ కాంగ్రెస్ కైవసం అయింది. మేయర్‌గా ధరణి మధు, డిప్యూటీ మేయర్‌గా రమ్య ఎంపికయ్యారు. కొత్తగూడెం మేయర్ స్థానాన్ని సీపీఐ దక్కించుకుంది. మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా ఆవిర్భవించిన తర్వాత జరిగిన ఎన్నికల్లో కొత్తగూడెం కార్పోరేషన్‌ను సీపీఐ కైవసం చేసుకుంది. కొత్తగూడెం కార్పొరేషన్‌లో మేయర్ పదవి సీపీఐకి దక్కగా డిప్యూటీ మేయర్ పదవి కాంగ్రెస్ దక్కించుకుంది. మేయర్‌గా మూడ్ గణేశ్, డిప్యూటీ మేయర్‌గా లలిత కుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మేయర్‌గా ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన గుముల మమత ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్ పదవి మారేపల్లి సురేందర్ రెడ్డిని వరించింది. రామగుండం కార్పొరేషన్ మేయర్‌గా కాంగ్రెస్ మద్దతుదారుడు మహంకాళి స్వామి ప్రమాణ స్వీకారం చేశారు. డిప్యూటీ మేయర్‌గా ఎల్లయ్యను ఎన్నుకున్నారు. కరీంనగర్ మేయర్ పీఠంను ఎట్టకేలకు బీజేపీ కైవసం చేసుకుంది. మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. 34 మంది కార్పొరేటర్ల మద్దతుతో మేయర్ పీఠాన్ని ఆ పార్టీ దక్కించుకుంది. డిప్యూటీ మేయర్‌గా చెందిన సునీల్ రావు నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి ప్రకటించారు. కరీంనగర్ మేయర్ పీఠాన్ని దక్కించుకోవడంలో కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. మేయర్ పదవికి పోటీ పడ్డ కాంగ్రెస్ అభ్యర్థికి 21 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ తటస్థంగా వ్యవహరించింది.

**కార్పొరేషన్లలో కాంగ్రెస్ హవా :**

నగరపాలికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అత్యధిక చోట్ల పాగా వేసే దిశగా వెళ్తోంది. రామగుండంలో ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 60 డివిజన్లలో కాంగ్రెస్ 38 గెలుపొంది ఆధిక్యత ప్రదర్శించింది. బీఆర్ఎస్ 13 స్థానాలకే పరిమితం అయ్యింది. బీజేపీ ఒకటి ఇతరులు 8 స్థానాలలో గెలుపొందారు. నల్గొండలో 48 స్థానాలు ఉండగా కాంగ్రెస్ 27 చోట్ల గెలుపొందింది. మేయర్ పీఠాన్ని దక్కించుకోనుంది. బీఆర్ఎస్ 9, బీజేపీ 4 చోట్ల గెలుపొందారు. ఇతరులు 8 చోట్ల నెగ్గారు. మంచిర్యాలలో కాంగ్రెస్ విజయదుందుభి మోగించింది. మొత్తం 60 డివిజన్లు ఉండగా 44 స్థానాల్లో కాంగ్రెస్ పాగా వేసింది. బీఆర్ఎస్ 8, బీజేపీ 5 చోట్ల గెలుపొందారు. ఇతరులు 3 స్థానాలను కైవసం చేసుకున్నారు.

### ముఖ్యమంత్రి అవ్వాలని ఉంది

**మాజీ మంత్రి మల్లారెడ్డి**

**హైదరాబాద్, మహా:** మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి తనదైన శైలి వ్యాఖ్యలతో మరోసారి వార్తల్లో నిలిచారు. శివరాత్రి సందర్భంగా శివయ్య వేషధారితో జరిగిన సరదా సంభాషణలో ఆయన తన రాజకీయ ఆకాంక్షను బయటపెట్టారు. "పేదలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తున్నావు.. నీకేం కావాలి?" అని అడగ్గా, "మనిషి ఆశాజీవి స్వామి.. నాకు ముఖ్యమంత్రి అవ్వాలని ఉంది" అంటూ బదులిచ్చారు. మల్లారెడ్డి మార్క్ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

# సన్న వడ్లకు బోనస్

(మొదటిపేజీ తరువాయి)

ఈ కీలకమైన పంపిణీ రాష్ట్రవ్యాప్తంగా 202526 ఖరీఫ్ సీజన్‌లో సన్న రకాల వరి పంట సాగు చేసిన 2.17 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రభుత్వం వరి ఒక క్వింటా ధరపై 500 రూపాయలు అదనపు బోనస్ ఇస్తుండటంతో సన్న రకాల సాగు గణనీయంగా పెరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన "ఏ" గ్రేడు ధాన్యం క్వింటాల్ కనీస మద్దతు ధర 2,389 రూపాయలు కంటే బోనస్ 500 రూపాయలు అదనం. ఈ పెండింగ్ బకాయిలు చెల్లించడం వల్ల రైతులకు గణనీయమైన ఆర్థిక ఉపశమనం లభిస్తుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానం మేరకు రైతుల కృషికి తగిన ప్రతిఫలం ఇవ్వడం ద్వారా ప్రభుత్వం అంకితభావం మరింత బలపడుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

# బంగారం తులం రూ.90 వేలు

(మొదటిపేజీ తరువాయి)

ఆర్థికవేత్త, పేస్ 360 చీఫ్ గ్లోబల్ స్ట్రాటజిస్ట్ అమిత్ గోయల్ సంచలన అంచనా వేశారు. ఇటీవలి కాలంలో రికార్డు గరిష్ఠాలకు చేరిన పసిడి ధరలు ఇప్పటికే కొంతమేర తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో, ఈ కరెక్షన్ మరింత లోతుగా ఉండబోతోందని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు సుమారు 5,000 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ఇది జనవరిలో నమోదైన గరిష్ఠ స్థాయి 5,626 డాలర్లతో పోలిస్తే తక్కువే. "2027 చివరి నాటికి కామెక్స్ గోల్డ్ ధర ఔన్సుకు 3,000 డాలర్ల స్థాయికి, భారత మార్కెట్లో తులం బంగారం ధర రూ.90,000 నుంచి రూ.1,00,000 మధ్యకు స్థిరపడవచ్చు" అని ఒక ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు. మారుతున్న ప్రపంచ రాజకీయ పరిణామాలు, ముఖ్యంగా రష్యా తిరిగి అమెరికా డాలర్లతో వాణిజ్య లావాదేవీలు ప్రారంభించవచ్చనే వార్తలు ఇందుకు కారణంగా నిలుస్తాయని ఆయన విశ్లేషించారు.



# ఇక మేఘా గ్రూపు ఉద్యోగిగా సీబీఐ మాజీ జేడీ

**రాజకీయాల్లో సక్సెస్ రాకపోవడంతో దారి మార్చిన లక్ష్మీనారాయణ**

**హైదరాబాద్, మహా :** సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మేఘా గ్రూపులో ఉద్యోగంలో చేరారు. ఈవీ ట్రాన్స్ అనే కంపెనీలో ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు చేపట్టారు. రాజకీయాల్లో ఆశించిన సక్సెస్ దక్కకపోవడంతో, ఆయన తిరిగి తన వృత్తిపరమైన కెరీర్‌పై దృష్టి సారించారు. రాజకీయాల్లో లేకపోయినా ఆయన స్వచ్ఛంద సంస్థ ద్వారా రైతులకు, యువతకు మేలు చేసే కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే ఇటీవల ఆయన కుటుంబం సైబర్ మోసానికి గురైంది. రెండున్నర కోట్ల వరకూ నష్టపోయింది. దీంతో ఆయనకు ఆర్థిక కష్టాలు కూడా చుట్టుముట్టినట్లుగా కనిపిస్తోంది. చివరికి ఆయన ఉద్యోగాన్ని ఎంచుకున్నారు. సీబీఐ జేడీగా ఉన్న సమయంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసు, గాలి జనార్ధన్ రెడ్డి ఓఎంసీ మైనింగ్ కేసులను అత్యంత పకడ్బందీగా డీల్ చేసి లక్ష్మీనారాయణ వార్తల్లో నిలిచారు. చివరికి లంచాలు తీసుకుంటున్న జడ్జిలను కూడా పట్టుకుని వ్యవస్థలో తన నిజాయితీని చాటుకున్నారు. అనంతరం మహారాష్ట్ర కేడర్‌కు వెళ్లిన ఆయన, పదవీకాలం ఉండగానే స్వచ్ఛంద పదవీ విరమణ చేసి 2019లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. జనసేన పార్టీ తరపున విశాఖపట్నం ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన తర్వాత, పవన్ కళ్యాణ్ సినిమాల్లోకి మళ్లీ వెళ్తున్నారనే సాకుతో ఆ పార్టీకి దూరమయ్యారు. రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం కోసం ప్రయత్నించిన లక్ష్మీనారాయణ, క్షేత్రస్థాయిలో ప్రజల ఆదరణను ఓట్లుగా మలచుకోవడంలో విఫలమయ్యారు. 2024 ఎన్నికల ముందు ఆయన జై భారత్ నేషనల్ పార్టీని స్థాపించి, విశాఖపట్నం నార్త్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగారు. అయితే, ఈ ఎన్నికల్లో ఆయనకు ఘోర పరాభవం ఎదురైంది. కనీసం ఐదు వేల ఓట్లు కూడా సాధించలేక డిపాజిట్ కోల్పోయారు. చివరికి ఆయన వీటన్నింటినీ వదిలేసి మళ్లీ ఉద్యోగానికి వెళ్తున్నారు.

# 11 మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్ల ఎన్నిక

## నేటికి ప్రకటించిన ఎస్ఈసీ.. కొందరికి అనూహ్యంగా వరించిన అదృష్టం

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలోని 11 మునిసిపాలిటీలకు ఛైర్ పర్సన్లు, వైస్ ఛైర్మన్ల పదవుల ఎన్నికను రాష్ట్ర ఎన్నికల సంఘం వాయిదా వేసింది. పలు కారణాలతో ఎన్నికను వాయిదా వేశారు. మున్సిపాలిటీల్లో కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్పొరేషన్ల మేయర్లు, మున్సిపాలిటీల్లో ఛైర్ పర్సన్‌ల ఎంపికపై చాలా చోట్ల ఉత్కంఠ నెలకొంది. వాయిదా పడ్డ 11 మున్సిపాలిటీల్లో ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మన్ల పదవులకు పరోక్ష ఎన్నికలు మంగళవారం జరుగుతాయి. ఎన్నిక వాయిదా పడిన మున్సిపాలిటీలు ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, కేతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, తొర్రూర్, జనగాంలు ఉన్నాయి. మంగళవారం ఈ 11 మున్సిపాలిటీల్లో ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మన్ల ఎన్నిక జరిగే అవకాశం ఉందని ఎన్నికల సంఘం అధికారి ఒకరు తెలిపారు. ఆలస్యానికి కారణాన్ని ఆయన ప్రస్తావించలేదు. 116 మునిసిపాలిటీలు, ఏడు మున్సిపల్ కార్పొరేషన్లలోని 2,996 వార్డులకు ఫిబ్రవరి 11, 2026న ఎన్నికలు జరిగాయి. ఓట్ల లెక్కింపు తర్వాత ఫిబ్రవరి 13న ఫలితాలు ప్రకటించారు. దీని తర్వాత మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్, డిప్యూటీ మేయర్లు, మునిసిపాలిటీల ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లు ప్రమాణ స్వీకారోత్సవం, ఎన్నికలు జరిగాయి. తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 ప్రకారం, ఎన్నికైన సభ్యుని పదవీకాలం ఎన్నికల తర్వాత మునిసిపాలిటీ మొదటి సమావేశం తేదీ నుండి ఐదు సంవత్సరాలు ఉంటుంది.

**ఛైర్ పర్సన్లుగా ఇండిపెండెంట్లు**

ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల సందర్భంగా కొన్ని మున్సిపాలిటీల్లో ఆసక్తికర సంఘటనలు జరిగాయి. అసలు రేసులోనే లేరు అనుకున్న స్వతంత్ర అభ్యర్థులు ఛైర్ పర్సన్లుగా ఎన్నికయ్యారు. భైంసా మున్సిపాలిటీలో బీజేపీ, ఎంఐఎం, కాంగ్రెస్, స్వతంత్రుల మద్దతుతో స్వతంత్ర అభ్యర్థి తూమెల్ల దత్తాత్రి ఛైర్మన్‌గా, ఖతుజా సిద్ధికి వైస్ ఛైర్ పర్సన్‌గా ఎన్నికయ్యారు. కామారెడ్డిలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలిచిన ఇప్ప ఉమారాణిని ఛైర్ పర్సన్‌గా ఎంపికయ్యారు. ఫలితాల తర్వాత ఉమారాణి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇప్ప ఉమారాణి ఛైర్ పర్సన్ పదవికి పోటీలో నిలిచి గెలిచారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కాంగ్రెస్ మద్దతుతో ఉమారాణి ఎన్నియ్యారు. వైస్ ఛైర్ పర్సన్‌గా బీఆర్ఎస్‌కు చెందిన కాసర్ల గోదావరిని ఎన్నుకున్నారు. ఇక ఆదిలాబాద్‌లో 45వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన అనూష బండారి ఛైర్ పర్సన్‌గా ఎన్నికయ్యారు. బీజేపీకి పీఠం దక్కకుండా కాంగ్రెస్ చేసిన ప్లాన్ వర్కౌట్ అయింది. బండారి అనూషకు 11 మంది కాంగ్రెస్, ఐదుగురు బీఆర్ఎస్, ఆరుగురు ఎంఐఎం, ఐదుగురు ఇండి పెండెంట్లు సపోర్ట్ చేశారు. 21 మంది కౌన్సిలర్లతో క్యాంపు నిర్వహించిన బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు షాక్ తగిలింది. ఇక్కడ అంచనాలు తలకిందుగా అయి అనూష ఛైర్ పర్సన్ అయ్యారు.

తెలుగు
మహా పత్రిక
03
మంగళవారం, హైదరాబాద్ | 17-02-2026 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM



## నిర్మల్ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా

**భార్యాభర్తలే చైర్పర్సన్, వైస్ చైర్మన్**

**నిర్మల్ మహా :** నిర్మల్ మున్సిపల్ పాలక వర్గ సభ్యులు సోమవారం అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన చైర్ పర్సన్ , వైస్ చైర్మన్ ఎన్నికలో చైర్ పర్సన్ గా 36 వార్డ్ నుండి గెలిచిన అప్పాల కావ్యను వైస్ చైర్మన్ గా 37 వార్డు నుండి గెలిచిన అప్పాల గణేష్ చక్రవర్తిని సభ్యులు ప్రతిపాదించారు. మరెవరూ పోటీ లేకపోవడంతో చైర్ పర్సన్ గా అప్పాల కావ్య వైస్ చైర్మన్ గా అప్పాల గణేష్ చక్రవర్తి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. అయితే వీరిద్దరూ భార్యాభర్తలు కావడం విశేషం .

# కాంగ్రెస్‌దే మున్సిపల్ పీఠం







- కంది శ్రీనివాస రెడ్డి నరేష్ జాదవ్ చాణక్యం
- సెక్యులర్ల మద్దతుతో కైవసం
- మున్సిపల్ చైర్ పర్సన్ గా బండారి అనూష
- వైస్ చైర్మన్ గా మహ్మద్ రోహిత్

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ మున్సిపల్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీలు స్వతంత్రుల మద్దతుతో దక్కించుకుంది. సోమవారం పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో అధికారుల సమక్షంలో ముందుగా 49 వార్డుల్లో గెలుపొందిన కౌన్సిలర్లచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్ పర్సన్ వైస్ చైర్మన్ ఎన్నిక చేపట్టారు. కాంగ్రెస్ , బీఆర్ఎస్ , ఎంఐఎం తమ చైర్ పర్సన్ అభ్యర్థిగా బండారి అనూష , వైస్ చైర్మన్ అభ్యర్థిగా మహ్మద్ రోహిత్ లపేరిట విప్ జారి చేసింది. అలాగే బీజేపీ చైర్ పర్సన్ అభ్యర్థిగా జోగు శైలజ పేరిట విప్ జారీ చేసింది. వైస్ చైర్మన్ గా లాలా ఓంప్రకాష్ జైస్వాల్ పేరును ప్రతిపాదించి బలపరిచింది. అనంతరం జరిగిన ఓటింగ్ కాంగ్రెస్ పార్టీ మద్దతు దారులతో చైర్ పర్సన్ అభ్యర్థి బండారి అనూష , వైస్ చైర్మన్ అభ్యర్థి మహ్మద్ రోహిత్ కు కాంగ్రెస్ 11, బీఆర్ఎస్ 5, ఎమ్ఐఎమ్6 స్వతంత్రులు 5గురు చేతులెత్తి ఓటేసారు.49 వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ప్రకాష్ గైర్హాజరయ్యారు.మొత్తం 27 మంది కౌన్సిల్ సభ్యులు ఓటేయడంతో చైర్ పర్సన్ గా బండారి అనూష , వైస్ చైర్మన్ గా మహ్మద్ రోహిత్ ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.అనంతరం వారికి ధృవీకరణ పత్రాలు అందచేసారు.అటు బీజేపీ అభ్యర్థులకు 21 ఓట్లు మాత్రమే దక్కడంతో మున్సిపల్ పీఠం అందని ద్రాక్షే అయ్యింది.

## బెల్లంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ హస్తగతం

- బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్‌గా దావా స్వాతి రమేష్
- మున్సిపల్ వైస్ చైర్మన్ గా రాగం శెట్టి సత్యనారాయణ
- ప్రమాణస్వీకారం చేయించిన మున్సిపల్ ప్రత్యేక అధికారి & బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ హస్తగతమైంది.నాటకీయపరిణామాల మధ్య ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేక వ్యూహారచనతో మున్సిపల్ చైర్మన్ తోపాటు వైస్ చైర్మన్ ల పదవులు కాంగ్రెస్ ఖాతాలోకి చేరిపోయాయి. సోమవారం నాడు బెల్లంపల్లి స్పెషల్ ఆఫీసర్ సబ్ కలెక్టర్ మనోజ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలోని ప్రత్యేక సమావేశం మందిరంలో ఓటింగ్ ప్రక్రియను నిర్వహించారు ఈ ప్రక్రియకు కాంగ్రెస్ పార్టీకి చెందిన 14 మంది వార్డుసభ్యులతో పాటు ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు ఒక బీజేపీ వార్డు మెంబర్ మరియు బెల్లంపల్లి స్థానిక ఎమ్మెల్యే & మున్సిపల్ ఎక్స్ అఫీషియో మెంబర్ గడ్డం వినోద్ సైతం ఓటింగ్ ప్రక్రియలో సోమవారం నాడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ తొలిత వార్డు సభ్యులతో ప్రమాణస్వీకారం మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ పదవికి దావ స్వాతి రమేష్ నిలబడగా హాజరైన 20 మంది సభ్యులతో పాటు వార్డు మెంబర్ ఎక్స్ఆఫీస్ మెంబర్గా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే సైతం చేతులెత్తి తమ మద్దతును ప్రకటించారు దీంతో మున్సిపల్ చైర్మన్ పదవి ఎన్నికైన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మున్సిపల్ ప్రత్యేక అధికారి మనోజ్ వెల్లడించారు అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ పదవికి రాగం శెట్టి సత్యనారాయణ నిలబడగా ఆయనను సైతం కాంగ్రెస్ పార్టీ సభ్యులతో పాటు ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు బిజెపి వార్డ్ మెంబర్ ఎక్స్అఫీసియో మెఃబర్ ఎమ్మెల్యే గడ్డం వినోద్ సైతం చేతులు ఎత్తి మద్దతును ప్రకటించారు.దీంతో వైస్ చైర్మన్ పదవి సైతం ఎన్నికైనట్లు మున్సిపల్ ప్రత్యేక అధికారి ప్రకటించారు అనంతరం మున్సిపల్ చైర్మన్ తో పాటు వైస్ చైర్మన్గా ఎంపికైన అభ్యర్థులతో ప్రమాణ స్వీకార ప్రక్రియను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి టిఆర్ఎస్ పార్టీకి చెందిన వార్డు సభ్యులు 14మంది గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ ప్రత్యేకంగా బందోబస్తు నిర్వహించారు.

## బెల్లంపల్లి పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

**ప్రమాణస్వీకారం చేసిన వార్డు సభ్యులకు దిశా నిర్దేశం చేసిన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్**



**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి మున్సిపల్ పాలకవర్గానికి ఎంపికైన వార్డు సభ్యులతో పాటు మున్సిపల్ చైర్మన్ దావ స్వాతీ రమేష్ ,వైస్ చైర్మన్ రాగం శెట్టి సత్యనారాయణ లకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పట్టణభివృద్ధిలో భాగస్వాములు కావాలని దిశా నిర్దేశం చేశారు .ఈ సందర్భంగా ఆయన వార్డు సభ్యులకు తొలుత శుభాకాంక్షలు తెలిపి వార్డు సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. బెల్లంపల్లి పట్టణ అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ పాలకవర్గం కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకునేందుకు ఎమ్మెల్యే కృషి మరువలేమని కొనియాడుతూఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన వార్డు సభ్యులతో కూడిన మున్సిపల్ పాలకవర్గం ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

## బెల్లంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికై కృషి

**బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి & మున్సిపల్ వైస్ చైర్మన్ రాగం శెట్టి సత్యనారాయణ వెల్లడి**



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణం లో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులతో అభివృద్ధికి కృషి చేస్తామని బెల్లంపల్లి పట్టణానికి నూతనంగా ఎంపికైన మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్ తో పాటు వైస్ చైర్మన్ రాగం శెట్టి సత్యనారాయణ లు సంయుక్తంగా వెల్లడించారు.ఈ సందర్భంగా సోమవారం నాడు మున్సిపల్ ప్రత్యేక సమావేశం మందిరంలో ఎంపికైన అనంతరం వారు మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తో పాటు రాష్ట్రప్రభుత్వ సహకారంతో అన్ని విధాల కృషి చేస్తామని పట్టణ ప్రజలకు హామీ ఇచ్చారు. పట్టణంలో నెలకొన్న అపరిస్కృత సమస్యల పరిష్కారమే తమ లక్ష్యంగా విధులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజా సంక్షేమ పథకాలు అమలవుతున్న దృశ్యా తమ పార్టీని ఆదరించి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని అదేవిధంగా పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులకల్పనకు, పట్టణ సుందరీకరణకు కృషిచేసి రుణం తీర్చుకుంటామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.... విజయోత్సవ సంబరాలు... పట్టణంలో ఎంపికైన మున్సిపల్ చైర్ పర్సన్ తో పాటు చైర్పర్సన్ రమేష్ తో పాటు వైస్ చైర్మన్ రాజంపేట సత్యనారాయణ లో గెలుపొందిన తమ తమ వార్డులలో విజయోత్సవ సంబరాలను సోమవారం నాడు నిర్వహించారు ఈ సందర్భంగా వారు బాణసంచా పేల్చి ఆయన వార్డుల్లోని విధులలో తిరుగుతూ ప్రజలకు కలిసి తమ విజయోత్సవ సంబరాల్లో భాగస్వాములని పేర్కొన్నారు .వార్డులలో నెలకొన్న సమస్యల పరిష్కారము కోసం అన్ని రకాల కృషి చేస్తామని గెలిపించిన వార్డు ప్రజలకు ధన్యవాదాలు పేర్కొన్నారు. అదేవిధంగా ఆయా వార్డుల నుండి గెలుపొందిన వార్డు సభ్యులు సంబంధితవార్డులలో తమ అనుచర గణంతో విజయోత్సవ సంబరాలను జరుపుకోవడం జరిగింది. ఏడవ వార్డు నుండి గెలుపొందిన దావస్వాతి సంబంధిత వార్డులలో విజయోత్సవ సంబరాలు జరుపుకోగా 18వ వార్డులను గెలుపొందిన రాగంశెట్టి సత్యనారాయణ సంబంధిత వార్డులో విజయోత్సవ సంబరాల్లో భాగంగా ప్రజలను కలిసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. 15వ వార్డు నుండి గెలుపొందిన చింతల వసంత విజయోత్సవ వేడుకలను తన కార్యకర్తలతో జరుపుకోవడం జరిగింది.




## ప్రజా తీర్పును అపహాస్యం చేస్తున్న మంత్రి -బాల్క సుమన్

**క్యాతన్ పల్లి మహా:** క్యాతన్ పల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లోబి.ఆర్.ఎస్కు 10సీట్లు, సీ.పి.ఐ కి 4 సీట్లలో ప్రజలు ఓట్లు వేసి గెలిపించి స్పష్టమైన మెజారిటి తో ఇచ్చిన ప్రజా తీర్పును మంత్రి వివేక్ వెంకటస్వామి, అపహాస్యం చేస్తున్నాడని బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుమన్ మండిపడ్డారు..సోమవారం కౌన్సిల్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని అడ్డుకొని రాజ్యాంగాన్ని అబాసు పాలు చేస్తున్న మంత్రి తీరు ను విలేఖరుల సమావేశం లో దుయ్య బట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.తమ గెలిచిన కౌన్సిలర్లు చైర్మన్ ను ఏర్పాటు చేసేందు క్యాతన్ పల్లి మున్సిపాలిటీ కార్యాలయనికి వెళ్లే క్రమంలో పోలీసులు అడ్డుకోవడంపై మండిపడ్డారు.మంత్రి దృష్ట సంప్రదాయనికి తెరలేపుతున్నారని అన్నారు.ప్రజల తీర్పును అడ్డుకోవస్తుందం దురదృష్టకరమని,ప్రజలు చూస్తూ ఉరుకోరని హెచ్చరించారు.కాంగ్రెస్ కార్యకర్తలు,పోలీసుల తీరుపై ఉన్నతాధికారులకు బిఆర్ఎస్,సీపీఐ శ్రేణులతో పిర్యాదు చేయనున్నట్లు సుమన్ తెలిపారు. ఆరు నూరైన మాటమిదే ఉంటాంసీత రామయ్య క్యాతన్ పల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్,సీపీఐ పొత్తు ఉండటంతో ప్రజలకు తెలిసిందేనని ఆరు నూరైన సీపీఐ మాటమిదే ఉంటుందని ఏఐటియుసి రాష్ట్ర నాయకులు నిక్కచుగా తేల్చిచెప్పారు.బిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ చైర్మన్ గా ఎన్నుకునే క్రమంలో సిపిఐ పూర్తి మద్దతు ఇస్తుందని జిల్లా కార్యవర్గ సభ్యులు కలవేని శంకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్,డాక్టర్ రాజా రమేష్,లక్ష్మణ్ పాల్గొన్నారు.

## కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఆవరణలో సంబరాలు



**సెక్యులరిజం గెలిచిందన్న నేతలు**

**ఆదిలాబాద్ మహా :** బీజేపీ మతతత్వ విధానానికి వ్యతిరేకంగా కలిసివచ్చిన పార్టీలు స్వతంత్రులతో కలిసి మున్సిపల్ పీఠాన్ని హస్తగతం చేసుకోవడం ఆనందంగా ఉందని డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రజాసేవాభవన్ ఆవరణలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. అబినందనలు చెప్పుకున్నారు.తమతో కలిసి నడిచిన పార్టీలు బీఆర్ఎస్ , ఎంఐఎమ్ స్వతంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ విధానాలకు నిరసనగా వారంతా మద్దతిచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ లో చేరిన ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్



**కండువా కప్పి స్వాగతించిన సుదర్శన్ రెడ్డి**

**ఆదిలాబాద్, మహా :** ప్రజాస్వామ్యంలో అభివృద్ధి కోసం కలిసి వచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకోవడం సరైనదేనని ఆదిలాబాద్ మున్సిపల్ ఎన్నికల పార్లమెంటు ఇంచార్జి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు .ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నికైన బండారి అనూష సతీష్ లు సోమవారం నిజామాబాదులోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు .వారిని ముందుగా అభినందించి శాలువాలతో సత్కరించారు .అనంతరం కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. తమది సెక్యులర్ పార్టీ అని ఇతర సెక్యులర్ పార్టీల మద్దతుతో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అదిలాబాదులో మున్సిపల్ చైర్ పర్సన్ పీఠం దక్కించుకోవడం హర్షనీ యమన్నారు . ఇందుకు సహకరించిన కౌన్సిలర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు .అలాగే ఆదిలాబాద్ నేతలందరినీ ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హందాన్, ఆదిలాబాద్ డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాసరెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్, గండ్రత్ సుజాత, బోరంచు శ్రీకాంత్ రెడ్డి, అశ్విన్ రెడ్డి ,పత్తి ముజ్జు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం!

**'ప్రజావాణి'లో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశం..**

**నల్గొండ,మహా:** జిల్లాలో నూతనంగా కొలువుదీరిన స్థానిక సంస్థల పాలకవర్గాలతో అధికారులు సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఆయన పాల్గొని బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించిన సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి హైకోర్టు, లోకాయుక్త, ఎస్సీఎస్టీ మరియు మానవ హక్కుల కమిషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులపై కలెక్టర్ సమీక్షించారు. ఆయా శాఖల అధికారులు వెంటనే స్పందించి కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని కేసులు పరిష్కారమైన వెంటనే ఆ సమాచారాన్ని కలెక్టరేట్‌కు నివేదించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇందిరా మహిళా శక్తి మహిళా సంఘాలకు నిర్దేశించిన రుణాల లక్ష్యాన్ని చేరుకునేలా డీఆర్డీఓ, మెప్మా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగుస్తున్నందున, కొనసాగుతున్న అభివృద్ధి పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ శాఖల పరిధిలో ఉన్న ఇళ్లను హౌసింగ్ శాఖకు అప్పగించి, లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదులు పోటెత్తాయి. మొత్తం 82 వినతులు రాగా అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 33, ఇతర జిల్లా స్థాయి అధికారులకు 49 ఫిర్యాదులు అందాయి.

## ప్రజాసేవలో నల్గొండ కార్పొరేషన్ చరిత్ర సృష్టించాలి!

- నల్గొండ మున్సిపల్ కార్పొరేటర్లకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపు..
- మేయర్‌గా బుర్రి చైతన్య రెడ్డి, డిప్యూటీ మేయర్‌గా అశ్రఫ్ అలీ ఏకగ్రీవ ఎన్నిక..
- కలిసికట్టుగా పనిచేస్తే రూ. 100 కోట్ల ప్రత్యేక నిధులు..



**నల్గొండ మహా ప్రతినిధి:** నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ తొలి పాలకవర్గం ప్రజాసేవలో సరికొత్త చరిత్ర సృష్టించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో నూతనంగా ఎన్నికైన మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం అనంతరం మంత్రి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. పదవులు వస్తుంటాయి.. పోతుంటాయి.. కానీ ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడమే ముఖ్యం. నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. అవసరమైతే సమస్యలను నేరుగా నా దృష్టికి తీసుకురావచ్చని మంత్రి పేర్కొన్నారు. సామాజిక న్యాయం పాటించాలనే ఉద్దేశంతోనే డిప్యూటీ మేయర్ పదవిని మైనార్టీ వర్గానికి కేటాయించామని ఆయన స్పష్టం చేస్తూ.. నల్గొండ పట్టణ అభివృద్ధిపై మంత్రి కోమటిరెడ్డి తన విజన్‌ను వివరించారు.. కార్పొరేటర్లందరూ సమన్వయంతో పనిచేస్తే ముఖ్యమంత్రి ద్వారా తక్షణమే రూ. 100 కోట్ల నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.పేదలందరికీ 6 కేజీల సన్నబియ్యం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోంది.తన సొంత నిధులతో జిల్లా కేంద్ర ఆసుపత్రికి లాప్రోస్కోపిక్ యంత్రం సమకూర్చానని, మాన్యం చెల్క ఆసుపత్రి భవనం పూర్తి కావస్తోందని తెలిపారు. బొట్టుగూడ పాఠశాల తరహాలో మరో 4 స్కూళ్లను అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలోనే 1137 కుట్టు మిషన్లను వార్డుల వారీగా పేద మహిళలకు పంపిణీ చేస్తామని ప్రకటించారు.

**ఏకగ్రీవంగా ఎన్నిక..**

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ తొలి మేయర్‌గా బుర్రి చైతన్య రెడ్డి, డిప్యూటీ మేయర్‌గా అశ్రఫ్ అలీ మొహమ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రత్యేక అధికారి శ్రవణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రక్రియలో కార్పొరేటర్లందరూ వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు.

**స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతా.. మేయర్ చైతన్య రెడ్డి**

మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన బుర్రి చైతన్య రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచిన మంత్రి కోమటిరెడ్డికి, కౌన్సిల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సహకారంతో ఇప్పటికే నడుస్తున్న రూ. 2200 కోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్ల పనులను త్వరగా పూర్తి చేసి, నల్గొండను స్మార్ట్ సిటీగా మారుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు. నూతన పాలకవర్గాన్ని మంత్రి మరియు అధికారులు శాలువాలతో ఘనంగా సత్కరించారు



## చెరువుల ఆక్రమణలపై ఉక్కుపాదం!

**వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలి జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశం..**

**నల్గొండ మహా:** జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలతో పాటు జిల్లా కేంద్రంలోని చెరువులు,కుంటల ఆక్రమణలపై జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ భూములను జలవనరులను ఆక్రమించిన వారిని గుర్తించి వెంటనే నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సంయుక్త సమీక్షలో ఆయన మాట్లాడారు.చెరువులు, కుంటల్లో ఆక్రమణలను గుర్తించే ప్రక్రియను మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో చేపట్టాలని కలెక్టర్ సూచించారు. మీ మీ పరిధిలో ఉన్న జలవనరుల స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించండి. ఎక్కడైనా ఆక్రమణలు జరిగినట్లు గుర్తిస్తే వాటిని ప్రాధాన్యత క్రమంలో నమోదు చేసి వారం రోజుల్లో సమగ్ర నివేదికను అందజేయాలని స్పష్టం చేశారు. కేవలం ఆక్రమణలనే కాకుండా, చెరువుల్లోకి చేరుతున్న కలుషిత వ్యర్థాల పైనా కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు.చెరువులు కుంటల్లో మురుగునీరు ఇతర వ్యర్థాలు చేరకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఎటువంటి ఆక్రమణలు జరగకుండా ఫెన్సింగ్ లేదా ఇతర కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి. జలవనరుల పరిరక్షణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని హెచ్చరించారు.

## క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద హై డ్రామా

- కాంగ్రెస్, బీఆర్ఎస్ ల మధ్య ఘర్షణ వాతావరణం
- ప్రమాణ స్వీకారం వాయిదా



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయం ముందుసోమవారం ఉదయం నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు హై డ్రామా కొనసాగింది. అధికార కాంగ్రెస్ పార్టీ నేతల అత్యుత్సాహం వల్ల కొత్తగా ఎన్నికైన క్యాతన్ పల్లి కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం వాయిదా పడింది. ఇక్కడ జరిగిన ఎన్నికలలో బీఆర్ఎస్ సీపీఐ కూటమికి 14 సీట్లు రాగా అధికార కాంగ్రెస్ పార్టీకి ఏడు సీట్లలో గెలుపొందారు. ఇక్కడ ఈరోజు బీఆర్ఎస్, సిపిఐ కూటమి కౌన్సిలర్ అభ్యర్థులు ప్రమాణ స్వీకారం చేసి అనంతరం చైర్మన్ వైస్ చైర్మన్ ల ను ఎన్నుకోవాల్సి ఉంది. కానీ ఈ ఎన్నికను అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు హైడ్రామా ప్రదర్శించి మున్సిపల్ కార్యాలయ ప్రాంగణానికి చెన్నూరు మాజీ ఎమ్మెల్యే రావద్దని డిమాండ్ చేస్తూ కార్యాలయం ముందర నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అధికార పార్టీ నేతలే ఒకవైపు ఆందోళన కార్యక్రమానికి పూనుకుంటే స్థానిక పోలీసులకు ఏం చేయాలో తోచక అయోమయంలో పడ్డారు. బాల్క సుమన్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ పోలీసులపై తోపులాట చేశారు. మరోవైపు భారత రాష్ట్ర సమితి నేతలు చెన్నూరు నియోజకవర్గం ఇన్చార్జి డాక్టర్ రాజా రమేష్ బాబు, మందమర్రి పట్టణ అధ్యక్షులు జంగిలి రవీందర్, ఏరియా టీబీజీకెఎస్ ఉపాధ్యక్షులు మేడిపల్లి సంపత్ తదితరులు, కార్యకర్తలు రైల్వే ఫ్లై ఓవర్ దగ్గర నిరసన వ్యక్తం చేస్తూ తమ కౌన్సిలర్లను ప్రమాణ స్వీకారానికి వెళ్లేందుకు అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ ధర్నా కార్యక్రమానికి కూర్చున్నారు. ఈ క్రమంలో ఆ ప్రాంగణమంతా పరస్పర ఆరోపణలు, అరుపులతో మార్మోగింది. ఉద్రిక్త ముందుగానే పసిగట్టిన మందమర్రి సిఐ రమేష్ , రామగుండం సిపి అంబార్ కిషోర్ ఝా,మంచిర్యాల డిసిపి భాస్కర్, బెల్లంపల్లి ఎసిపి విజయ్ కుమార్ లకు సమాచారం అందించారు. దానితో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. అనంతరం మందమర్రి తాసిల్దార్ సతీష్ కుమార్ నేటి ప్రమాణ స్వీకరణ మహోత్సవానికి కౌన్సిలర్ అభ్యర్థులు నిర్ణీత సమయంలో హాజరు కాలేదు అని పేర్కొంటూ కార్యక్రమాన్ని మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

## మూడేళ్లూ రాజకీయం వద్దు.. ప్రగతే ముద్దు!

**నల్గొండ కార్పొరేటర్లకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపు..**



**నల్గొండ, మహా ప్రతినిధి:** నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లు రాబోయే మూడేళ్ల పాటు రాజకీయాలను పక్కన పెట్టి కేవలం నగరాభివృద్ధిపైనే దృష్టి సారించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. సోమవారం నల్గొండ నగర మేయర్ కార్యాలయంలో జరిగిన మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మేయర్ ఎన్నిక ఏకగ్రీవం కావడం శుభపరిణామమని ఆయన కొనియాడారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. 48 మంది కార్పొరేటర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు అప్పగించిన బాధ్యతను అంకితభావంతో నిర్వర్తించాలని స్థానిక సమస్యలను మేయర్ దృష్టికి అవసరమైతే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నగరంలో శానిటేషన్ (పారిశుధ్యం) వ్యవస్థపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే పారిశుధ్య పనులను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు.నగర అభివృద్ధికి సంబంధించి మంత్రి పలు కీలక అంశాలను వెల్లడించారు.. నల్గొండ నగరానికి రూ. 700 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు ప్రకటించారు.గతంలో ఎంపీగా ఉన్న పరిచయాలతో ఢిల్లీ నుంచి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.

## మంచిర్యాల జిల్లాలో కొలువుతీరిన మునిసిపల్ పాలన



**మంచిర్యాల, మహా :** కొత్తగా ఎన్నికైన మున్సిపల్ కార్పొరేషన్/ మున్సిపల్ మేయర్/చైర్మన్, డిప్యూటీ మేయర్/వైస్ చైర్మన్ లను సోమవారం ప్రమాణ స్వీకారం చేపించవలసి ఉంది. అందులో భాగంగా ఆయా మున్సిపాలిటీ కార్యాలయల ప్రాంగణంలో సుందరీకరణ చేశారు. స్థానిక, పాలక, ప్రతిపక్ష ఇతర నేతలను కార్యాలయానికి ఆహ్వానించి ముందుగా ప్రమాణ స్వీకరణ చేశారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్, కోఆప్షన్ సభ్యులను ఎన్నుకొని వారితో ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా ధరణి మధుకర్ (కాంగ్రెస్) డిప్యూటీ మేయర్ గా చల్లా రమ్య (కాంగ్రెస్) బెల్లంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ గా దావ స్వాతి (కాంగ్రెస్) వైస్ చైర్మన్ గా రాగం శెట్టి సత్యనారాయణ (కాంగ్రెస్), చెన్నూర్ మున్సిపాలిటీ చైర్మన్ గా పెద్దింటి పద్మ (కాంగ్రెస్) వైస్ చైర్మన్ గా నాయకపు వినయ్ (కాంగ్రెస్)లక్సెట్టిపేట మున్సిపాలిటీచైర్మన్ గా దొంత అంజలి (కాంగ్రెస్) వైస్ చైర్మన్ గా మోతుకూరి బి రాజేశ్వరి (కాంగ్రెస్) మిగతా విషయాలు తెలియవలసి ఉంది.

EDITORIAL సంపాదకీయం

# ప్రజా తీర్పే పరమావధి

ప్రపంచంలోనే భారతదేశం అతి పెద్ద ప్రజాస్వామ్యదేశం. ఇక్కడ ప్రజలే పాలకులు, ప్రజా నిర్ణయమే పాలకులకు శిరోధార్యం. ప్రజలు ఎవరిని రాజును చేయాలనుకుంటే వారిని చేస్తారు. ఎవరిని వద్దనుకుంటే వారిని నిర్దయగా తిరస్కరిస్తారు. పాలకులు కూడా ప్రజా సేవకులుగా పని చేశారు. ఇదంతా గత చరిత్ర. ప్రజాస్వామ్యానికి ప్రస్తుత పాలకులు, ప్రజలు సరికొత్త నిర్వచనాన్ని ఇస్తున్నారు. ఎన్నికలు వస్తున్నాయంటే ప్రజలు పండుగ చేసుకుంటున్నారు. ఈ పండుగ తామనుకున్న వారికి పట్టం కట్టేందుకు, తామనుకున్న వారిని అనుకున్న పదివిలో చూసుకునేందుకు కాదు. నిజంగా ప్రజల్లో ఉంటూ నిరంతరం ప్రజల కోసం తపిస్తూ నిత్యం ప్రజా సమస్యలే ధ్యేయంగా పని చేస్తున్న వారిని ఎన్నుకుంటామని కాదు. ఎన్నికల్లో పోటీ చేసేది ఎవరు, తమకు తాయిలాలు ఇచ్చేది ఎవరు అన్నదానితో పాటు ఎవరు ఎక్కువ తాయిలాలు ఇస్తారన్న ఆశతో పండుగ చేసుకుంటున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నుంచి మొదలు ప్రదాని పదవిని శాసించే హక్కు కలిగిన ఎంపీని ఎన్నుకునే విషయంలో ప్రజలందరూ (ఓటర్లు) తాయిలాలే ప్రధానాంశాలుగా తమ ఓటు హక్కును వినియోగించుకునందుకు ముందుకు వస్తున్నారు. ఎన్నికల సంఘం ఎన్ని సంస్కరణలు చేసినా, ఎన్ని అవగాహనా శిబిరాలు ఏర్పాటు చేసినా, ఓటుకు ఉన్న ప్రాధాన్యతను విడమరిచి చెప్పినా సదరు ఓటరుకు ఇవేమీ పట్టడం లేదన్నది దేశంలోని ఏ మూలన ఏ ఎన్నిక జరిగినా స్పష్టమవుతోంది.

ఫలితంగా ఒకప్పుడు ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఆయన గత చరిత్ర, ఆయన కుటుంబ నేపథ్యం, ప్రజల కోసం చేసిన సేవలు, ప్రజా సమస్యలపై ఆయన చేసిన పోరాటం తదితరాలన్నింటినీ పరిగణనలోకి తీసుకునే వారు. పార్టీలు కూడా ఆ కోణంలోనే ఆలోచించి అభ్యర్థులను ఖరారు చేసి ప్రజాక్షేత్రంలోకి పంపించే వారు. క్రమక్రమంగా ప్రజాస్వామ్యం ఫరిఢవిల్లుతుందంటూ పార్టీలు కూడా తమ పంథాను మార్చుకుని పలుకుబడిని కాకుండా ధనస్వామ్యాన్ని చూసి టికెట్లిచ్చే పరిస్థితి ఏర్పడింది. దీంతో సదరు ఎన్నికలు కాస్ట్లీగా మారాయి. ఒక్క ఓటుకు లక్ష రూపాయలు ఇచ్చే స్థోమత ఎవిరికి ఉందన్న సర్వేల్లో పార్టీలు మునిగి తేలుతున్నాయి. తద్వారా సామాన్యులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా అయిష్టత చూపేంత పరిస్థితి నెలకొంది. ప్రజాస్వామ్య కాస్త ధనస్వామ్యంగా మారడంతో సదరు



ఓటరు కూడా తన ఓటుకు ధర కట్టి విక్రయించుకునే పరిస్థితి ఏర్పడింది. రాజ్యాంగంలో అన్నింటికంటే ఓటుకున్న విలువ వెలకట్టలేనిది. కానీ మారుతున్న కాలంతో పాటు ప్రజల్లో కూడా మార్పు రావడంతో ఆ ఓటే ఇప్పుడు బహిరంగ మార్కెట్ లో వేలం పాట ద్వారా అమ్ముడు పోయే పరిస్థితి ఏర్పడింది. సంస్కరణలు తెచ్చాం, అవినీతిని ప్రోత్సహించమని ఊకదంపుడు ఉపన్యాసాలుస్తున్న నేతలు కూడా ఓటును బహిరంగ మార్కెట్ లో కొనుగోలు చేసే వారికే ప్రాధాన్యం ఇస్తుండటంతో ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఉన్న విలువ రోజురోజుకూ పెరిగిపోతోందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. కోట్లు కుమ్మరించి ఓటలను కొనుగోలు చేసి గద్దె నెక్కిన పెద్దలు తర్వాత ప్రజా క్షేణం కంటే స్వంత లాభం కోసం ఎక్కువగా పని చేయడంతో ధనిలు మరింత ధనికులవుతుటే పేదలు మరింత పేదలుగా మారుతున్నారు.

ఓటును అమ్ముకోవడం నేరం. ఇది ఎన్నికల సంఘం ప్రతి ఎన్నికల్లోనూ ఓటర్లకు గుర్తు చేస్తూనే ఉంది. ఒటును కొనుగోలు చేయడం కూడా నేరమే. ఓటర్లను మభ్య పెట్టడం లాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలుంటాయని కూడా ఎన్నికల సంఘం పదే పదే హెచ్చరిస్తోంది. అయినా ఓటను అమ్ముకోవడం, కొనుగోలు చేయడం అనేది సర్వ సాధారణమైంది. పార్టీలు కూడా ఎన్నికల సంఘానికి భయపడినట్లే నటిస్తూనే తమ వికృత రూపానికి ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ తెరలేపుతూనే ఉన్నాయి. పార్టీలూ, అభ్యర్థులు ఓటర్లను మభ్యపెడుతున్నాయని ఎన్నికల సంఘానికీ తెలుసు. తాము చేస్తున్న పనులన్నీ ఈసీ గమనిస్తుందనీ పార్టీలకూ తెలుసు. అయినా ఎక్కడా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించక పోవడంతో ప్రజా,హామ్యం ప్రజాస్వామ్యంగానే ఉంటోంది. ఎన్నికల సంఘం ఎన్నికల సంఘం లాగే ఉంటోంది. బహిరంగంగా పార్టీలు ఓటర్లను మభయ పెట్టడం, అభ్యర్థులు ఓట్లర్లను ప్రసన్నం చేసుకునేందుకు తాయిలాలను ఎర వేయడంతో పాటు మందూ, విందులతో పాటు మటన్, చికెన్ లను యధేచ్ఛగా ఇస్తూనే ఉన్నారు. పోలింగ్ కేంద్రాల్లోనూ అభ్యర్థులు వెండి కాయిన్ లు, గిఫ్ట్ కూపన్ లు పంపిణీ చేయడం, నగను పంచడం లాంటి చేస్తూనే ఉన్నా ఎక్కడా ఈసీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడంతో పార్టీలకూ, పార్టీల నేతలకూ మరింత స్వేచ్ఛ లభించేందుకు దోహదపడుతోంది.

కోట్లు కుమ్మరించి గ్రామ వార్డు సభ్యుడిగానో, మునిసిపల్ కౌన్సిలర్ గానో గెలిచిన వ్యక్తి ఆ తర్వాత లాభాపేక్షే ధ్యేయంగా పని చేయడంతో ఓటరు తీర్పుకు కూడా విలువ లేకుండా పోతోంది. ప్రజాస్వామ్యంలో ఓటుకున్న ప్రతిపత్తి మంట గలిసిపోతోంది. ఎవరు ఏ పార్టీ నేత, ఎవరు ఏ పార్టీ వైపు వెళ్తారనేది గందరగోళంగా తయారైంది. వాస్తవానికి పార్టీ పిరాయింపు చట్టం ఉన్నా అది ఎందుకూ పనికి రానిదిగా తయారైంది. తెలంగాణలో తాజా మునిసిపల్ ఎన్నికలు, ఛైర్మన్, మేయర్ ఎన్నికల సీన్ లను పరిశీలిస్తే ప్రజాస్వామ్యమా పరిహాసమా అన్న అనుమానం కలుగుతోంది. నిన్నటి దాకా వైరి పార్టీలుగా ఉన్న పార్టీల నేతలు పదవుల కోసం భుజం భుజం కలపడం, ఒక్కో స్థానంలో ఒక్కో సంకీర్ణం వెలుగులోకి రావడంతో డబ్బులు తీసుకుని వేసిన ఓటుకున్న ప్రాధాన్యం ఏ పాటిదన్నది నిరూపితమవుతోంది.

ప్రజలు ఓటు వేసింది పాలన కోసమైతే పాలనను పక్కు పెట్టి స్వలాభం కోసం పాకులాడితే నిలదీసే హక్కు ఉంటుంది. కానీ ఓటరే అమ్ముడు పోయి వేలం పాటలో ఎవరు ఎక్కువ పాడితే వారికి ఓటు వేయడం ద్వారా ప్రశ్నించే హక్కును కోల్పోయి నేతల పార్టీల మార్పు గారడీని ప్రేక్షకుడిగా చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నీతి, నిజాయితీతో పాటు తమ అభిమాన పార్టీకి ఓటేస్తే ఫలితం మరొకరికి అందడంతో గ్రామ, పట్టణ, రాష్ట్రాభివృద్ధి జరగడం లేదని అడిగే హక్కును కూడా ఓటరు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బ్యాలెట్ బాక్సులో ఓటుకు ఫలితాల తర్వాత కనిపించిన మార్పుకు పొంతన లేకపోవడం, బేరసారాలు, పార్టీ ఫిరాయింపులు, హోటల్ రాజకీయాలు, డబ్బు, బెదిరింపుల మాటలు తదితరాలన్నీ స్థానిక స్వపరిపాలన ఆత్మను ఖూనీ చేశాయి. ప్రమాణ స్వీకారం - పాలన ఆరంభమా? లేక నాటకమా? జరిగిన ప్రమాణ స్వీకారాల ప్రక్రియను చూస్తే ప్రశ్న ఒక్కటే, ఇది ప్రజల కోసం తీసుకుంటున్న ప్రమాణమా? లేదా అధికారం కోసం వేసుకున్న ముసుగేనా? అన్న అనుమానం కలుగుతోంది. ప్రమాణం చేస్తున్న నోరుతోనే రాజ్యాంగ విలువలు ఉల్లంఘన యధేచ్ఛగా జరుగుతోంది. అధికార దాహం కోసం ప్రజా తీర్పును తుంగలో తొక్కడం అసలు బాధాకరమైన నిజం. మునిసిపాలిటీ అంటే తాగునీరు,,పారిశుద్ధ్యం,

రోడ్లు, పేదల జీవన సమస్యలు కానీ కానీ ఇవన్నీ పక్కకు పోయి, ఛైర్మన్ కుర్చీ,వైస్ ఛైర్మన్ కుర్చీ, కౌన్సిలర్ సంఖ్యలే రాజకీయాలకు కేంద్రంగా మారాయి. ఇది ప్రజాస్వామ్యమా? లేక రాజకీయ వ్యాపారమా? ఓటు వేసిన ప్రజలు బయట, అధికారాన్ని పంచుకునే నాయకులు లోపల. ఈ పరిస్థితి చూస్తే అనిపిస్తోంది తెలంగాణలో మునిసిపల్ రాజకీయాలు పాలన కాదు,

ఒక అధికార మార్కెట్ గా మారాయి. చివరగా ప్రజల తీర్పును గౌరవించని ప్రమాణ స్వీకారం చట్టబద్ధంగా ఉన్నా నైతికంగా చెల్లదు. ఇలాంటి రాజకీయ నాటకాలపై ప్రజలు ప్రశ్నించకపోతే. రేపు ప్రజాస్వామ్యం అనే మాట కూడా పుస్తకాలకే పరిమితం అవుతుంది. అయినా మనవి అత్యాశే కానీ డబ్బులు తీసుకుని ఓటేసిన ప్రజలకు ప్రశ్నించే అధికారం ఎక్కడుంది. ఒక వేళ ప్రశ్నించినా సదరు నేత అమ్ముడు పోయిన వాడు నన్ను ప్రశ్నించే హక్కు ఎక్కడిదని ప్రశ్నిస్తే సదరు ఓటరు ముఖం ఎక్కడ పెట్టుకుంటాడు. ప్రజాస్వామ్యం పరిహాసం కాకూడదంటే పార్టీలతో పాటు న్యాయవ్యవస్థలోనూ మార్పులు రావాల్సిన అవసరం ఉంది. అధునాతన సమాజంలో అన్నింటికీ ఆధారాలు లభిస్తాయి. ఈ ఆధారాలతో కాలయాపన లేకుండా తప్పు చేసిన వారు ఓటర్లా, నేతలా అన్నది గుర్తించి తక్షణ చర్యలు తీసుకుంటే తప్ప ప్రజాస్వామ్యం పరిహాసం కాకుండా ఉంటుంది.

- జి. కృష్ణమూర్తి,
అసోసియేట్ ఎడిటర్

# సైబర్ నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానమే శాశ్వత పరిష్కారం

దేశవ్యాప్తంగా ఆధునిక సాంకేతిక వ్యవస్థలో వచ్చిన మార్పుల మూలంగా, ఇది అదనుగా తీసుకున్న సైబర్ నేరగాళ్లు వివిధ కోణాల్లో మోసాలకు ఒడిగడుతున్నారు. ముందుగా నఖిలీ ఈ మెయిల్ లేదా సందేశాల ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తారు. అలాగే ఆధార్ కార్డు,పాన్ కార్డుల వంటి వివరాలతో సమాచారాన్ని తెలుసుకుంటారు.ప్రధానంగా కంప్యూటర్స్, ఇంటర్నెట్ ఆధారిత డిజిటల్ పరికరాల ద్వారా సైబర్ క్రైమ్స్ జరుగుతున్నాయి,సామాజిక మాధ్యమాల ద్వారా వేధించటం,ఫోటోలను మార్ఫింగ్ చేయటంతో పాటు, హ్యాకింగ్, డేటా దొంగతనం, మాల్వేర్ దాడి,ఆన్లైన్ ఫ్రాడ్స్ తదితర నేర స్వభావాలు ఇందులో ప్రధానమైనవి.



**నేటి మరో ఆధునిక సాంకేతిక వ్యవస్థ కృత్రిమమేధ**

సైబర్ నేరాల బాధితులు తమ ఫిర్యాదును 1930 కి డయల్ చేయడంలో పడుతున్న జాప్యాన్ని అధిగమించే దిశగా వారికి మరికొంత ఉపశమనం కలిగించే రీతిలో దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత వాయిస్ ఏజెంటును అందుబాటులోకి త్వరలో తేనున్నారు. బాధితుల మాటలకు అనుగుణంగా స్పందిస్తూనే, ప్రశ్నలు అడగడం ద్వారా వివరాలు స్వీకరించే పరిజ్ఞానం దీని సొంతం. కాల్ చేసిన సందర్భంగా బిజీగా ఉంటే సైబర్ సారథికి ఆ కాల్ కనెక్ట్ చేయబడుతుంది. ఫిర్యాదుదారుని సమాచారాన్ని కూడా సవివరంగా సేకరిస్తుంది. ఆపై ఆ సమాచారానికి సంబంధించిన స్క్రీన్ షాట్లను, మెసేజ్ లను ఇతర ఆధారాల వివరాలను కూడా నమోదు చేస్తుంది.దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు 24% పెరిగినా మన తెలంగాణ రాష్ట్రంలో మాత్రం రెండు శాతం తగ్గడం ఓశుభపరిణామం. ఇటీవల నిర్వహించిన షీల్డ్ 2026 _2.0 కాన్ క్లేవ్ సైబర్ నేరాల నియంత్రణలో ఒక విప్లవాత్మక మార్పుకు స్వీకారం చుట్టే దిశగా అడుగులు వేస్తోంది. ఈ ప్రయోగం కనుక విజయవంతమయితే ఇక మన తెలంగాణ రాష్ట్రంలో సైబర్ నేరాల సంఖ్య బాగా తగ్గుతుంది ఒకవేళ జీరో స్థాయికి పడిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదు.ఇదే నిజమైతే షీల్డింగ్ వుల్నేరబుల్ సెక్యూరిటీ డిజిటల్ ఫ్యూచర్ అనే కార్యక్రమం విజయవంతమైనట్లుగా భావిద్దాం.

**అఖిల భారతీయ సైబర్ సురక్ష సంగతన్**

ఇది భారతదేశంలోని మొట్టమొదటి సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ (ఎన్జీవో). ఈ సంస్థ పాఠశాల,కళాశాలల్లోని విద్యార్థినీ,విద్యార్థులకు సైబర్ నేరాలపై సంపూర్ణ అవగాహన కల్పించడానికి శిక్షణ కార్యక్రమాలను నిరంతరాయంగా నిర్వహిస్తుంది.

**రాష్ట్రంలో సైబర్ నేరాల విజృంభణ**

ఇటీవల కాలంలో ఒక ప్రత్యేక సందర్భాల్లో అది నూతన సంవత్సరం గ్రీటింగ్స్ కావచ్చు, మరొక స్పెషల్ డే కావచ్చు ఈ సందర్భంగా నకిలీ డేటింగ్ ప్రొఫైల్స్, గిఫ్ట్ ఫ్లవర్స్ డెలివరీ ఆఫర్లు, డిస్కౌంట్ లింకుల ద్వారా అంటే, ప్రధానంగా వాట్సాప్,ఎస్ఎంఎస్, సోషల్ మీడియా ఈ మెయిల్ ద్వారా లింకులు పంపిస్తుంటారు. మరో కోణంలో చూస్తే డేటింగ్ ఖాతాల ద్వారా పరిచయం పెంచుకొని, ఆ మాట ఈ మాట మాట్లాడుతూ చనువుగా చొరబడి,తమ యొక్క వ్యక్తిగత అవసరాలను ఒక్కొక్కటి ఓపెన్ చేస్తూ మెల్లమెల్లగా డబ్బులు లాగే ప్రయత్నం చేయడం ఆ ఊబిలోకి దింపడం ఇటీవల కాలంలో షరా మామూలైంది. కొత్త కొత్త లింకుల ద్వారా ప్రమాదకరమైన యాప్ లను ఇన్స్టాల్ అయ్యే విధంగా కూడా ఈ ఘరానా మోసగాళ్లు చేస్తుంటారు.

**సైబర్ నివారణ మార్గాలు**

నకిలీ ఏపికే ఫైల్స్,ఆర్టీఓ చాలాన్లు,పిఎం కిసాన్ యోజన,జల మండలి బిల్లుల పేరుతో వచ్చే లింకులు కానీ,గుర్తుతెలియని ఈ మెయిల్స్ కానీ, క్లిక్ చేయకుండా ఉండటం. బ్యాంకు పిన్ గానీ ,ఓటిపి కానీ,ఆధార్ నెంబర్ కానీ పరాయి వ్యక్తికి చెప్పకపోవడం.చట్టంలో లేని డిజిటల్ అరెస్ట్ పేరుతో వచ్చే కాల్స్ కు కూడా భయపడొద్దు. అలా అరెస్టు పేరుతో డబ్బులు వసూలు చేసే బ్యాచ్ల వలలో చిక్కుకోవద్దు.బ్యాంక్ రివార్డ్ పాయింట్స్, క్రెడిట్ కార్డు లిమిట్ పెంపు తదితర ఆశాజనక ఆఫర్లను కూడా నమ్మొద్దు.తరచుగా యాంటీ వైరస్ మరియు యాప్ లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయడంతో పాటుగా, బాధితులు వెనువెంటనే 1930 నెంబర్ కు డయల్ చేయటం, లేదా పోలీస్ సైబర్ క్రైమ్ విభాగం సెల్ నెంబర్ 8712665171 కు కాల్ చేసి చెప్పడం ద్వారా మనం నష్టపోయిన అమౌంట్ ను తిరిగి పొందవచ్చును.అలాగే ఆన్లైన్ ద్వారా w.w.w cyber crime. govt.in ఈ వెబ్సైట్ పోర్టల్ కు ఫిర్యాదు చేస్తే,ఈ ఫిర్యాదులను ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (14సి) స్వీకరిస్తుంది.ఆ ఫిర్యాదులో మోసపోయిన బ్యాంకు ఖాతా నెంబరు,లావాదేవీ జరిగిన తేది,సమయం లావాదేవీల ఐడి,రిఫరెన్స్ నెంబర్ ఇందులో తప్పక పొందుపరచాలి.మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పొంది,ఆన్లైన్ మోసాల పట్ల జాగ్రత్త వహిస్తే సైబర్ నేరాల బారి నుండి బయటపడతాం.

- పరాంకుశం రఘు నారాయణ
జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత
గ్రామం:తొర్రూరు, మహబూబాబాద్ జిల్లా
ఫోన్: 9949749987



# ప్రజాసేవకే నా జీవితం అంకితం

**కార్పొరేటర్ మల్లెల స్వప్న కుమారి**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ప్రజాసేవకే నా జీవితమంతా అని కొత్తగూడెం పాల్వంచ మున్సిపల్ కార్పొరేటర్ ఎన్నికల్లో 37వ డివిజన్ విజయం సాధించిన మల్లెల స్వప్న కుమారి అన్నారు. తన విజయానికి సహకరించిన ఓటర్లకు టిఆర్ఎస్ నాయకులకు కార్యకర్తలకు సోమవారం మల్లెల స్వప్న కుమారి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఓట్లు వేసి తనను ప్రజాప్రతినిధిగా మార్చినందుకు ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటారని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పని చేస్తానని స్పష్టం చేశారు. డివిజన్లో ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఫోకస్ పెట్టడం జరుగుతుందన్నారు. డివిజన్లో పారిశుద్ధ్యం మెరుగుపరస్తానని తెలిపారు. ఎక్కడైతే డ్రైనేజీ వ్యవస్థ బాగాలేదో అక్కడ డ్రైనేజీల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. వీధిలైట్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వివరించారు. విద్య వైద్యం అభివృద్ధి కొరకు కూడా తన వంతుగా చిత్తశుద్ధితో పని చేస్తానని మల్లెల స్వప్న కుమారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు కార్పొరేట్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబట్టుకొని వారి కష్టసుఖాల్లో**

# తోడుండేవారే నిజమైన నాయకులు: నిర్మల జగ్గారెడ్డి



**సంగారెడ్డి ప్రతినిధి: మహా:** ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకొని, వారి కష్టసుఖాల్లో తోడుండే వారే నిజమైన నాయకులుగా గుర్తింపు పొందుతారని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. సోమవారం సదాశివపేట మున్సిపల్ నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లను సదాశివపేట మార్కెట్ కార్యాలయం ఆవరణలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవులు వస్తుంటాయి పోతుంటాయి రాజకీయంలో పదవులు శాశ్వతం కాదు ఆమె అన్నారు. రాజకీయం అంటే అధికారం చలయించడం కాదు ప్రజల హృదయాలను గెలవాలన్నారు. తమను నమ్మి ఓటేసిన ప్రజలకు ఆపదలో ఉంటే భరోసా కల్పించాలన్నారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, క్రమశిక్షణతో సేవ చేయాలని కౌన్సిలర్లకు సూచించారు. జగ్గారెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ప్రతి వార్డుకి 8 కోట్ల నిధుల మంజూరు కాగానే వార్డుల అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిడి సి చైర్మన్ గడిల రామ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# చైర్మన్ సీటు కోసం బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లోకి

- **బిఆర్ఎస్ మ్యాజిక్ ఫిగర్ ఉన్నా మారిన రాజకీయాలు**
- **మారిన చైర్మన్ ఎన్నిక**
- **రసవత్తరంగా చిత్రవిచిత్రాల మధ్య ఎన్నికైన చైర్మన్**
- **ఎట్టకేలకు చైర్మన్ గా పత్య నాయక్**



ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ గా పత్య నాయక్ (కాంగ్రెస్ )



వైస్ చైర్మన్ గా తల్లోజు గీతా ఆచారి(బీజేపీ )

**ఆమనగల్లు, మహా :** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మునిసిపాలిటీలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోయాయి. ఇక్కడ బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ చైర్మన్ పీఠం ఆ పార్టీకి దక్కకుండా పోయేలా కనబడింది.బీజేపీ మద్దతును కూడగట్టుకొని ఈ మునిసిపాలిటీలో పాగా వేసేందుకు అధికార పార్టీ వ్యూహాత్మకంగా ముందుకు సాగింది.ఆమనగల్లు మునిసిపాలిటీలో 15 వార్డులకు గాను 8 వార్డుల్లో బీఆర్ఎస్, ఆరు వార్డుల్లో బీజేపీ, ఒక వార్డులో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. బిఆర్ఎస్ కు స్పష్టమైన మెజారిటీ ఉంది. అయితే ఆ పార్టీకి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు దక్కకుండా నిలువరించేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒప్పందం చేసుకున్నారు.బీజేపీ గెలిచిన 6 స్థానాలకు తోడు కాంగ్రెస్ ఒక స్థానంతో పాటు రెండు ఎక్స్ అఫీషియో ఓట్లతో కలిపి మొత్తం 9 స్థానాలతో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నికకు సిద్ధమైనట్లు తెలిసింది. నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆమనగల్లు మున్సిపాలిటీ ఎక్స్ అఫీషియో ఓట్లు నమోదు చేసుకున్నారు. ఆయా పార్టీల ఒప్పందంలో భాగంగా కాంగ్రెస్‌కు చైర్మన్, బీజేపీకి వైస్ చైర్మన్ పదవులు చేపట్టే విధంగా కొనసాగింది.కాగా సోమవారం ఉదయం వరకు కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన 10వ వార్డు కౌన్సిలర్ అనిత శ్రీనివాస్‌రెడ్డిని చైర్మన్‌గా, మూడో వార్డు నుంచి గెలుపొందిన బీజేపీ నేత తల్లోజు ఆచారి సతీమణి తల్లోజు గీత వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నుకునేందుకు ప్రయత్నాలు జరిగాయి . కాగా ఒక్క స్థానంలో గెలుపొందిన కాంగ్రెస్ చక్రం తిప్పి చైర్మన్ పీఠాన్ని చేజిక్కించుకోనుండటం ఆమనగల్లులో రాజకీయ చర్చకు తెరలేపితే. బిఆర్ఎస్ నుండి ఆరవ అభ్యర్థిగా గెలుపొందిన పత్య నాయక్ ఎంపీ మల్లురవి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ చేరడంతో చైర్మన్ గా ప్రకటించారు...వైస్ చైర్మన్ తల్లోజు గీతాను ఎన్నుకున్నారు.

**ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ గా పత్య నాయక్**

ఆమనగల్లు చైర్మన్ పీఠం కాంగ్రెస్ కైవసం చేసుకుంది. పత్య నాయక్ పేరును చైర్మన్ గా బీజేపీ ప్రతిపాదించింది. 9 ఓట్లతో పత్య నాయక్ నెగ్గారు... టిఆర్ఎస్ అభ్యర్థి రాముకు 7 ఓట్లు వచ్చాయి. వైస్ చైర్మన్ గా బిజెపి పార్టీకి చెందిన తల్లోజు గీతా ఎన్నికయ్యారు.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, మహా ;** కాటేదాన్ డివిజన్ పరిధిలో ( టిఎన్ జి ఓస్ )లోని సాయి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా రూ 15.34 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సోమవారం శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ ( హెచ్ఎం డబ్ల్యూ ఎస్, ఎస్ బి ) ఆధ్వర్యంలో, సాయి కాలనీలోని పైప్‌లైన్ నిర్మాణం, జాయింటింగ్ పనులను ఈ నిధులతో పూర్తి చేపట్టనున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూనియోజకవర్గంలోని ప్రతి కాలనీలో డ్రైనేజీ సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారం చూపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ పడే ప్రసక్తే లేదని, నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, జలమండలి అధికారులు జిఎం లక్ష్మి, డీజీఎం, రేణుక కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లులో రసవత్తరంగా మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

- **కాంగ్రెస్లో చేరి జాక్పాట్ గా చైర్మన్ పదవి దక్కించుకున్నా పత్య నాయక్**
- **పత్య నాయక్ కాంగ్రెస్ చేరడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన బిఆర్ఎస్**
- **పత్య నాయక్ కు సంబందించిన హాస్పిటల్లో అద్దాలు, ఫర్నిచర్ వస్తువులు ధ్వంసం**
- **పరిశీలించిన ఎమ్మెల్యే కసిరెడ్డి**



**ఆమనగల్లు, మహా :** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ పదవి ఎన్నిక ఆసక్తిగా మారింది. బిఆర్ఎస్ పార్టీ తో గెలిచిన అభ్యర్థి చివరి అంకంలో కాంగ్రెస్లో చేరి జాక్పాట్ గా చైర్మన్ పదవి దక్కించుకున్నాడు. ఫిబ్రవరి 11న జరిగిన ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా నేనావత్ పత్యనాయక్ నాయక్ విజయం సాధించారు. బిఆర్ఎస్ పార్టీ స్పష్టమైన మ్యాజిక్ ఫిగర్ ఎనిమిది స్థానాలను గెలుచుకొని చైర్మన్ పదవికి పాపిశెట్టి రాము పేరును గులాబీ పార్టీ ప్రతిపాదించింది. తర్వాత జరిగిన రాజకీయ సమీకరణలు బిజెపి, అధికార కాంగ్రెస్ పార్టీ జట్టు కట్టి బిఆర్ఎస్ పార్టీకి షాక్ ఇచ్చారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పత్య నాయక్ కాంగ్రెస్ కండువా కప్పుకుని మధ్యాహ్నం జరిగిన చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీచేసి గెలుపొందారు. దీంతో ఉదయం కారులో ఉన్న పత్య నాయక్ కాంగ్రెస్ లో చేరి చైర్మన్ గా ఎన్నికయ్యారు.

**ఆమనగల్లు చైర్మన్ గా పత్యానాయక్ ప్రమాణం**

ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ గా పత్యానాయక్ ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో భారీ భద్రతల మధ్య ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సభ్యులందరి చేత ప్రమాణం చేయించిన అనంతరం చైర్మన్ పత్యానాయక్ తో అధికారులు ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు. అనంతరం కొత్త పాలకవర్గం బాధ్యతలు చేపట్టారు.

**ఆమనగల్లులో ఉద్రిక్తత**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆమనగల్లు పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 8 మంది బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించిన నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్లో చేరిన పత్య నాయక్ పై పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపిస్తూ ధర్నాకు దిగారు.

**పత్యానాయక్ హాస్పిటల్ పై దాడి**

బిఆర్ఎస్ పార్టీ నుండి గెలుపొందిన పత్యానాయక్ కాంగ్రెస్ పార్టీ లో చేరిన సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు అతని ప్రవైట్ హాస్పిటల్ పై దాడి చేసినట్లు సమాచారం.హాస్పిటల్లో అద్దాలు ధ్వంసం చేయగా, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. పత్యానాయక్ హాస్పిటల్ ను పరిశీలించిన ఎమ్మెల్యే ఆమనగల్లు మున్సిపాలిటీలో ఘటనల నేపథ్యంలో పత్యానాయక్ హాస్పిటల్ను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. నష్టాన్ని అంచనా వేసి పత్య నాయక్ తో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకుని తగినచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సంబంధిత అధికారులతోమాట్లాడి శాంతి భద్రతలు కట్టుదిట్టంగా నిర్వహించాలని అన్నారు.



**లయన్స్ క్లబ్ వారి కంటి వైద్య శిబిరాలను**

# సద్వినియోగం చేసుకోండి

**క్లబ్ పిఆర్ఓ పాషా**

**ఆమనగల్లు, మహా :** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, రామ్ రెడ్డి లయన్స్ విజన్ సెంటర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరాన్ని క్లబ్ పిఆర్ఓ పాషా ప్రారంభించారు.లయన్స్ క్లబ్ కేంద్రంలో చేపట్టే ఉచిత కంటి వైద్య ఆరోగ్య శిబిరాలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన శిబిరాల ఏర్పాటు చేసే ప్రతి ఒక్కరు కళ్ళను దానం చేసేలా అవగాహన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రామ్ రెడ్డి లయన్స్ విజన్ సెంటర్ కంటి వైద్యులు ఎం చంద్రశేఖర్ ఇస్లావత్ రాజేందర్లు 85 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 27 మంది కంటి ఆపరేషన్ నిమిత్తం రాంరెడ్డి హాస్పిటల్ కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది శిరీష, రాజేందర్,చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు

## ఇంటి నిర్మాణం తమ స్థలంలోకి వచ్చిందని ఇరువురి మధ్య ఘర్షణలు



**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుద్వేల్ లో ఇల్లు నిర్మాణం చేస్తున్నారు, వారు మా స్థలంలోకి జరిగారనిఒకే బస్తీకి చెందిన ఇద్దరు వ్యక్తులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. స్థానికులు 100కి డయల్ కి వ్యాధులు చేయడంతో, సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు. మహిళా కానిస్టేబుల్ తో పాటు మరో కానిస్టేబుల్ గొడవని ట్యాబ్లో చిత్రీకరిస్తున్న సమయంలో శరణ్య, సంగీత అనే ఇద్దరు మహిళలు చిత్రీకరిస్తున్న ట్యాబ్ని పగలగొట్టారు.మహిళా పోలీస్ కానిస్టేబుల్ పై దాడిచేశారు.మహిళా కానిస్టేబుల్ ను జుట్టు పట్టుకొని దాడి చేస్తున్నా ఘటనను స్థానికులు మొబైల్ ఫోన్ లో చిత్రీకరించారు.పోలీసులు ఘటన స్థలానికి చేరుకొన్ని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మొయినాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గా దుబ్బ సోనియా దర్శన్

**వైస్ చైర్మన్ గా గరుగు రాజు**





**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీలో చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ఉత్కంఠభరితంగా జరిగాయి. మొయినాబాద్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయా వార్డులో గెలుపొందిన కౌన్సిలర్లు పాల్గొన్నారు. అనంతరం ముందుగా నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ల వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్ పర్సన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నిక నిర్వహించారు. చైర్ పర్సన్ పదవికి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి దుబ్బ సోనియా దర్శన్ 18 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. వైస్ చైర్మన్ పదవికి బీఆర్ఎస్ తరపున శ్రీధర్, బిజెపి తరపున షాబాద్ కిషన్ పోటీ చేసినప్పటికీ వారికి సరైన మెజారిటీ లభించలేదు. దీంతో దుబ్బ సోనియా దర్శన్ మొయినాబాద్ చైర్ పర్సన్ గా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. అనంతరం వైస్ చైర్మన్ పదవికి జరిగిన ఎన్నికల్లో కూడా స్వాతంత్ర అభ్యర్థి గరుగు రాజు 18 ఓట్లతో విజయం సాధించారు. బిజెపి తరపున పడమటి మమతా మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ తరపున పాటీ పావని జగన్మోహన్ రెడ్డి, పోటీ చేయగా వారికి ఒక్కొక్కరికి నాలుగు ఓట్లు మాత్రమే లభించాయి. 18 ఓట్ల మెజారిటీతో గరుగు రాజు వైస్ చైర్మన్ గా ఎన్నికైనట్లు అధికారులు అధికారికంగా ప్రకటించారు. దీంతో మొయినాబాద్ మున్సిపాలిటీలో చైర్ పర్సన్ను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. వైస్ చైర్మన్ స్థానాలు స్వతంత్ర అభ్యర్థి గరుగు రాజు కైవసం చేసుకున్నాడు. మొయినాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గా దుబ్బ సోనియా దర్శన్, వైస్ చైర్మన్ గరుగు రాజులను సభ్యుల ద్వారా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన చైర్ పర్సన్ దుబ్బ సోనియా దర్శన్, వైస్ చైర్మన్ గరుగు రాజును మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ ప్రమాణ స్వీకారం చేయించారు.

# డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

**ఎమ్మెల్యే కు వినతిపత్రం అందజేసిన కాలనీవాసులు**



**రాజేంద్రనగర్, మహా :** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్, మార్కండేయ నగర్ లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని మాజీ వార్డు సభ్యులు సోమ శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో కాలనీవాసులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందించి హెచ్ ఎం డబ్ల్యూ ఎస్ & ఎస్ బి అధికారులు సమస్యను త్వరితగతిన పరిష్కరించి కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ధనంజయ్, కాళీ దాస్, కిషోర్, సోమ సందీప్ రాములు నాయక్, జంగీర్, శికేందర్, బక్క రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి







**షాద్ నగర్. మహా:** షాద్ నగర్ మున్సిపల్ కౌన్సిలర్లుగా ఎన్నికైన నందారం అశోక్, వాని పాండురంగ రెడ్డి, అరిఫా బేగం (అద్దుఅజాజ్), బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తాండ్ర వెంకట్ రెడ్డి, పోమాల్ పల్లి సర్పంచ్ భూపాల్ రెడ్డి, భాను శర్మ,దినేష్ సాగర్, రామ్ నగర్ లడ్డు తదితరులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్‌గా అగ్గనూరు బస్వం,

# వైస్ చైర్మన్‌గా అందె మోహన్ ప్రమాణ స్వీకారం





**షాద్ నగర్. మహా:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం మున్సిపల్ లో ముందుగా 28 వార్డులలో నూతనంగా ఎన్నుకోబడ్డ కౌన్సిలర్లను ఆర్ డి ఓ సరిత, మున్సిపల్ కమిషనర్ సునీత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతనంగా ఎన్నుకోబడ్డ కౌన్సిలర్లు చైర్మన్, అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందే మోహన్ ను ఎన్నుకున్నారు. నూతన మున్సిపల్ చైర్మన్‌గా అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్‌గా అందె మోహన్ ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ అగ్గనూరు బస్వం మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధి, శుభ్రత, మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రజలకు పారదర్శక పాలన అందించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ అందె మోహన్ మాట్లాడుతూ.. చైర్మన్‌తో కలిసి షాద్‌నగర్ అభివృద్ధికి కృషి చేస్తామని, ప్రతి వార్డు సమస్యలను పరిష్కరించేందుకు ముందుంటామని చెప్పారు. ఈ కార్యక్రమం అనంతరం నాయకులను శుభాకాంక్షలు తెలియజేస్తూ పుష్పగుచ్చాలు అందజేశారు. పట్టణ ప్రజలు నూతన నాయకత్వంపై ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**కొత్తగూడెం కార్పొరేషన్ చైర్మన్ సిపిఐ పార్టీ కైవసంతో**

# సిపిఐ నాయకులు టపాసులతో సంబరాలు



**రాజేంద్రనగర్, మహా :** కొత్తగూడెం కార్పొరేషన్ చైర్మన్ సిపిఐ పార్టీ అభ్యర్థిగణేష్ ఎన్ని కావడంతో సిపిఐ నాయకులు సాంబశివరావు కి కృతజ్ఞతలు తెలియజేస్తూ సిపిఐ మండల కార్యదర్శి నర్సగిరి ఆధ్వర్యంలో శంషాబాద్ చౌరస్తాలో టపకాయలు పేల్చుతూ మిఠాయిలు తినిపిస్తూ సంబరాలు నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు సిపిఐ నాయకులకు మిఠాయిలు తినిపించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు టి రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ యాదగిరి,జిల్లా సమితి సభ్యుడు కే చందు యాదవ్, వనంపల్లి జైపాల్ రెడ్డి, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అన్యపు ప్రభు, ఏఐటీయూసీ గిలక రాజు, తుపాకుల రాములు, తదితరులు పాల్గొన్నారు.

# చైర్మన్ ఎన్నిక నేటికీ వాయిదా...

- **చైర్మన్ ఎన్నిక ఓటింగ్ లో పాల్గొన్న ఎమ్మెల్యే రంగారెడ్డి...**
- **సభ్యుల మధ్య వాగ్వాదం..సభలో గందరగోళం...**
- **ఎన్నిక వాయిదా పడడంతో వెనుదిరిగిన ఎమ్మెల్యే**
- **ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఉత్కంఠత నెలకొంది...**
- **నేటి చైర్మన్ ఎన్నికకు కౌన్సిలర్ యాదగిరి హాజరవుతారా..?**
- **చైర్మన్ ఎన్నిక సులభతరం అవుతుందా..?**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో సోమవారం జరిగిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సమావేశంలో, కాంగ్రెస్ బీఆర్ఎస్ సభ్యుల మధ్య వాగ్వాదం, తీవ్ర గందరగోళానికి దారి తీసింది... మంగళవారానికి చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నికను వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి ఆర్డీవో తెలిపారు... వాయిదా అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి వెళ్లిన ఎమ్మెల్యే రంగారెడ్డి, కాంగ్రెస్ బీఆర్ఎస్ బిజెపి కౌన్సిలర్లు... చైర్మన్ ఎన్నిక...లో 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి హాజరు కాకపోవడంతో సమావేశంలో జరిగింది, ఈ గందరగోళంతో రెండుసార్లు వాయిదా వేసినా, సభ్యుల మధ్య తీరు మారక, సభలో గందరగోళం నెలకొంది.... గందరగోళం మధ్య ఆర్డిఓ అనంతరెడ్డి, ఈ యొక్క ఎన్నికను నేటికి వాయిదా వేయడం జరిగింది... నేటి ఈ సమావేశానికి కౌన్సిలర్ ఆకుల యాదగిరి హాజర్ అవుతారా, చైర్మన్ ఎన్నిక సులభతరంగా జరుగుతుందా లేదా అనేది, వేచి చూడాల్సి ఉంది.

**మున్సిపాలిటీలో ఎన్నడూ లేని రీతిలో చైర్మన్ ఎన్నిక.?..**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 2014లో ఏర్పాటు జరిగింది. నాటి నుంచి 2020 వరకు రెండు పర్యాయాలు ఎస్సీ రిజర్వేషన్ కావడంతో చైర్మన్ ఎన్నిక సులభంగా జరిగిపోయింది. ప్రస్తుతం జనరల్ రిజర్వేషన్ కావడంతో పోటీ తీవ్రతరమైంది. అగ్రకుల నాయకులు చైర్మన్ పదవి చేజికించుకోవాలని పోటాపోటీగా ముందుకు రావడంతో, బీసీ నినాదం తెరపైకి వచ్చింది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 24 వార్డులు ఉండగా ఖానాపూర్ సీతారాంపేట్ శేరిగూడ గ్రామాలలో ఐదు వార్డులు ఉండగా, మున్సిపాలిటీ కేంద్రంలో 19 వార్డులు ఉండడంతో ఒకటి రెండు వార్డులు కలిగిన గ్రామాలకు చైర్మన్ పదవి ఇవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, మున్సిపాలిటీ కేంద్రంలో 19 వార్డులు ఉన్న సభ్యులకు చైర్మన్ ఎందుకు ఇవ్వరు అనేది ప్రశ్నార్థకంగా మారింది.

**40 సంవత్సరాల రాజకీయ జీవితం....**

40 సంవత్సరాల నుంచి రాజకీయ జీవితంలో కొనసాగుతున్న ఆకుల యాదగిరికి చైర్మన్ పదవి ఇవ్వాలనేది సభ్యుల ఆందోళన. దీంతో సోమవారం చైర్మన్ ఎన్నికల్లో ఆయన హాజరు కాకపోవడంతో సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొని గందరగోళం జరిగింది. ఎన్నికల అధికారి ఏమీ చేయలేని పరిస్థితిలో ఎన్నికను నేటికీ (మంగళవారం) వాయిదా వేయడం జరిగింది. నేటి ఈ ఎన్నికకు ఆయన హాజరవుతారా అనేది వేచి చూడాల్సి ఉంది.

**నా భర్త ఆచూకీ తెలపండి... ఆకుల యాదగిరి భార్య.....**

తన భర్తను కిడ్నాప్ చేశారని ఆకుల యాదగిరి భార్య, కొడుకు ఆందోళనకు దిగారు. అనంతరం ఆర్డీవో అనంతరెడ్డికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొడుకు, మా ఇంటి వద్దకు వచ్చి, నా భర్త ఆకుల యాదగిరినీ క్యాంపుకు తీసుకెళ్లారని ఆమె ఆరోపించారు.....సోమవారం ప్రమాణ శ్రీకారానికి 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి హాజరు కాకపోవడంతో అతని భార్య, కొడుకు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. నా భర్త లేకుండా చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక ఎలా చేస్తారని, ఎన్నికను వాయిదా వేయాలని, ఆర్డీవోతో ఆమె విన్నవించుకున్నారు.

**పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు ఎఫ్ఐఆర్ నమోదు....**

ప్రమాణ స్వీకారానికి ఆకుల యాదగిరి హాజరు కాకపోవడంతో పలు అనుమానాలను వ్యక్తం చేస్తూ అతని భార్య, నా భర్త ఆచూకీ తెలపాలంటూ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఫిర్యాదు అమ్ముకున్న పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సిఐ మహేందర్ రెడ్డి తెలిపారు. ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి వినత పత్రం అందజేసిన 19వ వార్డ్ సభ్యుడు ఆకుల యాదగిరి భార్య... ఆమె యొక్క వాంగ్మూలం ఆర్డిఓ తీసుకోవడం జరిగింది.... ఆందోళన చేపట్టిన ఆమెను, పోలీసులు అదుపులోకి తీసుకొని ఇంటికి పంపించడం జరిగింది.

**మున్సిపల్ కార్యాలయం పై రాళ్ల దాడి....**
**మహేశ్వరం డిసిపి కె నారాయణరెడ్డి**

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో.. చైర్మన్ వైస్ చైర్మన్ జరుగుతున్న సమయంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంపై రాళ్ల దాడి జరగడం చర్చనీయాంశం అయింది..రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కార్యాలయం వెనకాల నుండి పైకి రాళ్లతో దాడి చేసిన తెలియని దుండగులు. కార్యాలయం భవన అద్దాలు ధ్వంసమయ్యాయి.దాడి చేసిన వ్యక్తి ని అదుపులోకి తీసుకున్న పోలీసులు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకోబడుతుందని, మహేశ్వరం డిసిపి కే నారాయణ రెడ్డి వెల్లడించారు....కార్యాలయం చుట్టూ భారీగా మోహరించిన పోలీసులు... సోమవారం జరిగిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వై సుదర్శన్, మహేశ్వరం డిసిపి నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసిపి కేపీవి రాజు, సీఐ మహేందర్ రెడ్డి ,కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు...

# ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు

**చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్**



**కుషాయిగూడ, మహా :** మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్‌లో షాబుద్దీన్ మెయిన్ రోడ్‌పై కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిలో రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు వెలిసిన ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది. భూకబ్జాదారులు సెలవుదినాలు, అధికారుల గైర్హాజరు సమయాలను అవకాశంగా తీసుకుని ప్రభుత్వ స్థలాల్లో షట్టర్లు ఏర్పాటు చేసి వాణిజ్య నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికుల సమాచారం ప్రకారం, గత కొన్ని రోజులుగా యంత్రాలతో స్థలాన్ని చదును చేసి వేగంగా గోడలు, షట్టర్లు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. సంబంధిత అనుమతులు లేకుండానే నిర్మాణాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వానికి చెందిన స్థలాలను వ్యక్తిగత లాభాల కోసం వినియోగించడం వల్ల ప్రజా ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాల కారణంగా భవిష్యత్తులో రహదారి విస్తరణ, పార్కులు, ప్రజా అవసరాల కోసం ఉద్దేశించిన ప్రణాళికలు నిలిచిపోతాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే ప్రాంతంలో పార్కింగ్ సమస్యలు, ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగాయని పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై కాప్రా రెవెన్యూ అధికారులు, మేడ్చల్ జిల్లా కలెక్టర్ వెంటనే స్థల పరిశీలన చేసి అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. భూకబ్జాదారులపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# అలియాబాద్ మున్సిపల్ హస్తగతం

**ఫలించిన కాంగ్రెస్ నేత ఐక్యత**

**కుషాయిగూడ, మహా :** మేడ్చల్ జిల్లా అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ హస్తగతం అయ్యింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎన్ని రకాల ప్రయత్నాలు చేసిన, ధనం,మద్యం ఏరులై పారించిన ఆయన పాచికలు పారలేదు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ ల సమన్వయంతో అలియాబాద్ మున్సిపాలిటీ పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసి కాంగ్రెస్ పార్టీ క్యాడర్ లో జోష్ నింపారు. భవిష్యత్తు లో కూడా ఇలాంటి ఐక్యతతోనే జిల్లాలో కాంగ్రెస్ పార్టీని పూర్తి స్థాయిలో బలోపేతం చేయడానికి కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు.

# సామాన్యుడికే మేయర్ పట్టం

## కొలగాని శ్రీనివాస్ పేరును ఖరారు చేసిన బీజేపీ నాయకత్వం

డిప్యూటీ మేయర్ గా సునీల్ రావు.. మేయర్ అభ్యర్థి పేరును ప్రతిపాదించిన మాసం గణేశ్, శ్రీలేఖ
డిప్యూటీ మేయర్ అభ్యర్థి పేరును ప్రతిపాదించిన సోమిడి వేణు
ఏకగ్రీవంగా ఆమోదించిన బీజేపీ కార్పొరేటర్లు.. ఏబీవీపీ నుండి మొదలైన కొలగాని ప్రస్థానం
ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర
కార్యకర్త నుండి మేయర్ దాకా కొలగాని ప్రస్తానం
రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు కు ధన్యవాదాలు తెలిపిన కేంద్ర మంత్రి బండి సంజయ్

**రామచంద్రరావుకు బండి సంజయ్ ధన్యవాదాలు**
కరీంనగర్ మేయర్ అభ్యర్థిగా కొలగాని శ్రీనివాస్ పేరును ఖరారు చేయడంపట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావుకు ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్ర నాయకత్వం అందించిన సహకారం, లీగల్ సాయం ఎనలేనిదని పేర్కొన్నారు.

**కరీంనగర్ మహా :** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ "మేయర్" పదవి సామాన్యుడికే దక్కింది. భారతీయ జనతా పార్టీ పక్షాన మేయర్ అభ్యర్థిగా 2వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ పేరును ఖరారు చేసింది. డిప్యూటీ మేయర్ గా మాజీ మేయర్ సునీల్ రావును ఎంపిక చేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు ఈ మేరకు వారి పేర్లను ఖరారు చేస్తూ లేఖపై సంతకం చేశారు. బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు ఆంటోనీ రెడ్డి ఆ లేఖతో కూడిన కవర్ ను తీసుకుని ఈరోజు ఉదయం కరీంనగర్ కు విచ్చేశారు. ఈ నేపథ్యంలో నగరంలోని వి.కన్వెన్షన్ లో బీజేపీ కార్పొరేటర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ జిల్లా బీజేపీ కరీంనగర్ జిల్లా ఇంఛార్జీ డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ల సమక్షంలో డాక్టర్ మనోహర్ రెడ్డి హైకమాండ్ ఖరారు చేసిన పేర్లను కార్పొరేటర్లకు తెలియజేస్తూ వారి అభిప్రాయాలు చెప్పాలని కోరారు. ఈ సందర్భంగా 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేశ్ మేయర్ అభ్యర్థిగా కొలగాని శ్రీనివాస్ పేరును ప్రతిపాదించగా, 62వ డివిజన్ కార్పొరేటర్ పెద్దపల్లి శ్రీలేఖ బలపర్చారు. అట్లాగే డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా సునీల్ రావు పేరును 29వ డివిజన్ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ ప్రతిపాదించగా, 51వ డివిజన్ కార్పొరేటర్ భండారి వేణు బలపర్చారు. బీజేపీ సీనియర్ కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీ, వాసాల రమేశ్ సహా బీజేపీ కార్పొరేటర్లందరూ కొలగాని శ్రీనివాస్, సునీల్ రావు పేర్లను మేయర్, డిప్యూటీ మేయర్ అభ్యర్థులుగా ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు చప్పట్లతో తమ ఆమోదం తెలిపారు. అక్కడి నుండి నేరుగా ప్రత్యేక బస్సుల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కు విచ్చేసిన కార్పొరేటర్లంతా ప్రమాణ స్వీకారం చేశారు.




**వడబోసిన హైకమాండ్**

వాస్తవానికి కరీంనగర్ మేయర్ పదవిపై బీసీ కార్పొరేటర్లంతా ఆశలు పెట్టుకున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకున్న జిల్లా నాయకత్వం బీసీ, జనరల్ స్థానాల్లో గెలుపొందిన బీసీ కార్పొరేటర్ల పేర్లను, వారి బయోడేటాను రాష్ట్ర నాయకత్వానికి పంపింది. ఆ జాబితాలో ఉన్న ఒక్కో కార్పొరేటర్ పేరును, పార్టీకి చేసిన సేవలు, ప్రజల్లో ఉన్న పేరును పరిశీలించింది. చివరకు ఏబీవీపీ నుండి రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి కష్టపడి అంచలంచెలుగా ఎదిగిన సామాన్య కార్యకర్త కొలగాని శ్రీనివాస్ పేరును ఖరారు చేసింది.

**షాక్ లో కొలగాని...**

వాస్తవానికి మేయర్ అభ్యర్థి పదవి తనను వరిస్తుందని కొలగాని శ్రీనివాస్ అస్సలు ఊహించలేదు. ఈరోజు ఉదయం బీజేపీ కార్పొరేటర్ల సమావేశంలో పార్టీ జిల్లా ఇంఛార్జీ గంగిడి మనోహర్ రెడ్డి కొలగానిని మేయర్ అభ్యర్థిగా రాష్ట్ర నాయకత్వం ఖరారు చేసిందని తెలియజేయడంతో కొలగాని ఒక్కసారిగా ఆశ్చర్యానికి లోనయ్యారు. కార్పొరేటర్లంతా వచ్చి కొలగానికి అభినందనలు తెలియజేస్తున్న సమయంలోనూ ఆశ్చర్యం, ఆనందంతోపాటు ఆనందంతో చెమర్చిన కళ్లతో అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ, జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్, రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. సామాన్య కార్యకర్తనైన తనను మేయర్ కు ఎంపిక చేస్తుందని కలలో కూడా ఊహించలేదన్నారు. బీజేపీలో కష్టపడి, విధేయతతో పనిచేస్తే పదవులు వాటంతట అవే వస్తాయనే దానికి తానే నిదర్శనం అని చెప్పారు. 37 ఏళ్ల కొలగాని శ్రీనివాస్ 1989 జూన్ కరీంనగర్ జిల్లా తీగలగుట్టపల్లిలో జన్మించారు. ఎంబీఏ, ఎంఎస్ డబ్ల్యూ చేసిన కొలగాని చిన్నప్పటి నుండే ఆర్ఎస్ఎస్ లో శాఖలో చురుకుగా పాల్గొనే వారు. 2013లోనే ప్రాథమిక శిక్షను పూర్తి చేశారు. చిన్ననాటి నుంచే స్వామి వివేకానంద ఆలోచనలతో ప్రభావితమై ఎన్ఎస్ఎస్, ఎన్ వైపీ, ఏక్తా పరిషత్ సంస్థల ద్వారా అనేక సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. విద్యార్థి దశ నుండే రాజకీయాల పట్ల ఆసక్తి ఉండేది. 2005 నుండి 2007 వరకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ లో పనిచేసి విద్యార్థుల సమస్యలపై పోరాడారు. 2007 నుండి 2009 వరకు భారతీయ జనతా యువ మోర్చాలో పనిచేసి యువజన పోరాటాల్లోనూ పాలు పంచుకున్నారు. 2007 నుండి 2009 వరకు ఎన్ఎస్ఎస్ వలంటీర్ గా పనిచేసి 2010లో కాకతీయ విశ్వవిద్యాలయం నుండి ఉత్తమ వలంటీర్ అవార్డును అందుకున్నారు. నేషనల్ యూత్ ప్రాజెక్టు చేరి దేశ సేవకు అంకితం కావాలని భావించిన కొలగాని 2009లో అసోంలో జరిగిన నేషనల్ ఇంటిగ్రేషన్ అండ్ పీస్ క్యాంప్ కు హాజరయ్యారు. లక్షద్వీప్, బెంగళూరు, యూపీ, రాజస్తాన్, ఉత్తరాఖండ్, హర్యానా, అండమాన్ నికోబార్ లలో నిర్వహించిన అనేక జాతీయ స్థాయి శిబిరాల్లోనూ పాల్గొన్నారు. యువత & పిల్లలతోపాటు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనే వారు. ఇప్పటి వరకు 15 సార్లు రక్తదానం చేశారు. 2009 నుండి 2013లో ఏక్తా పరిషత్ కార్యక్రమాల్లో పాల్గొని ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేశారు. కొలగాని సేవలకు గాను 2005 లో భాయిజీ సేవా పురస్కార్ (NYP), 2010లో NSS ఉత్తమ వలంటీర్, 2021 - కరోనా కాలంలో అందించిన సేవలకుగాను కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ చేతుల మీదుగా 'రక్షక్ అవార్డు'లను అందుకున్నారు. ఇక రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే... 2014 నుండి 2019 వరకు BJP మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2020 నుండి 2025 వరకు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ కార్పొరేటర్ గా కొనసాగారు. 2021 లో కరోనా వ్యాక్సిన్ జిల్లా కన్వీనర్ గా, 2023 నుండి 2024 వరకు కరీంనగర్ టౌన్1 కన్వీనర్ గా, 2024 లో NIFFA రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, 2025 లో చొప్పదండి మండల సర్పంచ్ ఎన్నికల ఇన్‌చార్జ్ గా పనిచేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు.

# కార్పొరేషన్ లో అవినీతి జరగకుండా విజిలెన్స్ సెల్ ఏర్పాటు చేస్తాం

- చిన్న అవినీతి జరిగినా బిజెపిని విడిచి పెట్టే ప్రసక్తే లేదు..
- బిజెపి పాలకవర్గం పారదర్శకంగా పాలన సాగించాలి..
- ప్రతి డివిజన్లో అభివృద్ధి పనులు బిల్డింగ్ పర్మిషన్లపై నిఘా పెడతాం..
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు




**కరీంనగర్ మహా :** కరీంనగర్ నగర పాలక సంస్థలో కొత్తగా ఏర్పడిన బిజెపి పాలకవర్గం ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడకుండా నిరంతరం పర్యవేక్షణ చేసేందుకు ఒక ప్రత్యేక నిఘా వ్యవస్థ విజిలెన్స్ సెల్ ఆర్గనైజేషన్ ను ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. అక్రమాలకు పాల్పడిన కార్పొరేటర్ మేయర్ గా, మేయర్ గా పని చేస్తున్న వ్యక్తి డిప్యూటీ మేయర్ గా ఎన్నిక కావడం పట్ల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. సోమవారం సాయంత్రం కరీంనగర్ డిసిసి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లతో కలిసి వెలిచాల రాజేందర్ రావు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేందర్రావు మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ లో చిన్న అవినీతి జరిగినా విడిచిపెట్టే ప్రసక్తి లేదని ప్రతి డివిజన్లో జరిగే అభివృద్ధి పనులు బిల్డింగ్ పర్మిషన్లు ఇతరత్రా పనులపై పర్యవేక్షణకు ప్రత్యేక విజిలెన్స్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ప్రతి పని ప్రతి పేమెంటు మానిటరింగ్ చేసి నాణ్యత పరిశీలించి ప్రభుత్వం బిల్లులు చెల్లించేలా కృషి చేస్తామన్నారు. ప్రజలను అవినీతి అక్రమాల నుంచి కాపాడుతామని స్పష్టం చేశారు. బిజెపి పాలకవర్గం అవినీతి అక్రమాలకు పాల్పడకుండా నిరంతరం నిఘా పెడతామని తేడాలు వస్తే ముఖ్యమంత్రి మంత్రుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని చెప్పారు. ప్రజలకు పారదర్శకమైన పాలన అందించాలని బిజెపి పాలకవర్గం జాగ్రత్తగా ప్రజలకు సేవలు అందించాలన్నారు. గత బిఆర్ఎస్ హయంలో జరిగినట్లు అవినీతి అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. నాడు కేంద్రమంత్రి బండి సంజయ్ సునీల్ రావు అవినీతిపరుడని అనేకసార్లు విమర్శించి పార్టీలో చేర్చుకున్నారని ఆరోపించారు. నాడు విమర్శించి నేడు మళ్ళీ డిప్యూటీ మేయర్గా ఎంపిక చేయడంపై ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. అవినీతిపరులను పార్టీలో చేర్చుకొని మళ్లీ పదవులు ఇవ్వడం పట్ల విస్మయం కలుగుతుందన్నారు. కార్పొరేషన్ లో కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్ష పార్టీకి అవతరించినా కరీంనగర్ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా మంత్రులు శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ సహకారంతో కరీంనగర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా పెద్ద ఎత్తున నిధులు తెస్తానని పేర్కొన్నారు. ఎవరు చేయని విధంగా ఏ ఎమ్మెల్యే తేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని రాజేందర్ రావు తెలిపారు. కరీంనగర్ లో అవినీతికి ఆస్కారం లేకుండా క్లీన్ గా పాలన సాగించేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తామన్నారు. ప్రతి అభివృద్ధి పనిపై మానిటరింగ్ చేసి బిల్లులు ఇప్పించేలా చూస్తామన్నారు. గతంలో జరిగిన అవినీతి అక్రమాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు. కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలుకు కట్టుబడి పని చేస్తామన్నారు. ప్రతి వార్డులో అభివృద్ధి పనులు బిల్డింగ్ పర్మిషన్లు ఇతరత్రా ప్రజా అవసరాలకు ఎలాంటి డబ్బులు ఆశించకుండా బిజెపి పాలకవర్గం పనిచేయాలని సూచించారు. ఒకవేళ అవినీతి అక్రమాలకు పాల్పడితే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ విషయంలో జాగ్రత్తగా అప్రమత్తంగా బిజెపి పాలకవర్గం పనిచేయాలని సూచించారు. కరీంనగర్ రైసింగ్ ఆర్గనైజేషన్ పేరిట ప్రతి డివిజన్లో ముగ్గురు వ్యక్తులతో కలిసి కమిటీని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రతి డివిజన్లో జరిగే అభివృద్ధి పనులు బిల్డింగ్ పర్మిషన్లు ఇతరత్రా పనులకు సంబంధించి పర్యవేక్షణ చేస్తుందన్నారు. ప్రజల పక్షాన ఉండి ప్రజలకు మేలు జరిగేలా చూస్తామన్నారు. కరీంనగర్ ప్రజలకు 24 గంటల పాటు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో చెప్పినట్లు మేనిఫెస్టో ప్రకారం కరీంనగర్ అభివృద్ధికి కృత నిశ్చయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

# వేములవాడ మున్సిపల్ చైర్మన్‌గా పుల్కం రాజు

- వైస్ చైర్మన్‌గా నరాల శేఖర్



**వేములవాడ, మహా:** వేములవాడ మున్సిపల్ చైర్మన్‌గా పుల్కం రాజు, వైస్ చైర్మన్‌గా నరాల శేఖర్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నూతన పాలకవర్గ సభ్యులతో కలిసి శ్రీ రాజరాజేశ్వర దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**- అంచెలంచెలుగా ఎదిగిన నాయకుడు పుల్కం రాజు**

వేములవాడ పట్టణానికి చెందిన పుల్కం రాజు గత 20 సంవత్సరాలుగా చురుకైన రాజకీయ నాయకుడిగా గుర్తింపు పొందారు. విద్యావంతుడైన ఆయన తొలుత టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) పార్టీలో కార్యకర్తగా చేరి, అంచెలంచెలుగా ఎదిగి పట్టణ శాఖ అధ్యక్షుడిగా రెండు సార్లు బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన సతీమణి శ్రీలతను కౌన్సిలర్‌గా గెలిపించడంతో పాటు, టీఆర్ఎస్ ప్రభుత్వంలో రెండు సార్లు కోఆప్షన్ సభ్యుడిగా అవకాశాలు పొందారు. ప్రతి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరిన పుల్కం రాజు, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గెలుపుకోసం అనుభవంతో అహర్నిశలు శ్రమించారు. ఆయన కృషిని గుర్తించిన కాంగ్రెస్ అధిష్టానం మున్సిపల్ చైర్మన్ పదవిని అప్పగించింది.

**ప్రజల ఆశీస్సులతో విజయం: చైర్మన్ పుల్కం రాజు**

చైర్మన్‌గా ఎన్నికైన అనంతరం పుల్కం రాజు మాట్లాడుతూ, "మొన్నటి ఎన్నికల్లో గత ప్రభుత్వం చేయని పనులను రెండు సంవత్సరాల్లో పూర్తి చేశామని ప్రజలకు వివరించి ఓటు కోరాం. మా అభివృద్ధి పనులను చూసి ప్రజలు మాకు పట్టం కట్టారు" అని తెలిపారు. వేములవాడ గత ప్రభుత్వంలో వెనక్కి నెట్టివేయబడిందని, ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి పనులకు ఇది ప్రజలు ఇచ్చిన పాస్ మార్కులని అన్నారు. ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కట్టుబడి ఉన్నామని పుల్కం రాజు స్పష్టం చేశారు. మున్సిపల్ పాలకవర్గం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతుందని తెలిపారు.

# హుజూర్ నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గెల్లి రవి నియామకం



**హుజూర్ నగర్ మహా:** సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులుగా గెల్లి రవి ని నియమిస్తూ సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులలో పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ గా సుంకరి శివరాం యాదవ్, టౌన్ జనరల్ సెక్రటరీగా తేజావత్ రాజా, జాయింట్ సెక్రటరీగా గంజి శివ లను కూడా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు నియమించడం జరిగింది గెల్లి రవి ఎన్నిక కావడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఆయన నాయకత్వంలో పట్టణ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని నాయకులు మరియు కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం తో తనను టౌన్ అధ్యక్షుడు గా ప్రతిపాదించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి పుర ప్రముఖులకు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు గెల్లి రవి కృతజ్ఞతలు తెలిపారు.



# దళితులను రక్షించేందుకు జాతీయ ఎస్సీ కమిషన్ ఎల్లప్పుడూ కృషి చేస్తుంది

**కర్ల రాజేష్ హత్య కేసుపై అధికారులపై జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు విచారణ**

**సూర్యాపేట జిల్లా మహా:** దళితులను రక్షించేందుకు జాతీయ ఎస్సీ కమిషన్ నిరంతరం కృషి చేస్తుందని జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్ర రావు స్పష్టం చేశారు. సోమవారం కోదాడ పట్టణంలో ఇటీవల పోలీసు లాక్ ఆఫ్ డెత్ కు గురైన కర్ల రాజేష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రాజేష్ తల్లి లలితమ్మతో రాజేష్ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నుండి మంజూరైన పెన్షన్ పత్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అడిషనల్ డీజీ చౌహాన్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ సమక్షంలో రాజేష్ తల్లి లలితమ్మకు అందజేశారు. అనంతరం కోదాడ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమీషన్ సభ్యులు మాట్లాడుతూ, కర్ల రాజేష్ కేసు పత్రికల్లో చూసి జాతీయ ఎస్సీ కమిషన్ సుమోటో కింద కేసు నమోదు చేసిందన్నారు. కమిషన్ కేసులో ప్రవేశించిన అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, రాజేష్ మృతి పై నేటి వరకు చార్జీ సీటు ఎందుకు వేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు చార్జిషీట్ కు సమయం కోరారని కాగా కమిషన్ చార్జిషీటు వెంటనే దాఖలు చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. కేసులో బాధ్యులైన సిఐపై చర్య తీసుకోవడమే కాక, ఎస్సైపై వెంటనే చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీజీ, జిల్లా ఎస్పీలని ఆదేశించారు. పది రోజుల్లో రీపోస్టుమార్టం చేసి నివేదికను అందించాలని ఆదేశించారు. 1989 జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ సెక్షన్ 4 ప్రకారం కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు జవాబు ఇవ్వకపోతే నిర్లక్ష్యపు యాక్ట్ ప్రకారం సస్పెన్షన్ తో పాటు ఆరు నెలలు జైలు ఉంటుందని హెచ్చరించారు. రాజేష్ తల్లికి పెన్షన్ మంజూరు చేయడం జరిగిందని, మూడు రోజుల్లో ఉద్యోగం, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు లేదా ఉన్న స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, వ్యవసాయ భూమి ఇచ్చేందుకు కలెక్టర్ తగు చర్యలు తీసుకో వలసినదిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట అడిషనల్ డిజి డిఎస్ చౌహాన్ కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, ఆర్డీవో సూర్యనారాయణ, డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి దయానందరాణి, తదితరులు పాల్గొన్నారు.

# గొప్ప దైవజనులు బిషప్ సి. హెచ్. జయరాజు ఇక సెలవు

- సి.ఎఫ్. జి. చర్చ్ - నార్కట్ పల్లి
- ఘన వీడ్కోలు పలికిన వేలాది క్రైస్తవులు
- తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్



**సూర్యాపేట జిల్లా మహా:** నార్కట్ పల్లి మండల కేంద్రంలోని సి. ఎఫ్. జి. చర్చ్ వ్యవస్థాపకులు గొప్ప దైవజనులు సీనియర్ పాస్టర్ బిషప్ సి. హెచ్.జయరాజు (62) గత కొంతకాలంగా అనారోగ్యంతో బసవతారక హాస్పిటల్ హైదరాబాద్ చికిత్స పొందుతూ నిన్న మధ్యాహ్నం మృతి చెందిన విషయం ఉమ్మడి నల్గొండ జిల్లాను కలిసివేసిందని వారి ప్రార్థివ దేహానికి పూల మాల వేసి వారి కుటుంబాన్ని పరామర్శించిన తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్, చార్లెట్ చారిటబుల్ ఫౌండేషన్ సూర్యాపేట వ్యవస్థాపకులు బ్రదర్ జాటోత్ డేవిడ్ రాజు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారికి భార్య రెచల్ ఇద్దరు కుమార్తెలు వున్నారని వేల మంది ఆత్మీయ బిడ్డలను సంపాదించారాని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా కన్వీనర్ పాస్టర్ చింత మనిషే, నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ క్రైస్తవ నాయకులు పోకల అశోక్, సీనియర్ నాయకులు మర్రి రాజు, నకిరేకల్ నియోజకవర్గ ఫెలోషిప్ పాస్టర్స్ అధ్యక్షులు రెవ. వేముల హనోక్, బిషప్ వై. సమర్పణ కుమార్ జాన్సీ రాణి ,తుంగతుర్తి నియోజకవర్గ అధ్యక్షులు బాకీ పరంజ్యోతి, చింత సుధాకర్, పాస్టర్ రావుల అబ్రామ్, పాస్టర్ ఏసురత్నం, పాస్టర్ జిల్లా సంసన్ పాస్టర్ జీవప్రకాష్ బల్లెం, పాస్టర్ నామ మోజెష్, కత్తుల యెహోవా దాసు తదితరులు పాల్గొన్నారు

# భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ గా తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్




**భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లతో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సోమవారం నాడు మున్సిపల్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయించారు భువనగిరి మున్సిపల్ చైర్మన్ గా 35 వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ ఎన్నికైయ్యారు, వైస్ చైర్మన్ గా 29 వార్డు కాన్సిలర్ పోతంశేటి మంజుల వెంకటేష్ ఎన్నికైనారు...

# వెంటనే పిఆర్‌పి గ్రామ కమిటీలను పూర్తి చేయాలి

**జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు యేసుబాబు పటేల్ ఆదేశం**



**మణుగూరు, మహా :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ బలోపేతానికి జిల్లాలోని అన్ని మండలాల్లో గ్రామ కమిటీల నియామక ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు యేసుబాబు పటేల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న, రాష్ట్ర కమిటీ నిర్ణయాల మేరకు ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని మండల అధ్యక్షులు, మండల ప్రధాన కార్యదర్శుల కు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు గ్రామ కమిటీలే వెన్నెముక అని పేర్కొన్నారు. రాబోయే కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో గ్రామ స్థాయి కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత విస్తరించాలంటే ప్రతి గ్రామంలో సమర్థవంతమైన నాయకత్వం అవసరమని అన్నారు.

**సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యం**

గ్రామ కమిటీల్లో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, మహిళలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలని సూచించారు. యువతకు ప్రాధాన్యం కల్పించి, ఉత్సాహవంతులైన యువ నాయకులను ముందుకు తీసుకురావాలని పేర్కొన్నారు. వచ్చే 15 రోజులలోపు జిల్లాలోని అన్ని గ్రామాల్లో కమిటీల ఎంపిక పూర్తి చేసి, తుది జాబితాను జిల్లా కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు.

**కమిటీ నిర్మాణం..**

గ్రామ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, కార్యవర్గ సభ్యులు గ్రామ పరిమాణాన్ని బట్టి 5 నుంచి 11 మంది, సోషల్ మీడియా గ్రామ ఇంచార్జ్, రైతు గ్రామ విభాగం, యూత్ గ్రామ విభాగం, మహిళా గ్రామ విభాగం ఇలా నియామకాలు చేపట్టాలన్నారు. ప్రతి ఇంటిపై పార్టీ జెండా ఎగరాలంటే బలమైన గ్రామ కమిటీలే పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు. కమిటీ నియామక ప్రక్రియలో ఎలాంటి సందేహాలు ఉన్నా జిల్లా నాయకత్వాన్ని వెంటనే సంప్రదించాలని సూచించారు.

# నాగర్ కర్నూల్ మున్సిపాలిటీలో కొలువుదీరిన నూతన పాలకవర్గం

**నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్..**



**నాగర్ కర్నూల్ మహా :** ఫిబ్రవరి 11న జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో ఎన్నికైన 24 మంది నూతన సభ్యులను జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశాల మేరకు నాగర్ కర్నూల్ మున్సిపాలిటీలో పరోక్ష విధానం ద్వారా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కొరకు సోమవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం నూతన పాలకవర్గం కొలువుదీరింది. మున్సిపాలిటీ రెండవ సాధారణ ఎన్నికల్లో విజయం సాధించిన కౌన్సిలర్లు అందరికి ప్రత్యేక అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలకు ఆల్ఫాబెటికల్ ఆర్డర్లు ముందుగా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ల, అనంతరం బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం 12.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ కూడా ప్రశాంతంగా ముగిసింది. 24 మంది సభ్యులున్న నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు, సమావేశానికి 18 మంది కాంగ్రెస్ సభ్యులు, 6 మంది బిఆర్ఎస్ సభ్యులు హాజరయ్యారు. 100 % కోరం సభ్యుల ప్రతిపాదన మేరకు అధికారులు చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ పురపాలిక చైర్ పర్సన్‌గా 23వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి తీగల సురేంద్ర పేరును 4వ వార్డు కౌన్సిలర్ సభ్యురాలు చింతలపల్లి వసంత ప్రతిపాదించగా 21వ వార్డు కౌన్సిలర్ పొగిడే శంకర్ బలపరిచారు. మరో అభ్యర్థి పేరు ప్రతిపాదనకు రాకపోవడంతో తీగల సురేంద్ర ను చైర్ పర్సన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రత్యేక అధికారి ప్రకటించారు. అనంతరం వైస్ చైర్మన్ గా 8వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి బాదం రమేష్ పేరును 11వ వార్డు కౌన్సిలర్ సభ్యురాలు ఆసిఫా బేగం ప్రతిపాదించగా, 6వ వార్డు కౌన్సిలర్ మక్కలపల్లి శ్రీనివాసులు బలపరిచారు. మరో పేరు ప్రతిపాదనకు రాకపోవడంతో వైస్ చైర్మన్ గా బాదం రమేష్ ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం ప్రత్యేక అధికారి చైర్మన్, వైస్ చైర్మన్ లను ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లను నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మునిసిపల్ కమీషనర్ నాగిరెడ్డి, తహసీల్దార్ తాబితారాణీ, ఎంపీడీవో చేన్నమ్మ, ఎన్నికల అధికారులు, మున్సిపల్ అధికారులు, ఎన్నికైన కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు...



# ఆలేరు మున్సిపల్ చైర్ పర్సన్ గా బీజన బాలమణి భాస్కర్

**వైస్ చైర్మన్ గా అంగడి ఆంజనేయులు**

**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ భీజన బాలమణి భాస్కర్ ను కాంగ్రెస్ కౌన్సిలర్ లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు...వైస్ చైర్మన్ గా అంగడి ఆంజనేయులు 6 వార్డ్ కౌన్సిలర్ ను ఎంపికైనారు...చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను భువనగిరి ఆర్డిఓ ఇన్ చార్జ్ ఎన్నికల అధికారి కృష్ణా రెడ్డి నిర్వహించారు.. అయితే ఆలేరు మున్సిపల్ 12 వార్డులకు గాను 7 గురు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిపొందగా, బిఆర్ఎస్ ముగ్గురు, బిజెపి ఇద్దరు కౌన్సిలర్ గెలిచారు ప్రమాణస్వీకారానికి బిఆర్ఎస్, బిజెపి కౌన్సిలర్స్ హాజరు కాలేదు.

# మహిళ హత్య కేసులో పూజారికి యావజ్జీవ కారాగార శిక్ష



**కుషాయిగూడ, మహా :** 2022లో సంచలనం సృష్టించిన మల్కాజిగిరి సిద్ధివినాయక దేవస్థాన మహిళ హత్య కేసులో కీలక తీర్పు వెలువడింది. ప్రధాన నిందితుడు పూజారి అనుముల మురళీకృష్ణను దోషిగా నిర్ధారించిన కోర్టు సోమవారం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. మల్కాజిగిరి విష్ణుపురి కాలనీలోని సిద్ధివినాయక దేవస్థానంలో 57 ఏళ్ల మహిళ బంగారు ఆభరణాలతో దర్శనానికి వచ్చిన సమయంలో ఈ ఘటన జరిగింది. ఆలయంలోనే ఆమెను హత్య చేసి, ధరించిన బంగారు ఆభరణాలను అపహరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం ఆ ఆభరణాలను విక్రయించిన ఆధారాలను పోలీసులు సేకరించారు. కేసును సమగ్రంగా విచారించిన న్యాయమూర్తి డి. కిరణ్ కుమార్ సాక్ష్యాలు, సాంకేతిక ఆధారాలను పరిశీలించి నిందితుడిని దోషిగా తేల్చారు. హత్య, దోపిడీ ఆరోపణలు రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు ప్రకటించారు. ఈ తీర్పుతో బాధిత కుటుంబానికి న్యాయం జరిగినట్లు పోలీసులు తెలిపారు. మూడు సంవత్సరాలుగా సాగిన ఈ కేసు విచారణకు ముగింపు పలికిన నేపథ్యంలో మల్కాజిగిరి ప్రాంతంలో ఈ ఘటన మరోసారి చర్చనీయాంశంగా మారింది.



# సమన్వయంతో సాఫీగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు

**అశ్వారావుపేట, మహా :** మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ప్రారంభమైన ప్రక్రియ సోమవారం నిర్వహించిన ప్రమాణ స్వీకారంతో పూర్తిగా ముగిసింది. ప్రారంభం నుంచి చివరి దశ వరకు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగడం విశేషం. పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన తదితర దశల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. చిన్నపాటి సాంకేతిక సమస్యలు కూడా తలెత్తకుండా ఎన్నికల అధికారులు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషించింది. పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించింది. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో సిబ్బంది, రెవెన్యూ శాఖ అధికారులు, మండల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేశారు. విభిన్న శాఖల సమిష్టి కృషితో ఎన్నికల ప్రక్రియ ఎలాంటి అంతరాయాలు లేకుండా పూర్తవడంతో ప్రజాస్వామ్య పద్ధతులు సమర్థంగా అమలైనట్లు స్థానికులు అభిప్రాయపడ్డారు.



## మరో ఐదేళ్లలో ఆ ఉద్యోగాలన్నీ మాయం!

ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టెక్ రంగంలోని ఉద్యోగుల్లో తీవ్ర భయాందోళనలు కలిగిస్తోంది. కొన్ని స్టార్టప్స్.. టెక్ కంపెనీలతో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకుని కొత్త ఏఐ టూల్స్ లాంచ్ చేస్తున్నాయి. ఇవి మానవ ప్రమేయం లేకుండా పనులను వేగంగా చేసేస్తున్నాయి. కాబట్టి చాలా సంస్థలు ఏఐలో పెట్టుబడులు పెడుతూ.. తమ ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకుంటున్నాయి. ఈ సమయంలో ప్రముఖ పారిశ్రామికవేత్త & వెంచర్ క్యాపిటలిస్ట్ 'వినోద్ ఖోస్లా' ఏఐ భవిష్యత్తుకు సంబంధించి కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. ఖోస్లా అభిప్రాయం ప్రకారం.. AI అభివృద్ధి వేగంగా జరుగుతున్నందున వైట్ కాలర్ ఉద్యోగాలలో భారీ మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా ఐటీ సర్వీస్, బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ (BPO) రంగాలు వచ్చే ఐదు సంవత్సరాలలో దాదాపు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడవచ్చని అన్నారు. ప్రస్తుతం ఏఐ సాధనాలు సాధారణ డిజిటల్ సహాయకుల స్థాయి నుంచి స్వయం నియంత్రిత కలిగిన AI వర్కర్స్ స్థాయికి ఎదుగుతున్నాయి. ఇవి అనేక పనుల్లో మానవులను సైతం మించిపోయే అవకాశం ఉందని ఖోస్లా వెల్లడించారు. అకౌంట్స్, లా, మెడిసిన్స్, చిప్ డిజైన్ వంటి రంగాల్లో.. ఏఐ పురోగతి చాలా వేగంగా ఉంటుందని హెచ్చరించారు. ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్స్ మార్కెట్లో అడుగుపెట్టి వ్యాపార విధానాలను మార్చివేశాయి. మానవ మేధస్సుపై ప్రత్యక్ష ప్రభావం చూపించలేకపోయాయి. కానీ ఏఐ మనిషి ఆలోచనా శక్తిని అనుకరిస్తూ.. చాలా పనులను వేగంగా చేస్తోంది. కాబట్టి ఇది సాధారణ సాంకేతిక పరివర్తన కాదు, ఒక తరం మొత్తాన్ని ప్రభావితం చేసే విప్లవాత్మక మార్పు అని ఆయన అభివర్ణించారు. ఆంత్రోపిక్ కంపెనీలో సేఫ్‌గార్డ్ రీసెర్చ్ టీమ్‌కు నాయకత్వం వహించిన మృణాంక్ శర్మ రాజీనామా చేశారు. ఆయన ఈ విషయాన్ని తన ఎక్స్ ఖాతాలో అధికారికంగా వెల్లడిస్తూ.. ప్రపంచం ప్రమాదంలో ఉందని చెబుతూ.. దీనికి కారణం కేవలం ఏఐ లేదా బయో వెపన్స్ మాత్రమే కాదు. ఒకదానితో ఒకటి ముడిపడిన అనేక సంక్షోభాల వల్ల ప్రమాదంలో ఉందని పేర్కొన్నారు. అయితే ప్రపంచాన్ని ప్రభావితం చేసే స్థాయికి మన జ్ఞానాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అప్పుడే మనం ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కోగలం అని పేర్కొన్నారు. లేకుంటే.. తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు.

## మెరుగైన రాబడులకు మార్గం



ఈక్విటీల్లో దీర్ఘకాలం కోసం ఇన్వెస్ట్ చేసుకునే వారు.. వివిధ రకాల పథకాలను ఎంపిక చేసుకుంటూ ఉంటారు. ఎక్కువ మంది పోర్ట్‌ఫోలియోలో లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్ కనిపిస్తుంటాయి. ఇలా భిన్న పథకాలకు కేటాయింపులు చేసుకునే బదులు.. ఒకే పథకం ద్వారా అన్ని విభాగాల్లోనూ పెట్టుబడులు పెట్టుకోవాలని భావించే వారికి ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ అనుకూలంగా ఉంటాయి. అంటే మార్కెట్ విలువ పరంగా ఇవి ఏదో ఒక విభాగానికే పరిమితం కాకుండా.. అన్ని రకాల అవకాశాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఈ విభాగంలో టాప్ ఫండ్స్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ఫ్లెక్సీక్యాప్ ఫండ్ ఒకటి.

**రాబడులు**

ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసిన వారికి గడిచిన ఏడాది కాలంలో రాబడి 16.19 శాతం వచ్చింది. ఇక గడిచిన మూడేళ్లలో వార్షిక రాబడి 23.07 శాతం చొప్పున నమోదైంది. ఐదేళ్లలోనూ ఏటా 21.33 శాతం చొప్పున రాబడిని ఈ పథకం ఇన్వెస్టర్లకు అందించింది. ఇక ఈ ఫండ్ ఆరంభం నుంచి (1995) చూసుకున్నా.. వార్షిక రాబడి 16.78 శాతం చొప్పున ఉండడం గమనించొచ్చు. ఈ పథకంలో కనీసం రూ.100 నుంచి సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

**పెట్టుబడుల విధానం**

ఈ పథకం ఈక్విటీల్లో కనీసం 65 శాతం తగ్గకుండా, గరిష్టంగా 100 శాతం వరకు పెట్టుబడులు పెడుతుంది. లార్జ్‌క్యాప్స్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ మధ్య ఎలాంటి పరిమితులు లేకుండా.. మెరుగైన వృద్ధి అవకాశాలు ఏ విభాగంలో ఉంటే అక్కడ కేటాయింపులు పెంచే స్వేచ్ఛతో పనిచేస్తుంది. ఈక్విటీ పెట్టుబడుల విలువను ఊహించని షాక్‌ల నుంచి రక్షించుకునేందుకు పరిస్థితులకు అనుగుణంగా డెరివేటివ్స్ (ఫ్యూచర్, ఆప్షన్ కాంట్రాక్టులు) పొజిషన్లలోనూ కొంత ఇన్వెస్ట్ చేస్తుంటుంది. పరిస్థితులను బట్టి డెట్ సాధనాల్లో అరుదుగా (ఈక్విటీలు మరీ ఖరీదుగా మారినప్పుడు) 35 శాతం వరకూ ఇన్వెస్ట్ చేస్తుంది. రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్)ల్లోనూ పెట్టుబడులు పెడుతుంటుంది. సగటు కంటే అధిక రాబడులు అందించాలన్నది ఈ పథకం ఉద్దేశం.

**పోర్ట్ ఫోలియో**

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.97,451 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో ఈక్విటీల్లో 82.12 శాతం ఇన్వెస్ట్ చేయగా, రియల్ ఎస్టేట్ సాధనాల్లోనూ 2.32 శాతం మేర పెట్టుబడి పెట్టింది. డెట్ సెక్యూరిటీల్లో కేవలం 0.53 శాతం పెట్టుబడులు ఉండగా, 15 శాతం మేర నగదు నిల్వలు ఉన్నాయి. మార్కెట్ వ్యాల్యూషన్లు ఆకర్షణీయంగా లేనప్పుడు ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ ఇలా చెప్పుకోతగ్గ స్థాయిలో నగదు నిల్వలు నిర్వహిస్తుంటాయి. ఈక్విటీ పెట్టుబడులను పరిశీలించగా.. ఇందులో 70 శాతం మేర లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్ కంపెనీల్లో 4.25 శాతం, స్మాల్‌క్యాప్ కంపెనీల్లో 9.35 శాతం చొప్పున ఇన్వెస్ట్ చేసింది. రంగాల వారీ కేటాయింపులను పరిశీలించగా, అత్యధికంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లో 47 శాతం, కన్జ్యూమర్ డిస్క్రీషనరీ కంపెనీల్లో 16.87 శాతం, టెక్నాలజీ కంపెనీల్లో 11.20 శాతం, హెల్త్‌కేర్ కంపెనీల్లో 8.18 శాతం, మెటీరియల్స్ కంపెనీల్లో 6.61 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి.

## మ్యూచువల్ ఫండ్స్.. కొత్త ఆఫర్స్!




ఓవైపు జీవిత బీమా భద్రత పొందుతూనే మరోవైపు సంపదను పెంచుకునేందుకు అవకాశం కల్పిస్తూ టాటా ఏఐఏ లైఫ్ కొత్తగా ఎన్హాన్స్‌డ్ వేల్యూ ఇండెక్స్ ఫండ్స్‌ని ఆవిష్కరించింది. ఎన్‌హాన్స్‌డ్ వేల్యూ ఇండెక్స్ ఫండ్, ఎన్‌హాన్స్‌డ్ వేల్యూ ఇండెక్స్ పెన్షన్ ఫండ్ వీటిలో ఉన్నాయి. ఇవి ప్రధానంగా వేల్యూ ఇన్వెస్టింగ్ పద్ధతిలో లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ కంపెనీల స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తాయి. టాటా ఏఐఏ యూనిట్ లింక్డ్ ప్లాన్ల ద్వారా వీటిని తీసుకోవచ్చు. పిల్లల చదువులు, అసెట్స్ సమకూర్చుకోవడం, దీర్ఘకాలిక ఆర్థిక భద్రత మొదలైన ప్రణాళికలకు మొదటి ఫండ్ ఉపయోగకరంగా ఉంటుంది. రిటైర్మెంట్ నిధిని ఏర్పర్చుకోవడానికి రెండోది పని చేస్తుంది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఫిబ్రవరి 16 వరకు అందుబాటులో ఉంటుంది.

**ఓల్డ్ బ్రిడ్జ్ ఫ్లెక్సి క్యాప్ ఫండ్**

లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసే ఈ ఫండ్‌ని ఓల్డ్ బ్రిడ్జ్ మ్యూచువల్ ఫండ్ ప్రవేశపెట్టింది. ఫిబ్రవరి 23 వరకు ఇది అందుబాటులో ఉంటుంది. బాటమ్-అప్ వ్యూహంతో దీర్ఘకాలిక పెట్టుబడి వృద్ధికి దోహదపడే స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. అయిదేళ్లకు పైగా పెట్టుబడులు కొనసాగించే వారికి అనువైన ఫండ్. కనీసం రూ. 5,000 నుంచి, సిప్ అయితే రూ. 1,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. కేవలం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఆధారంగా పెట్టుబడులను కేటాయించకుండా కంపెనీ వ్యాపార నాణ్యత, వృద్ధి అవకాశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. బీఎస్ఈ 500 టీఆర్ఐ దీనికి ప్రామాణికంగా ఉంటుంది.

## జియో ఏఐ పెవిలియన్ సందర్శించిన మోదీ



ఢిల్లీలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ జియో ఇంటెలిజెన్స్ పెవిలియన్‌ను సందర్శించారు. ఇక్కడ జియో ఏఐ స్టాక్, జియో సంస్కృతి ఏఐ, జియో ఆరోగ్యం ఏఐ, జియో శిక్షా, జియో ఏఐ హోమ్ వంటి వివిధ ఏఐ మోడల్స్ వీక్షించారు. జియో ఏఐ మోడల్స్ అన్నీ కూడా ఎంటర్‌ప్రైజ్ ఇంటెలిజెన్స్‌ను నడిపించడానికి, భారతీయ భాషలు & సాంస్కృతిక కంటెంట్‌ను ప్రోత్సహించడానికి, ఆరోగ్య సంరక్షణ డెలివరీని మెరుగుపరచడానికి, విద్యా వ్యవస్థలను బలోపేతం చేయడానికి & ఏఐ బేస్డ్ స్మార్ట్ లివింగ్‌ను ప్రారంభించడానికి ప్రత్యేకంగా రూపొందించారు. ఏఐ ఎకోసిస్టమ్ & వివిధ రంగాల్లో డిజిటల్ మార్పును వేగవంతం చేయడంలో ఏఐ పాత్ర గురించి జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాష్ అంబానీ.. ప్రధాని నరేంద్ర మోదీకి వివరించారు. సంస్థ 'ఏఐ ఫర్ ఆల్' (అందరికి ఏఐ) అనే దృక్పథాన్ని ప్రతిపాదిస్తూ, ఆధునిక సాంకేతికతలను అందరికీ చేరువయ్యేలా చూస్తోందని అన్నారు.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



## ఇజ్రాయెల్‌కు మోదీ.. షెడ్యూల్ ఫిక్స్..!



భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండురోజుల పర్యటన నిమిత్తం ఇజ్రాయెల్ వెళ్లనున్నారు. ఆయన పర్యటన వివరాలను ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహూ స్వయంగా వెల్లడించారు. ప్రధాని మోదీ పర్యటనతో రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. ఇజ్రాయెల్ ప్రధాని ఆ దేశ పార్లమెంటులో ప్రసంగిస్తూ.. "భారత ప్రధాని వచ్చేవారం ఇజ్రాయెల్ పర్యటనకు రానున్నారు. రెండు దేశాల మధ్య ప్రస్తుతం అద్భుతమైన సంబంధాలున్నాయి. ఇప్పుడు మరిన్ని అంశాలపై చర్చించబోతున్నాం. మనందరికి తెలుసు ఇండియా చిన్న దేశం కాదు. 140 కోట్ల జనాభా ఉన్న దేశం. చాలా శక్తివంతమైనది. చాలా పాపులరైంది" అని అన్నారు. ఇజ్రాయెల్‌గాజా యుద్ధంలో రెండు దేశాల సిద్ధాంతం ప్రతిపాదిస్తూనే టెల్ అవీవ్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తుందని తెలిపారు. అయితే దీనిపై ప్రధాని మోదీ స్పందించారు.. "నా మిత్రుడు ప్రధాని నెతన్యాహుతో ఇదివరకే ఫోన్‌లో సంభాషించాను. ఇజ్రాయెల్ఇండియా వ్యూహాత్మక సంబంధాలపై చర్చించాము. రెండుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం దిశగా చర్చలు జరుపుతున్నాము. అదేవిధంగా టెర్రరిజాన్ని మాత్రం ఎట్టిపరిస్థితిలో సహించేది లేదు. ఆ ప్రాంతంలో శాంతి, సుస్థిరత సాధించేందుకు భారత్ తన పూర్తి సహకారాన్ని అందిస్తుంది." అని మోదీ అన్నారు. భారత ప్రధాని ఫిబ్రవరి 25న ఇజ్రాయెల్ వెళ్లనున్నారు. అయితే ఇజ్రాయెల్ ప్రధాని భారత్‌లో పర్యటించాల్సి ఉండగా పలు కారణాలతో ఆయన పర్యటన రద్దైంది.

## తారిఖ్ రెహ్మాన్.. ఈ సవాళ్లకు జవాబేది?

**సుదీర్ఘ ప్రవాసం, అలుపెరగని పోరాటం, చివరకు ప్రజాక్షేత్రంలో తిరుగులేని విజయం.. బంగ్లాదేశ్ నూతన సారథిగా తారిఖ్ రెహ్మాన్ పగ్గాలు చేపట్టబోతున్నారు. అయితే రెహ్మాన్‌కు ఈ విజయం పూలబాట కాదు. ఒకవైపు ఏళ్ల నాటి పాత గాయాలు, మరోవైపు రాజకీయ శత్రువుల అణచివేత.. వీటన్నింటి మధ్య తారిఖ్ ఇచ్చే 'చట్టబద్ధ పాలన' హామీ దేశాన్ని ఏ దిశగా నడిపించబోతోంది? ఆయన అడుగులు ప్రతీకారం వైపా లేక పరివర్తన వైపా? అన్నది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది.**



### ప్రతీకారేచ్ఛను పక్కన పెడతారా?

జియావుర్ రెహ్మాన్ వారసుడిగా, ఖలీదా జియా తనయుడిగా తారిఖ్ రెహ్మాన్‌కు అధికారం కొత్త కాకపోవచ్చు, కానీ ఈసారి బాధ్యత అత్యంత భారంగా మారింది. అవామీ లీగ్ పతనం తర్వాత ఏర్పడిన రాజకీయ శూన్యాన్ని భర్తీ చేయడం ఆయన ముందున్న మొదటి సవాల్. గత ప్రభుత్వ హయాంలో అతనిపై మోపిన అక్రమ కేసులు, జైలు శిక్షలు, ప్రవాస జీవితం ఆయన మనసులో ప్రతీకారేచ్ఛను రగిలిస్తాయా? లేక ఒక పరిణతి చెందిన నాయకుడిగా మారుస్తాయా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

### 'చట్టబద్ధ పాలన' అతి పెద్ద పరీక్ష

తాజాగా విలేకరుల సమావేశంలో తారిఖ్ చెప్పిన చట్టబద్ధ పాలన అనే మాట ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అవామీ లీగ్ మద్దతుదారులు ప్రాణభయంతో తలదాచుకుంటున్న వేళ, ఆయన ఇచ్చిన ఈ భరోసా ఎంతవరకు కార్యరూపం దాల్చుతుందన్నది సందేహమే. కిందిస్థాయి కార్యకర్తల్లో ఉన్న ఆగ్రహాన్ని అదుపు చేస్తూ, చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకోకుండా యంత్రాంగాన్ని నడిపించడం అనేది ఆయన ముందున్న పెద్ద పరీక్ష.

### అందరి ఆమోదం సాధ్యమేనా?

షేక్ హసీనా నిష్క్రమణ తర్వాత అనాథలుగా మారిన అవామీ లీగ్ ఓటర్లు ఈ ఎన్నికల్లో మౌనంగా బీఎన్‌పీకి జై కొట్టారు. ఇది బీఎన్‌పీపై ఉన్న ప్రేమ కంటే, జమాత్ ఈ ఇస్లామీ లాంటి శక్తులు అధికారంలోకి రాకూడదనే భయం వల్ల జరిగిన మార్పు. ఈ విధంగా వచ్చిన ఓటు బ్యాంకును శాశ్వతంగా నిలబెట్టుకోవాలంటే తారిఖ్ రెహ్మాన్ తన పాలనలో అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.

### మతవాదం వెర్సస్ జాతీయవాదం?

బంగ్లాదేశ్ అంటేనే లౌకికవాదం ఇస్లామిక్ విలువల కలయిక. జమాత్ ఈ ఇస్లామీ ప్రభావం పెరగకుండా చూస్తూనే, మెజారిటీ ముస్లిం ఓటర్లను సంతృప్తి పరచడం తారిఖ్ ముందున్న కత్తిమీద సాము లాంటి వ్యవహారం. గతంలో పాకిస్తాన్ అనుకూల ముద్ర ఉన్న శక్తులతో దూరం పాటిస్తూ, బంగ్లాదేశ్ జాతీయ అస్తిత్వాన్ని కాపాడతామని ఆయన చేసిన వాగ్దానం మైనారిటీలలో ముఖ్యంగా హిందువులలో కొత్త ఆశలు రేకెత్తించింది.

### మహిళా ఓటర్ల మద్దతు కొనసాగేనా?

షరియా చట్టం, మహిళల విషయంలో కఠిన నిబంధనలు విధిస్తామన్న జమాత్ వ్యాఖ్యలు మహిళా ఓటర్లను బీఎన్‌పీ వైపు మళ్లించాయి. షేక్ హసీనా హయాంలో మహిళా సాధికారత కొంతవరకు మెరుగ్గా ఉండేది. ఇప్పుడు తారిఖ్ రెహ్మాన్ ఆ పురోగతిని కొనసాగిస్తారా? లేక సంప్రదాయవాదుల ఒత్తిడికి తలొగ్గుతారా? అన్నది వేచి చూడాలి. మహిళల భద్రత, ఉద్యోగ అవకాశాల విషయంలో ఆయన తీసుకునే నిర్ణయాలే ఆయన భవిష్యత్తును నిర్ణయిస్తాయి.

### అంతర్జాతీయ సవాళ్లు

బంగ్లాదేశ్ రాజకీయాల్లో భారత్, చైనా, అమెరికా వంటి దేశాల ప్రమేయం ఎప్పుడూ ఉంటుంది. అవామీ లీగ్ నిషేధం వెనుక విదేశీ హస్తం ఉందన్న ప్రచారం మధ్య, తారిఖ్ తన విదేశాంగ విధానాన్ని ఎలా మలుచుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. పొరుగు దేశాలతో సత్సంబంధాలు కొనసాగిస్తూనే, దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడటం అనేది ఆయన పరిపాలనా దక్షతకు గీటురాయి కానుంది.

### ఆర్థిక సంక్షోభాన్ని గట్టెక్కిస్తారా?

రాజకీయ సవాళ్లు ఒకెత్తయితే, కుప్పకూలుతున్న ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం మరో ఎత్తు. నిత్యావసర ధరల పెరుగుదల, నిరుద్యోగంతో దేశ యువత రగిలిపోతోంది. 2024, జూలై నాటి నిరసనలకు కారణమైన సమస్యలను పరిష్కరించకపోతే, ప్రజా ఆగ్రహం తనపైకి మళ్లడానికి ఎంతో సమయం పట్టదని తారిఖ్‌కు తెలుసు. అందుకే, ఆయన తక్షణ ప్రాధాన్యత ఆర్థిక సంస్కరణలవైపు ఉండాలి.

### దేశాన్ని సుస్థిరత వైపు నడిపిస్తారా ?

తారిఖ్ రెహమాన్ ముందు రెండు దారులు ఉన్నాయి. ఒకటి గతంలోని తప్పులను పునరావృతం చేస్తూ ప్రత్యర్థులపై ప్రతీకారం తీర్చుకోవడం, రెండు.. అందరినీ కలుపుకుపోయే ప్రజాస్వామ్యవాదిగా చరిత్రలో నిలిచిపోవడం. ఆయన ఎంచుకునే 'చట్టబద్ధ పాలన' అనే మార్గం బంగ్లాదేశ్‌ను సుస్థిరత వైపు నడిపిస్తుందా లేక మరో రాజకీయ అనిశ్చితికి దారితీస్తుందా అనేది కాలమే నిర్ణయించాలి.

## బ్రిటన్‌తో వాణిజ్య ఒప్పందం ఏప్రిల్ నుంచి అమల్లోకి...



**న్యూఢిల్లీ:** భారత్, బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఏప్రిల్ నుంచి అమల్లోకి రానుంది. ఈ ఒప్పందం ఏప్రిల్ నుంచి అమల్లోకి వస్తుందని ఆశిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. గతేడాది జూలై 24న ఇరు దేశాలు సమగ్ర ఆర్థిక వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ)పై సంతకం చేశాయి. 2030 నాటికి 56 బిలియన్ డాలర్ల వాణిజ్యాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా ఈ ఒప్పందం జరిగింది. ఇది అమల్లోకి వస్తే చాక్లెట్లు, బిస్కెట్లు, సౌందర్య సాధనాలు వంటి వస్తువులపై సుంకాలు తగ్గనున్నాయి. అంతేకాదు స్కాచ్ విస్కీపై 150 శాతం ఉన్న సుంకం 75 శాతానికి తగ్గనుంది. 2035 నాటికి 40 శాతానికి తగ్గిస్తారు. ప్రస్తుతం 110శాతం ఉన్న సుంకాలను రానున్న ఐదేళ్లలో 10శాతానికి తగ్గించనున్నారు. ఇవన్నీ దశలవారీగా అమలు కానున్నాయి. ఇక భారత్‌కు చెందిన ప్రస్త్రాలు, పాదరక్షలు, రత్నాలు-నగలు, క్రీడా సామగ్రి, బొమ్మలు వంటి ఉత్పత్తులను యూకేకు ఎగుమతి చేయడానికి అవకాశం ఉంటుంది. వ్యవసాయ ఉత్పత్తులను కూడా పన్నుల సుంకాలు లేకుండా ఎగుమతి చేసే లభించనుంది. ఈ ఒప్పందంతో దేశంలోని చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం కలుగుతుందని భావిస్తున్నారు.

**యూకే పార్లమెంట్ ఆమోదం తర్వాతే...**

అయితే ఈ ఒప్పందం అమలు కావడానికి ముందు యూకే పార్లమెంట్ ఆమోదం పొందాల్సి ఉంది. ఇటీవల యూకే పార్లమెంట్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్ ఈ ఒప్పందంపై చర్చించింది. ఈ సందర్భంగా వాణిజ్య శాఖ మంత్రి క్రిస్ బ్రయంట్ మాట్లాడారు. ఈ ఒప్పందం ఇరు దేశాల మధ్య చారిత్రాత్మక విజయమన్నారు. ఈ ఒప్పందాన్ని అమలు చేయడానికి ముందు రెండు సభల్లో చర్చలు, సమీక్షలు నిర్వహిస్తాయని తెలిపారు.

## అమెరికాలో అదృశ్యమైన భారతీయ విద్యార్థి మృతి



**న్యూయార్క్:** అమెరికాలో అదృశ్యమైన కర్నాటకకు చెందిన విద్యార్థి సాకేత్ శ్రీనివాసయ్య మృతి చెందారు. 22 ఏళ్ల సాకేత్ మృతదేహం శనివారం పోలీసులకు లభించినట్లు శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ ధ్రువీకరించింది. మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తరలించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని, కుటుంబానికి అవసరమైన సహాయాన్ని అందిస్తామని ఒక ప్రకటనలో తెలిపింది. సాకేత్ బర్కిలీ యూనివర్సిటీలో కెమికల్ అండ్ బయోమాలిక్యులర్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ చదువుతున్నారు. ఆయన ఫిబ్రవరి 9 నుంచి కనిపించకుండా పోయారు. మంగళవారం టిల్డెన్ రీజనల్ పార్క్‌లోని లేక్ అంజా దగ్గర కనిపించినట్టు పోలీసులు తెలిపారు. పార్క్ హిల్స్ పరిసరాల్లోని ఒక ఇంటి సమీపంలో ఆయన పాస్‌పోర్ట్, ల్యాప్‌టాప్‌తో కూడిన బ్యాక్‌పాక్ పోలీసులకు లభించింది

## మామయ్య చిరంజీవికి
# తొలి శుభలేఖ ఇచ్చిన అల్లు శిరీష్..

అల్లు వారి ఇంట త్వరలోనే పెళ్లి బాజా మోగబోతుంది. అల్లు అరవింద్ చిన్న కొడుకు అల్లు శిరీష్ వివాహం త్వరలోనే జరగబోతోంది. ఈ నేపథ్యంలో పెళ్లి కార్యక్రమాలు ఊపందుకున్నాయి. శుభలేఖలతో పెళ్లికి ఆహ్వానం పలుకుతున్నారు. సంప్రదాయం ప్రకారం ముందుగా చిరంజీవి కుటుంబానికి వెడ్డింగ్ కార్డు ఇచ్చారు.

**అల్లు శిరీష్ శుభలేఖ**

అల్లు అర్జున్ తమ్ముడైన అల్లు శిరీష్ పెళ్లికి ముందు కార్యక్రమాలు సందడిగా కొనసాగుతున్నాయి. రీసెంట్ గా పసుపు దంచుడు కార్యక్రమం నిర్వహించారు. ఇప్పుడు శుభలేఖలు పంచుతున్నారు. తెలుగు సంప్రదాయం ప్రకారం మొదటి శుభలేఖ మేనత్తకు ఇవ్వాలి. ఈ నేపథ్యంలోనే సురేఖచిరంజీవి దంపతులకు అల్లు అరవింద్ దంపతులు, అల్లు శిరీష్‌కలిసి వెడ్డింగ్ కార్డు ఇచ్చారు. ఈ ఫొటోను అల్లు శిరీష్ తన ఇన్ స్టాగ్రామ్ స్టోరీలో పోస్టు చేశాడు.

**తెలుగు సంప్రదాయం ప్రకారం**

''తెలుగు సంప్రదాయం ప్రకారం తొలి శుభలేఖ మా మామయ్య చిరంజీవి, అత్త సురేఖకు ఇచ్చాం'' అనే క్యాప్షన్ తో అల్లు శిరీష్ ఫొటో పోస్టు చేశాడు. తన ప్రేయసి నయనికను అల్లు శిరీష్ పెళ్లి చేసుకోబోతున్నాడు. వీళ్ల వెడ్డింగ్ మార్చి 6, 2026న జరగబోతుంది. అదే తేదీ అల్లు అర్జున్‌స్నేహారెడ్డి పెళ్లి రోజు కూడా కావడం విశేషం.



**చిరంజీవి చేతికి కట్టు**

అల్లు అరవింద్ దంపతులు, అల్లు శిరీష్ కలిసి చిరంజీవి దంపతులకు శుభలేఖ, పట్టు వస్త్రాలు అందించారు. అయితే ఈ ఫొటోలో చిరంజీవి ఎడమ చేతికి కట్టుతో కనిపించాడు. దీంతో మెగాస్టార్ కు ఏమైందోనని ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. అయితే రీసెంట్ గా మెగా స్టార్ చేతికి సర్జరీ అయిందని తెలిసింది. అందుకే ఆయన కట్టుతోకనిపించారని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

**బ్లాక్ బస్టర్**

మెగాస్టార్ చిరంజీవి రీసెంట్ గా మన శంకర వర ప్రసాద్ గారు మూవీ బ్లాక్ బస్టర్ హిట్ తో ఫుల్ జోష్ లో ఉన్నారు. సంక్రాంతి 2026కు రిలీజైన ఈ సినిమా సూపర్ డూపర్ హిట్ గా నిలిచింది. అంతేకాకుండా ఇటీవల రామ్ చరణ్‌ఉపాసన దంపతులకు ట్విన్స్ జన్మించారు. దీంతో మెగాస్టార్ ఆనందం రెట్టింపైంది. ఇలా వరుసగా సంతోషంలో మునిగి తేలుతున్న చిరంజీవి చేతికి గాయం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. మరోవైపు చిరు అప్ కమింగ్ మూవీ విశ్వంభర రిలీజ్ కు రెడీ అవుతుంది. 2026 సమ్మర్ లో ఈ సినిమాను రిలీజ్ చేసే అవకాశముంది.



## చూపు తిప్పుకోలేకపోతున్న కుర్రాళ్లు

ఉప్పెన సినిమాతో ఓవర్ నైట్ లో స్టార్ అయ్యింది అందాల భామ కృతిశెట్టి. తొలి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకుంది. అలాగే తన నటనతో అందంతో ప్రేక్షకులను కవ్వించింది ఈ చిన్నది. ఆ తర్వాత వరుసగా ఆఫర్స్ అందుకుంది. ఉప్పెన సినిమా తర్వాత కృతిశెట్టి శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు చిత్రాలతో హిట్స్ అందుకుంది. దాంతో టాలీవుడ్ లో లక్కీ హీరోయిన్ గా మారిపోయింది ఈ చిన్నది. కానీ ఆ తర్వాత ఈ బ్యూటీ నటించిన సినిమాలన్నీ అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. దీంతో తెలుగులో ఆమెకు అవకాశాలు తగ్గిపోయాయి. ప్రస్తుతం తమిళంలో అవకాశాలు అందుకుంటుంది. ఈ ముద్దుగుమ్మ 2003 సెప్టెంబరు 21న కర్ణాటకలోని మంగళూరులో జన్మించింది, ముంబైలో పెరిగింది. ఆమె తండ్రి కృష్ణ శెట్టి వ్యాపారవేత్త, తల్లి నీతి శెట్టి ఫ్యాషన్ డిజైనర్. చిన్నతనం కృతి శెట్టి ఐడియా, షాపర్స్ స్టాప్, పార్లే, లైఫ్‌బాయ్ వంటి పలు బ్రాండ్‌ల వాణిజ్య ప్రకటనల్లో నటించింది. ఇక ఈ ముద్దుగుమ్మ తన కెరీర్ ను చైల్డ్ ఆర్టిస్ట్ గా ఇండస్ట్రీకి పరిచయం అయ్యింది. కృతి 2019లో హిందీ చిత్రం సూపర్ 30లో చిన్న పాత్రతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. సోషల్ మీడియాలో ఈ బ్యూటీ షేర్ చేసే ఫోటోలకు నెట్టింట మంచి క్రేజ్ ఉంది. ఆమె ఫోటోలకు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. ఈ మధ్య గ్లామర్ డోస్ పెంచి ఫోటోలను షేర్ చేస్తుంది ఈ అందాల తార.

## హీరోయిన్ ప్రత్యూష హత్య కేసులో
# నేడే తుది తీర్పు..



అప్పటి తెలుగు హీరోయిన్ ప్రత్యూష గురించి అందరికీ తెలుసు. వర్ధమాన తారగా ఒక వెలుగు వెలిగిన ప్రత్యూష కొద్ది రోజులకి హత్యకు గురైంది. ఉమ్మడి రాష్ట్రంలో తీవ్రం సంచలనంగా మారిన ఈ కేసులో పోలీసు విచారణ పై అనేక అభ్యంతరాలు, ఆరోపణలు వెలువెత్తాయి. ఈ కేసులో అప్పటి ప్రభుత్వంలో ఉన్న మంత్రుల కుమారుల హస్తం ఉన్నట్లుగా ఆరోపణలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును సిబిఐకి అప్పగించింది. 2002లో ఈ హత్య జరగగా సుదీర్ఘకాలం పాటు ఈ కేసును విచారించిన సిబిఐ తాజాగా ఈ కేసులో చార్జీ షీట్ దాఖలు చేసింది. ఇందులో ప్రత్యూష స్నేహితుడు సిద్ధార్థ రెడ్డిని సీబీఐ నిందితుడిగా పేర్కొంది. దీంతో కేసుపై విచారణ జరిపిన నాంపల్లి స్టేషన్ కోర్టు సిద్ధార్థ రెడ్డికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. అయితే ప్రత్యూష కుటుంబం మాత్రం ఈ నేరానికి కేవలం ఏడేళ్ల జైలు శిక్ష సరిపోదు అంటూ హైకోర్టును ఆశ్రయించింది. ప్రత్యూషను క్రూరంగా అత్యాచారం చేసి హత్య చేశారని ఆమె తల్లి ఆరోపించింది. ఈ నేరానికి జీవితకాల శిక్ష విధించాలని 2006లో హైకోర్టును ఆశ్రయించింది. 2011 వరకు ఐదేళ్ల పాటు ఈ కేసును విచారించిన హైకోర్టు సిద్ధార్థ రెడ్డికి వ్యక్తిరేకంగా బలమైన సాక్షాధరాలు లేవని జైలు శిక్షను రెండున్నర ఏళ్లకు తగ్గించింది. దీంతో 2011లో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ప్రత్యూష కుటుంబం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసును పరిగణలోకి తీసుకున్న సుప్రీం కోర్టు దీనిపై విచారణ జరపడం ప్రారంభించింది. అప్పటి నుంచి సుమారు 14 ఏళ్లపాటు సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణ కొనసాగుతూనే ఉంది. ఎట్టకేలకు మంగళవారం ఈ కేసులో తుది తీర్పు రానుంది. అయితే ఈ కేసులో నిందితుడిగా ఉన్న సిద్ధార్థ రెడ్డికి శిక్ష పెంచుతారా? లేదా హైకోర్టు జడ్జిమెంట్‌తో ఏకీభవించి అతని శిక్షణు తగ్గిస్తారనేది ఇప్పుడు సర్వత్రా ఆసక్తిగా మారింది.

## ఎర్ర చీరలో దోర జామ పండులా..
# కీర్తి ఎంత ముద్దుగా ఉందో కదా..

మలయాళి ముద్దుగుమ్మ కీర్తి గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ చిన్నది తన అంద చందాలతోనే ప్రతి ఒక్కరినీ కట్టి పడేస్తుంది. ముఖ్యంగా ఈ అమ్మడు నటనకు ప్రతి ఒక్కరూ ఫిదా అవ్వాల్సిదే. ఏ పాత్రలోనైనా ఇట్టే ఒదిగిపోతూ, తన నటనతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. నేను శైలజ మూవీతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టి మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ మూవీ తర్వాత ఈ ముద్దుగుమ్మకు వరసగా ఆఫర్స్ వచ్చాయి. ముఖ్యంగా మహానటి సినిమాలో నటించి ఓవర్ టైమ్ స్టార్ హీరోయిన్‌గా సత్తా చాటింది. ఈ మూవీలో ఈ అమ్మడు నటనకు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. ఇక ఈ మూవీ తర్వాత వరసగా అవకాశాలు అందుకొని, టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా సత్తా చాటింది. అంతే కాకుండా తెలుగులో స్టార్ హీరోల సరసన నటించి, మెప్పించింది. ఇక ఈ మధ్య ఈ ముద్దుగుమ్మ తన చిన్ననాటి స్నేహితుడిని వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. దీని తర్వాత ఈ అమ్మడు గ్లామర్ మరింత పెంచింది. తెలుగులో అవకాశాలు తగ్గినా, బాలీవుడ్ వైపు వెళ్లి అక్కడ వరసగా సినిమాలు చేస్తూ, మంచి గుర్తింపు తెచ్చుకుంటుంది. వరుణ్ ధావన్‌తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ, ఉప్పు కప్పురంబు మూవీతో అమెజాన్ ప్రైమ్‌లో టాప్ రేంజ్‌లో కొనసాగుతుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది. తాజాగా రెడ్ కలర్ చీరలో ఉన్న ఫొటోస్ షేర్ చేసింది. ఈ ఫొటోస్ నెటిజన్స్‌ను తెగ ఆకట్టుకుంటున్నాయి.





# స్టార్ కిడ్స్ పై నెగెటివ్ పీఆర్

బాలీవుడ్‌లో ఇప్పుడు ఎక్కడ చూసినా స్టార్ కిడ్స్ హవా నడుస్తోంది. గతేడాది 'ఉయి అమ్మ' అనే సాంగ్ సెన్సేషన్ క్రియేట్ చేసింది. అయితే, ఈ పాటలో స్టార్ కిడ్ రాషా తడానీ నటించినప్పటికీ ఆమె డ్యాన్స్, ఎక్స్‌ప్రెషన్స్‌కు మంచి క్రేజ్ వచ్చింది. ఇతర స్టార్ కిడ్స్ కంటే రాషా చాలా బెటర్ అని తెగ కామెంట్స్ వచ్చాయి.

**రాషా తడానీపై రూమర్స్**

అలా ఉయి అమ్మ సాంగ్ విడుదలై సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేసిన తర్వాత సీనియర్ హీరోయిన్, కేజీఎఫ్ 2 నటి రవీనా టాండన్ కూతురు అయిన రాషా తడానీపై కొన్ని రూమర్స్ మొదలయ్యాయి.

**స్టార్ కిడ్స్ పై నెగెటివ్ పీఆర్**

తన సొంత ఇమేజ్‌ని పెంచుకోవడానికి ఇతర స్టార్ కిడ్స్‌పై రాషా తడానీ నెగెటివ్ పీఆర్ (Negative PR) చేయిస్తోందని నెట్టింట కొందరు ప్రచారం చేస్తున్నారు. ఈ రూమర్లపై రవీనా టాండన్ తాజాగా స్పందిస్తూ గట్టి కౌంటర్ ఇచ్చారు.

**మా కుటుంబానికి అలాంటి అవసరం లేదు**

ఒక పాపులర్ పాడ్‌కాస్ట్ సెషన్‌లో పాల్గొన్న రవీనా టాండన్ తన కూతురిపై వస్తున్న ఆరోపణలను పూర్తిగా తోసిపుచ్చారు. "నా సుదీర్ఘ కెరీర్‌లో నేను ఎప్పుడూ ఒక పీఆర్ వ్యక్తిని పెట్టుకోలేదు. అలాంటిది మా స్నేహితుల పిల్లల గురించి, మా కళ్ల ముందే పెరిగిన పిల్లల గురించి తప్పుగా ప్రచారం చేయాల్సిన అవసరం మాకు లేదు. ఇది మా కుటుంబ సంస్కృతే కాదు" అని రవీనా టాండన్ తన ఆవేదన వ్యక్తం చేశారు.

**విషపూరితమైన ఫ్యాన్ వార్స్**

ఈ వివాదం 'ఉయి అమ్మ' సాంగ్ విడుదల తర్వాత మొదలైందని రవీనా గుర్తు చేశారు. కొందరు ఫ్యాన్స్ రాషాను ప్రశంసిస్తూనే ఇతర స్టార్ కిడ్స్‌తో పోలికలు పెట్టడం, అది కాస్తా విషపూరితమైన ఫ్యాన్ వార్స్ (Fan Wars)కి దారితీయడం దురదృష్టకరమని రవీనా టాండన్ పేర్కొన్నారు. ఎవరో ఒకరిని తక్కువ చేసి చూపిస్తేనే మనం గొప్పవాళ్లం అవుతామనే నీచమైన ఆలోచన ఎవరికీ ఉండదని ఆమె నొక్కి చెప్పారు.

**రాషా సినీ ప్రయాణం**

ఇకపోతే అభిషేక్ కపూర్ దర్శకత్వంలో వచ్చిన 'ఆజాద్' సినిమాతో రాషా తడానీ హిందీ చిత్ర పరిశ్రమలో తన సినీ ప్రయాణాన్ని మొదలుపెట్టింది. ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఆడకపోయినా, రాషా డ్యాన్స్, నటనకు మాత్రం మంచి మార్కులే పడ్డాయి. ప్రస్తుతం రాషా చేతిలో ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నాయి.

**లైకీ లైకా:**

అభయ్ వర్మతో కలిసి నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. ఇందులో రాషా తడానీ 'ఛాప్ తిలక్' అనే పాటతో సింగర్‌గా కూడా పరిచయం కాబోతోంది.

**టాలీవుడ్ ఎంట్రీ:**

ఇటీవల రాషా తడానీ తన తెలుగు అరంగేట్రం గురించి కూడా ప్రకటన చేసింది. మెగా హీరోలతో ఆమె నటించబోతుందనే వార్తలు టాలీవుడ్‌లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

# ఇసుక లారీలతో స్తంభించిన గుట్ట మల్లారం ప్రధాన రహదారి

- అంబులెన్స్ లకే దారి దొరకని పరిస్థితి
- శబ్ద, దుమ్ము కాలుష్యంతో గ్రామస్తుల ఇక్కట్లు
- చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరిక



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని గుట్ట మల్లారం గ్రామంలో ఇసుక లారీల రాకపోకలతో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంది. భారీ లారీలు రహదారులపై అడ్డగోలుగా పార్క్ చేయడం, తరలింపుల కోసం గంటల తరబడి నిలిపివేయడం వల్ల గ్రామ రహదారులు స్తంభించి పోతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న లారీల సంఖ్యతో పరిస్థితి మరింత జఠిలమవుతోంది. లారీల శబ్ద కాలుష్యం దుమ్ముదులి కాలుష్యంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. ప్రత్యేకంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ సమస్య తీవ్ర రూపం దాల్చుతోంది. సాధారణ వాహనదారులు, గ్రామస్తులు గ్రామం లోపలికి రావాలన్నా, బయటకు వెళ్లాలన్నా గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు అత్యవసర సందర్భాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే అంబులెన్స్‌లకు కూడా మార్గం లేకపోవడం. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులు సమయానికి ఆసుపత్రికి చేరలేకపోతున్నారని, ఇది ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమేనని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించకపోవడం వలన పరిస్థితిని మరింత విషమం చేస్తోందని విమర్శిస్తున్నారు.మణుగూరు నుంచి కొత్తగూడెం వైపు వెళ్లే ప్రధాన రహదారిలో గుట్ట సమీపంలో లారీలను నిలిపివేయడం వల్ల ఇతర భారీ వాహనాలు, కార్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. సుమారు అర కిలోమీటర్ దూరం నుంచి వేగం తీసుకుని వచ్చినప్పుడే ఎత్తైన గుట్టను ఎక్కగల పరిస్థితి ఉండగా, మధ్యలో వాహనాలు నిలిచిపోవడంతో ఎత్తయిన రహదారిపైకి ఎక్కలేక వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించి ప్రమాదాలకు దారి తీసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇసుక మాఫియా అడ్డగోలుగా వ్యవహరిస్తున్నా, ట్రాఫిక్ నియంత్రణలో పోలీసు శాఖ విఫలమైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తక్షణమే లారీ రాకపోకలను నియంత్రించాలని, అంబులెన్స్‌లు, అత్యవసర సేవలకు ప్రత్యేక మార్గం కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# న్యాయవాది ఖదీర్ హత్యను ఖండించిన మణుగూరు న్యాయవాదులు



**మణుగూరు, మహా :** హైదరాబాద్ నగరంలోని అత్తాపూర్ ప్రాంతంలో న్యాయవాది మహమ్మద్ ఖదీర్ హత్యకు గురైన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మణుగూరు బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా మణుగూరు కోర్టు ప్రాంగణంలో నల్ల బ్యాడ్జీలు ధరించి న్యాయవాదులు సంఘీభావం ప్రకటించారు. ఖదీర్ హత్యను తీవ్రంగా ఖండిస్తూ, నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. న్యాయవాదులపై జరుగుతున్న దాడులు ప్రజాస్వామ్యానికి ముప్పు. న్యాయవాదుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలి. అడ్వకేట్లకు రక్షణ చట్టం అమలు చేయాలి. న్యాయవాదుల సంక్షేమం, భద్రత, సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.న్యాయవృత్తి గౌరవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు అవసరమని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో మణుగూరు బార్ అసోసియేషన్ కార్యదర్శి చిర్ర రవికుమార్, న్యాయవాదులు అంకం సర్వేశ్వరరావు, పోశం భాస్కర్, జాడి చొక్కాయ, ఈర్ల రాము, వాసవి తదితరులు పాల్గొన్నారు.

# ఒకే ఇంటి నుంచి చైర్మన్–వైస్ చైర్మన్

**అశ్వారావుపేట పురపాలక సంఘంలో అరుదైన ఘట్టం**



**అశ్వారావుపేట, మహా :** అశ్వారావుపేట పట్టణ రాజకీయాల్లో అరుదైన పరిణామం చోటుచేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట పురపాలక సంఘంలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఒకే కుటుంబానికి దక్కడం చర్చనీయాంశమైంది. మొత్తం 22 వార్డులలో 17 వార్డులు కాంగ్రెస్ పార్టీ ఖాతాలో పడటంతో పురపాలక పీఠం కాంగ్రెస్ వశమైంది. 13వ వార్డు నుంచి జూపల్లి రమేష్ బాబు, 6వ వార్డు నుంచి ఆయన సతీమణి జూపల్లి శశికళ కౌన్సిలర్లుగా విజయం సాధించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల అధికారి కార్తీక్ సమక్షంలో ఇద్దరూ కౌన్సిలర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మెజారిటీ బలంతో జూపల్లి శశికళ చైర్మన్‌గా, జూపల్లి రమేష్ బాబు వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. నూతనంగా ఏర్పడిన అశ్వారావుపేట పురపాలక సంఘానికి ఇది తొలి ఎన్నిక కావడం విశేషం. తొలి ఎన్నికలలోనే ఒకే ఇంటి నుంచి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు దక్కడం స్థానికంగా చర్చకు దారి తీసింది. జూపల్లి దంపతుల ఎన్నికతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇకపై పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదలపై కొత్త బృందం ఎలా పనిచేస్తుందో చూడాలి.

### ఆదర్శ మున్సిపాలిటీగా అశ్వారావుపేట అభివృద్ధికి

# సమిష్టి కృషి అవసరం - జారె ఆదినారాయణ



**అశ్వారావుపేట, మహా :** అశ్వారావుపేట మున్సిపాలిటీని ఆదర్శ పురపాలక సంఘంగా తీర్చిదిద్దేందుకు అన్ని వర్గాల ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పిలుపునిచ్చారు. సోమవారం మున్సిపాలిటీ భవనంలో నిర్వహించిన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన హాజరయ్యారు. నూతన చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ప్రజాప్రతినిధి ప్రధాన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా ఉండాలని, రాజకీయ భేదాభిప్రాయాలను పక్కనపెట్టి ప్రజా సమస్యల పరిష్కారంలో ఏకమై పనిచేయాలని సూచించారు. స్వార్థ ప్రయోజనాలకు లోనుకాకుండా ప్రజాహితాన్ని ముందుంచుకుని పారదర్శకత, నిబద్ధతతో సేవలందించాలని నూతన ప్రజాప్రతినిధులకు హితవు పలికారు. పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధి, పరిశుభ్రత, తాగునీటి సరఫరా, వీధిదీపాలు, కాల్వల నిర్మాణం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. అశ్వారావుపేట మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా కొత్త పాలకవర్గం సమన్వయంతో ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కొలువుతీరిన కార్పోరేషన్ పాలక మండలి

- మేయర్ గా మూడ్ గణేష్
- డిప్యూటీ మేయర్గా లలిత కుమారి
- చెరో రెండున్నరేళ్ల పాలన
- బిఆర్ఎస్ కార్పోరేటర్లు గైర్హాజర్
- ర్యాలీగా కార్పోరేషన్ కార్యాలయానికి
- సందడిగా మారిన ప్రాంగణం





**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కొత్తగూడెం కార్పోరేషన్ తొలి పాలకవర్గ కొలువుతీరింది. మేయర్ మూడ్ గణేష్(20వ డివిజన్), డిప్యూటీ మేయర్ గా సిరిపురపు లలితకుమారి(8వ డివిజన్)లు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. తొలుత ఆయా డివిజన్ల నుండి గెలుపొందిన వారితో కార్పోరేటర్లుగా జిల్లా జాయింట్ కలెక్టర్ వేణుగోపాలరావు సోమవారం ప్రమాణస్వీకారం చేయించిన అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ల ఎంపిక జరిగింది. సిపిఐ కార్పోరేటర్ అడుసుమిల్లి సాయిబాబా మేయర్ గా మూడ్ గణేష్ను ప్రతిపాదించగా స్వతంత్ర కార్పోరేటర్ కంభంపాటి దుర్గాప్రసాద్ బలపరిచారు. డిప్యూటీ మేయర్ గా సిరిపుర వులలిత కుమారిని కనుకుంట్ల శ్రీనివాస్ ప్రతిపాదించగా బోయిన విజయ్ కుమార్ బలపరిచారు. దీంతో మూడు రోజుల ఉత్కంఠతకు అంతా ఊపిరి పీల్చుకున్నారు.

**చెరో రెండున్నరేళ్ల పాటు..**

అభ్యర్థుల నామినేషన్ల నాటి నుండి ఎన్నికల ఫలితాలు వెలువడి పదవులు చేపట్టేంత వరకు తీవ్ర ఉత్కంఠ వాతావరణం కార్పోరేషన్ వ్యాప్తంగా నెలకొంది. ప్రధానంగా సిపిఐ, కాంగ్రెస్ పార్టీలకు సీట్లు సమానంగా రాగా మేయర్ పీఠం ఎవరిని వరిస్తుందో అనే టెన్షన్ నెలకొంది. కాగా సిపిఐ, కాంగ్రెస్ల అగ్రనాయకత్వం చర్చోపచర్చల అనంతరం ఐదేళ్ల పాలనను చెరో రెండున్నరేళ్ల పాటు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఒప్పందంలో భాగంగా తొలి రెండున్నరేళ్లు సిపిఐకు చెందిన మూడ్ గణేష్ మేయర్, కాంగ్రెస్కు చెందిన సిరిపురపు లలిత కుమారి డిప్యూటీ మేయర్ గా పదవులు చేపట్టారు. మరో రెండున్నరేళ్లు మేయర్గా కాంగ్రెస్, డిప్యూటీ మేయర్ పదవిని సిపిఐ చేపట్టనుంది. దీంతో కొత్తగూడెం తొలి కార్పోరేషన్ పాలక మండలి కొలువుతీరింది. ఇదిలా ఉండగా బిఆర్ఎస్ నుండి గెలిచిన ఎనిమిది మంది కార్పోరేటర్లు గైర్హాజరయ్యారు. కాగా వీరు మరోరోజు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

**సమిష్టిగా..**

ఇరు పార్టీల అగ్రనాకత్వం ఒప్పందం ప్రకారం సమిష్టిగా కలిసి ముందుకు సాగేందుకు నిర్ణయించుకున్నారు. ఇందు కోసం ప్రమాణస్వీకారానికి ముందుగా ఓ హోటల్లో ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎయిఎల్ఎ కూనంనేని సాంబశివ రావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పల్లా వెంకటరెడ్డి, భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషాలు కార్పోరేటర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జరిగిన ఒప్పందాన్ని వారికి వివరించి అదినాయకత్వం మాటే శిరోధార్యమని చెప్పి మేయర్, డిప్యూటీ మేయర్ పేర్లను ప్రకటించారు. అనంతరం ర్యాలీగా కార్పోరేషన్ కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో దారి పొడవునా సందడి వాతావరణం నెలకొంది. ర్యాలీలో అగ్రభాగాన కూనంనేని నిలవడంతో పెద్ద ఎత్తున అభివాదాలు, నినాదాలు మిన్నంటాయి.

**సందడి నందడి..**

ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా కార్పోరేషన్ కార్యాలయం ఆవరణ సందడిగా మారింది. ఇరు పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలతో పాటు మేయర్ డిప్యూటీ మేయర్ కార్పోరేటర్ల బంధువులు స్నేహితులు అభిమానులు సన్నిహితులతో ఆ ప్రాంగణం జనసంద్రమైంది. ప్రామాణ స్వీకారం అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్, కార్పోరేటర్లు బయటకు రాగా పెద్దపెట్టున నినానాదలు చేశారు. వారిని కులుసుకుని అభినందనలు తెలిపేందుకు పోటీపడ్డారు.

# ఆదర్శవంతమైన పాలన అందించాలి

**ప్రజా ప్రతినిధులకు పొంగులేటి శుభాకాంక్షలు**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలకు నూతనంగా ఎన్నికైన మేయర్, చైర్మన్లతో పాటు, డిప్యూటీ మేయర్, వైస్ చైర్మన్లు, నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు తెలంగాణ రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఈ నూతన సారథులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పట్టణాల అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ తొలి మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన మూడ్ గణేష్ (సీపీఐ), డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన సిరిపురపు లలిత (కాంగ్రెస్)లకు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వీరితో పాటు జిల్లా వ్యాప్తంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లను ఆయన అభినందించారు. గెలిచిన ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆదర్శవంతమైన పాలన అందించాలని సూచించారు. పట్టణాల్లోని ప్రతి వార్డు, డివిజన్ అభివృద్ధి చెందాలంటే కౌన్సిలర్లు, కార్పొరేటర్లతో కూడిన పూర్తి పాలకవర్గం పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వార్డులు, డివిజన్లలోని మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నూతన పాలకవర్గాలు పనిచేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు.

# ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి

- బిఆర్ఎస్ కార్పొరేటర్లకు ఎంపీ రవిచంద్ర సూచన
- మేయర్ డిప్యూటీ మేయర్ ఎన్నికను బహిష్కరించిన బిఆర్ఎస్
- తెలంగాణ తల్లికి నివాళులు అర్పించిన కార్పొరేటర్లు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** బీఆర్ఎస్ కార్పొరేటర్లు కొత్తగూడెం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ మీద అభిమానంతో.. మీపై విశ్వాసంతో.. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలనమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా విశ్వాసాన్ని చూరాగొనాలని సూచించారు. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావులతో కలిసి ఎంపీ రవిచంద్ర కొత్తగూడెం కార్పొరేషన్ లో కొత్తగా ఎన్నికైన బీఆర్ఎస్ కార్పొరేటర్లతో సోమవారం స్థానిక తెలంగాణ భవన్ లో సమావేశమయ్యారు. అనంతరం కార్పొరేటర్లతో ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ కార్పొరేషన్ లో అధికార పక్షం చేసే తప్పులను గుర్తించి ఎప్పటికప్పుడు వాటిని ఎండగడుతూ నిలదీయాలని పిలుపు నిచ్చారు. అవసరమైతే ప్రజల పక్షాన పోరాటాలు చేయాలని సూచించారు. ఇదిలా ఉండగా మున్సిపల్ కార్యాలయంలో కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లతో జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బిఆర్ఎస్ పక్షాన ఎన్నికైన కార్పొరేటర్లు దూరంగా ఉన్నారు. తదనంతరం జరిగిన మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల కార్యక్రమాన్ని కూడా పార్టీ నిర్ణయం మేరకు కార్పొరేటర్లు బహిష్కరించారు. తొలుత బిఆర్ఎస్ కార్పొరేటర్లు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# విజయం దూరమైన అభ్యర్థులకు ధైర్యం

**బిఆర్ఎస్ నేత తాటి వెంకటేశ్వర్లు పరామర్శ**



**అశ్వారావుపేట, మహా :** మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర తొలి ట్రైకార్ చైర్మన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు పార్టీ అభ్యర్థులను పరామర్శించారు. విజయం సాధించలేకపోయిన అభ్యర్థుల నివాసాలకు వెళ్లి ధైర్యం చెప్పారు. ఎన్నికల్లో ఆశించిన ఫలితం రాకపోయినా అధైర్యపడవద్దని సూచించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ప్రజా క్షేత్రంలో కొనసాగుతూ కార్యకర్తలకు అండగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా జుజ్జురపు శ్రీరామమూర్తి నివాసాన్ని సందర్శించారు. అలాగే యు.ఎస్. ప్రకాష్, శెట్టిపల్లి రఘురాం గృహాలకు వెళ్లి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి కట్రం స్వామిదొర, మాజీ జిల్లా పరిషత్ ప్రాంతీయ అభివృద్ధి సభ్యుడు అంకిత మల్లికార్జునరావు, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సత్యవరపు సంపూర్ణ, ఏలేటి పార్వతి, ఎండి రెహానా బేగం, చిక్కం గోపికృష్ణ, ఆరేపల్లి రాంబాబు, నీలం రత్నవేణి, ఇస్లావత్ లక్ష్మి, నార్లపాటి శ్రీనివాస రావు, షేక్ మీరాబీ, తగరం జగన్నాథం పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి



**నేలకొండపల్లి, మహా:** గ్రామాభివృద్ధి లో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని అమ్మగూడెం "పంచాయతీ సర్పంచ్ పొట్ట లక్ష్మి సూచించారు. మండలం లోని అమ్మగూడెం లో సోమవారం సీసీ రోడ్ల నిర్మాణాకి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు...గ్రామాభివృద్ధి కోసం పాలకవర్గం శక్తి వంచన లేకుండా కృషి చేయనున్నట్లు తెలిపారు. దీనికి తోడు అధికారులతో పాటు రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. పంచాయతీ ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. మండలం లో అమ్మగూడెం ను ఆదర్శ పంచాయతీ గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పంచాయతీ అభివృద్ధి కి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేణు. వార్డు సభ్యులు భవాని, "కళ్యాణి. గ్రామ పెద్దలు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు: సత్యం. అడపాల రవీందర్, సురేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# సీహెచ్సీలో కాయకల్ప బృందం క్షేత్ర స్థాయి పరిశీలన



**నేలకొండపల్లి, మహా:** స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను సోమవారం కాయకల్ప బృందం పరిశీలించింది. కాయకల్ప ఇంటర్నల్ అసిస్టెంట్ డాక్టర్. ముక్కంటేశ్వరరావు బృందం ఆకస్మికంగా పరిశీలించింది. హస్పిటల్ లోని పరిసరాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న ఆహారం నాణ్యత ను పరిశీలించారు. రోగుల వద్ద కు వెళ్లి వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. మందుల పంపిణీ... ఎన్ని రకాల మందులు ఉన్నాయి. ఎంత మందికి అందిస్తున్నారు. ప్రతీ రోజు ఓపీ ఎంతటుంది. వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. హస్పిటల్ లో పారిశుధ్యం ను పరిసరాలు తిరిగి పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులతో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. కాయకల్ప కు అవసరమైన సౌకర్యాలు గురించి చర్చించారు. వైద్య సేవల పట సంతృప్తిని వ్యకం చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ మంగళ, డాక్టర్.కె.రాజేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పించాలని ఐటీడీఏ పీవోకి గిరిజన గ్రామాల ప్రజల వినతి



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపహాడ్ మండలంలోని ఆదివాసి గ్రామాలైన చింతకుప్ప శ్రీరాంపురం పాయం ఎస్టి కాలనీ గిరిజన గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలని భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్ కు సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా గ్రామస్తులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తమ చొరవ పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు చొరవతోనే గ్రావెల్ రోడ్లు పోయించారని అలాగే. మీ ఆదేశాలతో ఇటీవల కరెంటు పనులు ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు శంకుస్థాపన చేసిన ఫారెస్ట్ అధికారులు అడ్డు చెప్పడంతో అభ్యంతరంగా నిలిచిపోయిందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ సౌకర్యం కల్పించేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఈ రెండు గ్రామాలలో ప్రైమరీ పాఠశాల ,ఆరోగ్య ఉప కేంద్రం ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో మంచినీటి సదుపాయం కొరకు బోర్లు వేసిన వాటి నుంచి సరిగ్గా నీరు అందక ఇబ్బంది పడుతున్నామని మిషన్ భగీరథ పైపులు ద్వారా మంచినీటి సౌకర్యం అందించాలని కోరారు. గిరిజన గ్రామస్తుల వినతిని సానుకూలంగా స్పందించి వీలైనంత తొందరలో తన వంతు ప్రయత్నం చేస్తానని అన్నారని గిరిజన గ్రామస్తులు తెలిపారు.

# గున్నేపల్లి గుట్టపై ఉద్భవించిన శివలింగం

**పరుగులు తీస్తున్న గిరిజన భక్తులు.. అడ్డుకుంటున్న అటవీశాఖ అధికారులు**



**దమ్మపేట ,మహా :** మహా శివరాత్రి పండుగ వేళల్లో మండలంలోని గున్నేపల్లి అటవీప్రాంత గుట్టపై శివలింగం ఉద్భవించింది. గత నాలుగైదు రోజులుగా అక్కడి గిరిజన భక్తులు తండోపతండాలుగా తరలివెళుతూ శివలింగాన్ని దర్శించుకుంటున్నారు. ఈ విషయం సోమవారం వెలుగులోకి రావడంతో మరి కొందరు భక్తులు పూజలు ,అభిషేకాలు ,కొబ్బరికాయలతో మొక్కులు తీర్చుకొనేందుకు బారులు తీరారు. గమనించిన అటవీశాఖ అధికారులు భక్తులను గుట్టపైకి రాకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని అక్కడి గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఓ గిరిజన వ్యక్తి కి కలలో వరుసగా రెండురోజులు దర్శనం ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. ఏకంగా పూనకాలతో ,గణాచారాలతో ఆ ప్రాంత గిరిజన భక్తులకు దారి చూపిన సందర్భాలు ఉన్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. గత వారం రోజుల నుండి ఆ గ్రామంలో ఇదే సందడి వాతావరణం నెలకొని ఉంది.

# ఐక్యమత్యమే మహాబలం

- జట్టుగా ముందుకు సాగుతాం
- కార్పోరేషన్ అభివృద్ధే ధ్యేయం
- నూతన పాలక వర్గానికి అభినందనలు
- ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కార్పోరేషన్ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తామని, సిపిఐ కాంగ్రెస్ పార్టీలు కలిసికట్టుగా ముందుకు సాగుతాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు తెలిపారు. కార్పోరేటర్ల ప్రమాణ స్వీకారం, మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు సోమవారం ఏకగ్రీవ ఎన్నిక అనంతరం ఆయన మాట్లాడారు. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్లోని కొంత ప్రాంతం కలుపుకుని కార్పోరేషన్గా ఏర్పడిందని ఆ కార్పోరేషన్కు ఈనెల 11న ఎన్నికలు జరగగా 13న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయని చెప్పారు. చిన్న చిన్న బేదాభిప్రాయాల కారణంగా సిపిఐ, కాంగ్రెస్ పార్టీలు విడివిడిగా స్నేహపూర్వక పోటీలో భాగంగా ఎన్నికల్లోకి వెళ్లినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో సిపిఐ 22 డివిజన్ల వ్యాప్తంగా విజయం సాధిచడంతో పాటు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలిపిన స్వతంత్ర కార్పోరేటర్తో కలిసి మొత్తం 23 సీట్లు సాధించామన్నారు. సిపిఐకి చెందిన మూడ్ గణేష్ మేయర్, కాంగ్రెస్కు చెందిన సిరిపురపు లలిత కుమారి డిప్యూటీ మేయర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. నూతనంగా ఏర్పడిన కార్పోరేషన్ ఎంతో అభివృద్ధి చెందనుందని హైదరాబాద్ తర్వాత అంతటి విశిష్టత ఇక్కడ ఉందని తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధి మరింతగా జరుగుతుందని పెద్దపెద్ద కంపెనీలు ఇక్కడికి రావడం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రజల ఆర్థిక స్థితిగతుల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటాయని త్వరలో విమానాశ్రయంతో పాటు పెద్దపెద్ద పరిశ్రమలు రానున్నాయని చెప్పారు. రాగద్వేషాలకు పార్టీలు వ్యక్తులు శక్తులకు అతీతంగా అభివృద్దే ధ్యేయంగా అభివృద్ధికి పాటుపడతామని సానుకూల దృక్పదంతో ముందుకు వచ్చిన కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు తెలపడంతో పాటు ప్రమాణ స్వీకారం చేసిన పాలక మండలికి మేయర్ డిప్యూటీ మేయర్లకు అభినందనలు తెలిపారు. సుపరిపాలన దిశగా ముందుకు సాగాలని కార్పోరేషన్ అభివృద్దే ధ్యేయంగా నిర్ణయాలు తీసుకుని చక్కటి పాలనను ప్రజలకు అందించాలని కూనంనేని సూచించారు.

# పంచాయతీ అభివృద్ధిలో వార్డు సభ్యుల కీలకం

**ఎంపిడిఓ వివేక్ రామ్**



**మహా దుమ్ముగూడెం:** గ్రామపంచాయతీల అభివృద్ధి లో వార్డు సభ్యులు బాగాస్వాములు కావాలని వారి పాత్ర కీలకం అని దుమ్ముగూడెం ఎం పి డి ఓ వివేక్ రామ్ అన్నారు. సోమవారం పెద్దనాలపల్లి గ్రామపంచాయతీలో పంచాయతీ రాజ్ చట్టం పై వార్డ్ సభ్యులకు 5 రోజులుపాటు జరగనున్న శిక్షణ తరగతులను రైతు వేదిక భవన్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.చట్టంపై అవగాహన, గ్రామ పంచాయతీలో నిధుల సేకరణ, గ్రామ సభ లపై అవగాహన, వార్డ్ సభ్యుల విధులు, బాధ్యతలు మొదలైన వాటిపై వార్డు సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ అధికారి వీరారెడ్డి ఎం సాయి, కె సత్య నారాయణ, శ్రీహరి లు వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఐదు రోజులు శిక్షణ అనంతరం వార్డు సభ్యులకు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు నిర్వకులు తెలిపారు.